


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

### కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు నేడు సిఎం శంకుస్థాపన

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. మధ్యాహ్నం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకొని, అనంతరం కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని సిఎంవో కార్యాలయ అధికారులు వెల్లడించారు. అక్కడి నుంచి నేరుగా మేడిగడ్డకు చేరుకొని, డ్యామ్ సైట్‌ను పరిశీలించిన అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంపుటి 09, సంచిక: 140 | సోమవారం | 20-04-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ఎన్నికల కోడ్ ఉల్లంఘనే

- ప్రధాని జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై సిపిఐ ఆక్షేపణ
- సిఇసి జ్ఞానేష్‌కుమార్‌కు సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ లేఖ
- తక్షణమే జోక్యం చేసుకుని, చిత్తశుద్ధితో కూడిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి)ని ఉల్లంఘించారని సిపిఐ రాజ్యసభసభ్యులు పి.సందోష్‌కుమార్ తీవ్రంగా ఆక్షేపించారు. ఈ మేరకు తరువాయి 2లో



## సిఇసి జ్ఞానేష్‌కుమార్ తొలగింపునకు మళ్లీ నోటీస్!

కొత్త నోటీస్ ముసాయిదాను రూపొందించే పనిలో ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ మరో ప్రయత్నానికి ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. తమ మునుపటి నోటీసులు తిరస్కరించబడినప్పటికీ వెనకడుగు వేయకుండా మరో సారి తమ ప్రయత్నాలను మొదలు పెట్టినట్లు అత్యున్నత వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు పలు ప్రతిపక్ష పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నట్లు తెలిపాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకె సహా వివిధ పార్టీలకు చెందిన కనీసం ఐదుగురు సీనియర్ ఎంపిలు తొలగింపు ప్రక్రియను ప్రారంభించేందుకు కొత్త నోటీసు ముసాయిదాను తరువాయి 12లో

# ఎండా.. వానా..

- ఉదయం సూర్య ప్రతాపం.. సాయంత్రం వడగళ్ల వానలు
- తెలంగాణలో భిన్నమైన వాతావరణం
- మార్కెట్లలో తడుస్తున్న ధాన్యం
- ఉక్కిరిబిక్కిరవుతున్న అన్నదాత





ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వాతావరణం భిన్నంగా మారుతోంది. ఉదయం సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుంటే, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఏడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్ల వాన పడే అవకాశం ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, గజ్వేల్ జిల్లాల్లో గంటకు 30–40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదివారం, సోమవారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగళ్ల వానల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సోమవారం, మంగళవారం వర్షాల ప్రభావం దక్షిణ తెలంగాణకు విస్తరిస్తుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న ఎండల తీవ్రత**

వర్ష సూచన ఉన్నప్పటికీ, పగటిపూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో అత్యధికంగా 44.6 ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో 41 నుండి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎండలు ఉంటాయి. హైదరాబాద్, పరిసరాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 36 నుండి 40 మధ్య నమోదవుతున్నాయి. అయితే ఈనెల 23 తర్వాత నగరంలో కూడా ఎండ తీవ్రత పెరిగి 44 డిగ్రీలకు పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

**ప్రజలకు, రైతులకు సూచనలు**

ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల దగ్గర ఉండొద్దని అధికారులు సూచించారు. మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలి. ఈదురుగాలులు, వడగళ్ల వానల నేపథ్యంలో రైతులు తమ కోతకు వచ్చిన పంటలను, ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని అధికారులు సూచించారు. ఉపరితల ఆవర్తనం, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ అకాల వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు స్పష్టం చేశారు.



### ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరామ్‌కు

# ఆమోదం తెలపండి

- గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- లోక్ భవన్‌లో సిఎంతో పాటు గవర్నర్‌ను కలిసిన మంత్రి శ్రీధర్‌బాబు, రాజ్యసభ ఎంపి వేం నరేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

గవర్నర్ కోటా ఎంఎల్‌సిలుగా పెండింగ్‌లో ఉన్న అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ పేర్లను ఆమోదించాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరినట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని లోక్‌భవన్ లో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఐటి. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఎంపి వేం.నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యారంగానికి సంబంధించి వివిధ అంశాలతో పాటు జూన్ 12వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్ బి స్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న అవగాహన కార్యక్రమంపై కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తరువాయి 2లో

# 'సమ్మెకు సై'

- ప్రభుత్వ అరకొర హామీలతో విరమించేది లేదంటున్న టిజిఎస్ ఆర్‌టిసి కార్మికులు
- ప్రభుత్వంలో విలీనం సహా 32 డిమాండ్లు పరిష్కరించాల్సిందేనని స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ ఆర్‌టిసి) కార్మికులు సమ్మెకు సై అంటూ సమర శంఖం పూరిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ(ఏప్రిల్ 21 అర్ధరాత్రి మొదటి డ్యూటీ నుంచి)సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్‌టిసి జెఎసి నాయకులు ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర హామీలతో సమ్మె విరమించేది లేదని, ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో సహా 32 డిమాండ్లను పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారంటీలు ప్రకటించినట్లుగానే, ఆర్‌టిసి కార్మికులకు ఆరు గ్యారంటీలు(1.ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం. 2.రెండు వేతన సవరణల అమలు. 3.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహణ. 4. ఆర్‌టిసి కార్మికులకు ఉద్యోగ భద్రత. 5. 2013 వేతన సవరణ బాండ్ల బకాయిల విడుదల.6. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులు కొనుగోలు చేయడం) వంటి హామీలు ఇచ్చారని, కానీ, అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న నేటి వరకు హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎన్ని మెమోరాండంలు ఇచ్చినా, ఎన్ని సార్లు మంత్రులను కలిసినా, ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. 2024 మే మాసంలో తరువాయి 2లో

# రేపు ఇరాన్‌తో చర్చలు

డీల్ కుదరకపోతే విద్యుత్ ప్లాంట్లు– బ్రిడ్జీలూ ధ్వంసం

నేనింక మంచోణ్ణి కాదు : ట్రంప్ తీవ్ర హెచ్చరిక



**టెహ్రాన్:** అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గడువు మరో 72 గంటల్లో ముగిసిపోతున్న తరుణంలో,ఇస్లామాబాద్‌లో ఇరాన్‌తో మంగళవారం (ఏప్రిల్ 21) చర్చలు జరుగుతాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదివారం సాయంత్రం ప్రకటించారు. ఆయన తరపున సంప్రదింపుల్లో పాల్గొనేందుకు వైట్‌హౌస్ అగ్రశ్రేణి ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ సోమవారం సాయంత్రానికి ఇస్లామాబాద్‌కు చేరుకుంటారని చెప్పారు. ఫాక్స్‌న్యూస్‌తో మాట్లాడుతూ ట్రంప్ ఈ విషయం చెప్పారు. ఫాక్స్‌న్యూస్‌తో మాట్లాడిన తర్వాత తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెడుతూ, మంగళవారం జరిగే చర్చల్లో ఒక ఒప్పందం కుదరకపోతే, ఇరాన్‌లో ఉన్న ప్రతి ఒక్క విద్యుత్ ప్లాంటునూ ధ్వంసం చేస్తామని మరోసారి హెచ్చరిక చేశారు.''మేం చాలా న్యాయబద్ధమైన,సహేతుకమైన ఒప్పంద ప్రతిపాదన చేశాం, వారు ఒప్పుకుంటారనే నేను ఆశిస్తున్నా, వాళ్ళు ఒప్పుకోకపోతే, ఇరాన్‌లో ఉన్న ప్రతి ఒక్క విద్యుత్ ప్లాంటునూ ధ్వంసం చేస్తాం,ప్రతి వంతెనలన్నీ తరువాయి 12లో



## డిహెచ్‌పిఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

03

రాష్ట్ర అధ్యక్షులుగా ఏసురత్నం, ప్రధాన కార్యదర్శిగా మారపాక అనిల్‌కుమార్

# చెరువూ లేదు.. చేపలూ లేవు!

- పిఎంఎంఎస్‌వై, ఆర్‌కెవివై, బ్లూ రెవల్యూషన్ పథకాల కింద రూ.5 కోట్లు స్వాహా
- లబ్ధిదారులతో రంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారులు కుమ్మక్కు
- రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు
- తనిఖీల్లో నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తింపు




ప్రజాపక్షం/రంగారెడ్డి

మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు,చేపమాంసం ప్రియులకు మేలి రకం చేపల రుచిచూపించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు పక్కదారి పట్టాయి. ఆయా పథకాలను పక్కాగా అమలు చేయాల్సిన జిల్లా మత్స్యశాఖ అధికారులు, బోగస్ లబ్ధిదారులతో కుమ్మక్కై, నిధులు స్వాహా చేశారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన (పిఎంఎంఎస్‌వై), బ్లూ రెవల్యూషన్ స్కీం (బిఆర్‌ఎస్), రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన (ఆర్‌కెవివై) పథకాల కింద రూ.ఐదు కోట్లు కొల్లగొట్టినట్లు తేలింది. చేపల పెంపకం వృత్తితో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు..తమకున్న రాజకీయ పలుకుబడితో ఈ నిధులను కొల్లగొట్టినట్లు మత్స్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన ( పిఎంఎంఎస్‌వై), బ్లూ రెవల్యూషన్ స్కీం(బిఆర్‌ఎస్), రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన (ఆర్‌కెవివై) పథకాల కింద చేపల పెంపకాన్ని తరువాయి 2లో



# దిగ్బంధనం అమెరికా అజ్ఞానం అమాయకపు నిర్ణయం

## ఇరాన్ స్పీకర్ ఘాలిబాఫ్ విమర్శ



**టెహ్రాన్:**ఇరాన్–అమెరికా మధ్య ఏదైనా ఒక సానుకూల ఒప్పందం కుదరాలంటే రెండు దేశాలూ ఇంకా చాలాదూరం ప్రయాణం చేయాల్సి ఉంటుందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్, ఇస్లామాబద్ చర్చల్లో ఆ దేశ ప్రధాన అనుసంధాన కర్త మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ వ్యాఖ్యానించారు. ''మనల్ని వెళ్ళనివ్వకుండా అడ్డుకున్నప్పుడు ఇతరులు కూడా హోర్ముజ్ ద్వారా వెళ్ళడం అసాధ్యం'' అని శనివారం రాత్రి ఇరాన్ ప్రభుత్వ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఘాలిబాఫ్ చెప్పారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధనం చేయడం అజ్ఞానంతో అమెరికా తీసుకున్న అమాయకపు నిర్ణయం అని విమర్శించారు. ఇరాన్ ఇప్పటికే శాంతినే కోరుకుంటోందని ఆయన చెప్పారు. లెబనాన్‌లో హెజ్బొల్లాకు మద్దతు ఇస్తున్న ఇరాన్, పది రోజులపాటు ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత హోర్ముజ్ జలసంధిని పూర్తిస్థాయిలో తెరుస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. కానీ ఇరాన్ ఓడరేవులపై తమ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడంతో వెంటనే ఇరాన్ హోర్ముజ్ జలసంధిని శనివారంనాడు మూసివేసింది. ఈ జలసంధిలో ఒక్కనౌకను కూడా అనుమతించేదిలేదని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఘాలిబాఫ్ మాట్లాడుతూ, ఒప్పందానికి ముందుగా ఒక నిబంధనల చట్రాన్ని రెండు దేశాలూ ఉమ్మడిగా అంగీకరిస్తేగానీ చర్చలు ప్రారంభమయ్యే అవకాశం లేదని అన్నారు. ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలకు తమదేశం సిద్ధంగా లేదని ఆయన స్పష్టం చేశారు. నిర్ణీత ప్రకారం సోమవారం ఇస్లామాబాద్‌లో చర్చలు జరుగుతాయని అందరూ భావించారు. కానీ ట్రంప్ ప్రకటన కారణంగా ఆగ్రహించిన ఇరాన్ అమెరికా నుండి ఎలాంటి సానుకూల,సహకార ధోరణితో కూడిన సంకేతాలు లేనందువల్ల హోర్ముజ్ జలసంధిని అన్ని దేశాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించాలని తీసుకున్న నిర్ణయాన్ని తిరిగి వెనక్కు తీసుకుంది. శుక్రవారం ఒక్కరోజు అనేక నౌకలు హోర్ముజ్‌ను దాటి వెళ్ళాయి. ఇక హోర్ముజ్ తెరచుకుందని, చము, గ్యాస్ రవాణాకు ఢోకాలేదని దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలు వ్యక్తం చేసిన ఆనందం ఇరవైనాలుగు గంటలు కూడా నిలబడలేదు. స్టాక్‌మార్కెట్లు సందడిగా కొనసాగాయి. చమురు ధరలు కూడా 91 డాలర్లకు దిగి వచ్చాయి. కానీ ఈ కొద్ది గంటల ముచ్చటా తిరిగి యథాపూర్వస్థితికి చేరుకుంది. సోమవారం చర్చలకు ముందుగా ఇరాన్, హోర్ముజ్‌ను పూర్తిస్థాయిలో అన్ని నౌకల రాకపోకలకు తెరిచింది. ఈ మేరకు ప్రకటన చేసింది. అనేక నౌకలు హోర్ముజ్ దాటి వెళ్ళాయి. కానీ, హోర్ముజ్ తెరచినాగానీ, ఒక ఒప్పందం కుదుర్చుకునేవరకూ ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని అమెరికా నిలిపివేయబోదని ట్రంప్ ప్రకటించడంతో ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. హోర్ముజ్‌ను స్తంభనను ఉపసంహరిస్తే దిగ్బంధనాన్ని ఎత్తివేస్తారని భావించిన ఇరాన్‌ను ట్రంప్ నిరశపరచారు. ఆగ్రహానికి గురిచేశారు. దీంతో శనివారం నుండీ పూర్తిస్థాయిలో హోర్ముజ్‌ను ఇరాన్ మూసివేసింది. అనుమతి పొందిన రెండు భారత్ ట్యాంకర్లు జలసంధి వైపు వెళుతుండగా ఐఆర్‌జిసి స్పీడ్ బోట్లు కాల్పుల దాడి చేసి వాటిని వెనక్కు మళ్ళించాయి. దీంతో భారత ప్రభుత్వం ఇరాన్ దౌత్యవేత్తను పిలిపించి తన తీవ్ర నిరసన తెలియజేసింది.

# బీజింగ్‌లో హ్యూమనాయిడ్ రోబో మారథాన్

## 50 నిమిషాలు పరుగెత్తి టైటిల్ గెలిచిన స్వతంత్ర రోబో

**బీజింగ్:**మానవరూపంలో ఉండే రోబోలకు చైనాలో మరోసారి మారథాన్ పోటీలు నిర్వహించారు. రాజధాని బీజింగ్‌లోని ఇ–టౌన్‌లో ఆదివారం ఉదయం ఈ పోటీలు జరిగాయి. రెండోసారి ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ పోటీలలో ఐదు అంతర్జాతీయ జట్లతో సహా మొత్తం 100 జట్లు ఈ మారథాన్ పోటీల్లో పాల్గొన్నాయి.అంటే 26 బ్రాండ్‌లకు చెందిన 300 హ్యూమనాయిడ్ రోబోలు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు చైనా మీడియా గ్రూప్ తెలియజేసింది.ఒక అటానమస్ లైట్నింగ్ రోబో 50 నిమిషాల 26 సెకన్లు పరుగుతీసి లక్ష్యిత ముంగిపు రేఖను చేరుకుని టైటిల్ గెలుచుకుంది. మరో హానర్ జట్టుకు చెందిన రీమోట్ కంట్రోల్‌తో పనిచేసే ఒక హ్యూమనాయిడ్ రోబో 49 నిమిషాల 19 సెకన్లపాటు మారథాన్ రేస్‌లో పాల్గొన్ని లక్ష్యిత ముగింపు రేఖను దాటి వెళ్ళి మరో విజేతగా నిలిచింది. 2025లో మొదటిసారి చైనాలో హ్యూమనాయిడ్ రోబో మారథాన్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఇదే దూరాన్ని ఒక రోబో రెండు గంటల 40 నిమిషాల 42 సెకన్లలో పూర్తిచేసింది. ఈ సారి ఈ అటానమస్ రోబో ఎంతో మెరుగుదల సాధించి 50 నిమిషాలలో ఈ దూరాన్ని దాటి విజేతగా టైటిల్ గెలుచుకోవడం పెద్ద ముందంజగా నిర్వాహకులు చెప్పారు. ఈసారి రోబో మారథాన్ పోటీ పరిశ్రమలో ఎంతో పరిపక్వత వచ్చిందని నిర్వాహకులు చెప్పారు. ఈ ఏడాది పోటీల్లో రోబోలు ఎంతో స్పష్టమైన పరుగుల భంగిమలతో వేగంగా వెళుతూ ప్రేక్షకులను పదే పదే ఆశ్చర్యానికి గురిచేశాయి. అచ్చుగుద్దినట్టుగామనుషులు పరుగులుదీసే భంగిమలను ప్రదర్శించగలిగాయి. గత ఏడాది పోటీల్లో రోబోలు ఈ పరుగులు తీయడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోగా ఈసారి పోటీల్లో చాలా మెరుగుదల సంభవించింది. ఈసారి పోటీల్లో రోబోలు నేలపై కాలి పట్టును నిలబెట్టుకుని సమతుల్యంతో పరుగులు తీశాయి.

# ఉక్రేన్ వీధుల్లో రష్యన్ కాల్పులు

## ఐదుగురిని చంపిన గన్‌మెన్ కాల్చివేత

**కీవ్:**ఉక్రేన్ వీధుల్లో విచక్షణా రహితంగా ఒక రష్యన్ కాల్పులు జరిపి కనీసం ఐదుగురిని పొట్టను పెట్టుకున్న గన్‌మెన్‌ను ఎట్టకేలకు భద్రతా దళాలు కాల్చి చంపారు. కీవ్‌లోని హోలోసీవ్‌స్కీ జిల్లాలో ఒక సూపర్ మార్కెట్ సమీపంలో ఈ ఘటన జరిగిందని మేయర్ విటాలీ క్లిచ్‌స్కో చెప్పారు. ఈ ఘటనలో ఉగ్రవాద జోక్యం ఉందా అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతగాడు కొంత మందిని బందీలుగా చేసుకునే ప్రయత్నం చేశాడు. ఈ లోపే పోలీసులు అతడిని కాల్చి చంపారు. ఉక్రేన్ హోంమంత్రి ఇహోర్ క్లైమెన్‌స్కో సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలను పోస్టు చేశారు. గన్‌మెన్‌ను ఎవరూ అదుపు చేయడం సాధ్యం కాలేదు. దాంతో స్పెషల్ టాక్టికల్ పోలీస్ యూనిట్ సూపర్ మార్కెట్‌లోకి దూసుకువెళ్ళి అతడిని కాల్చి చంపింది. చంపడానికి ముందుగా గన్‌మెన్‌తో సంప్రదింపులు చేసేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు కాల్చి చంపారు.

# క్యూబాలో సైనిక జోక్యానికి తిరస్కృతి

## మానవ సంక్షోభం తగ్గించేందుకు సహాయం అందిస్తాం* మెక్సికో,బ్రెజిల్,స్పెయిన్ ఉమ్మడి ప్రకటన



**బార్సిలోనా :**క్యూబాలో అమెరికా సైనిక జోక్యాన్ని మెక్సికో,బ్రెజిల్,స్పెయిన్ దేశాలు తిరస్కరించాయి. అమెరికా అమలు చేస్తున్న తీవ్రమైన చమురు దిగ్బంధన చర్యల కారణంగానే క్యూబా దేశం పీకలోతు ఆర్థిక సమస్యలు,కష్టాల్లో, మానవతా సంక్షోభంలో కూరుకుపోయిందని ఈ దేశాల నాయకులు విమర్శించారు. క్యూబానుఆదుకునేందుకు మరింతగా మానవతా సహాయం చేయాలని నిర్ణయిస్తూ మెక్సికో,బ్రెజిల్,స్పెయిన్ దేశాల నాయకులు శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. క్యూబాలో సంక్షోభాన్ని తగ్గించడానికి మానతా సహాయాన్ని మరింత ముమ్మరం చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. క్యూబాలో ఎలాంటి సైనిక జోక్యాన్నైనా వ్యతిరేకిస్తున్నట్లు చెబుతూ, ఆ దేశ భవిష్యత్తును అక్కడి ప్రజలే నిర్ణయించుకుంటారని ప్రకటనలో పేర్కొన్నారు. క్యూబాపై దాడి చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే బెదిరింపులు చేస్తున్నారు. క్యూబాపై ఆంక్షలు విధించారు. ఇరాన్ తర్వాత తమ తదుపరి లక్ష్యం క్యూబాయే నని ఇటీవల కూడా ప్రకటించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించిన తర్వాత క్యూబాపై ఆంక్షలను ఆయన ఉద్ధృతం చేశారు. ఆ దేశాన్ని ఆక్రమించే యత్నాలు తీవ్రం చేశారు.బహుళపక్ష వాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ వివిధ దేశాల వామపక్ష, ప్రగతిశీల ప్రభుత్వాధినేతల స్పెయిన్ రాజధాని బార్సిలోనాలో సమావేశమయ్యారు. ఐక్యరాజ్య సమితి 79వ సాధారణ సభ చొరవ మేరకు 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరిట నిర్వహించిన ఈ నాలుగవ శిఖరాగ్ర సదస్సుకు స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంచెజ్ ఆతిథ్యం ఇచ్చారు. ఆయనతోపాటు బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, క్యూబా కమ్యూనిస్టుపార్టీ ప్రథమ కార్యదర్శి,ఆ దేశ అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ బెర్ముడెజ్ మాట్లాడుతూ, క్యూబాదేశం బహుముఖ వాదానికి, ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉందని జెనీవాలో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఒక సందేశం పంపిస్తూ, క్లిష్టసమయాల్లో ఆదుకుంటున్న దేశాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇటలీలో ప్రార్థనాస్థలం వెలుపల ఇద్దరు భారతీయులు కాల్చివేత




**రోమ్:** ఇటలీలో ఆదివారం ఒక ప్రార్థనాస్థలం వెలుపల జరిగిన కాల్పుల్లో ఇద్దరు భారతీయులు మరణించారు. పక్కా ప్రణాళిక ప్రకారం తోటి భారతీయుడే వారిపై కాల్పులు జరిపినట్లు అనుమానిస్తున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. లా సిసిలియా వార్తా పత్రిక తెలియజేసిన సమాచారం ప్రకారం, మరణించిన భారతీయులను రగీందర్ సింగ్ (48), గుర్మిత్‌సింగ్(48)గా గుర్తించారు. బెర్గామో రాష్ట్రంలోని కోవోలో వైశాఖి స ందర్భంగా సిక్కు ప్రార్థనాలయంగా ఉపయోగించుకుంటున్న ఒక గిడ్డంగి వద్ద ప్రార్థనలు జరుగుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న మాతా సాహిబ్ కౌర్ జీ గురుద్వారాలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రార్థనలు పూర్తిచేసుకుని వీరిద్దరు భారతీయులు బయటకు వస్తున్న సమయంలో గురుద్వారా వెలుపల చౌరాస్తాలో ఈ కాల్పుల ఘటన సంభవించింది. మరణించిన ఇద్దరు భారతీయులలో గుర్మిత్ సింగ్ అగ్నాడెల్లో నివాసితుడు కాగా, రగీందర్‌సింగ్ కోవో నివాసితుడు. నిందితుడు వారి దగ్గరకు వెళ్ళి తుపాకీతో కాల్పులు జరిపి ఆ తర్వాత కారులో పారిపోయాడు. ముందే పథకం ప్రకారం ఈ హత్యలు జరిగాయని పోలీసులు అంచనావేశారు. ఘటనాస్థలం వద్ద పది తూటాలు పట్టే ఖాళీ క్యాలిబర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిపిన నిందితుడు కూడా తరచు గురుద్వారాకు ప్రార్థనలు చేసేందుకు వస్తాడని ఒక సాక్షి చెప్పాడు. ఆ సాక్షి సమాచారం ప్రకారం తూటాలు మూడో వ్యక్తిని కూడా తాకాయి.

# బల్గేరియాలో పార్లమెంటు ఎన్నికలు

**సోఫియా:**ఆగ్నేయ యూరప్‌లో బాల్కన్ తూర్పు ప్రాంత దేశం బల్గేరియాలో అనేక సంవత్సరాలుగా తీవ్ర రాజకీయ అస్థిరత కారణంగా సంక్షోభం కొనసాగుతోంది. బల్గేరియా పార్లమెంటుకు ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. గ్రీస్,టర్కీ దేశాలు సరిహద్దులుగా ఉన్న బల్గేరియాలో తాజాగా ఎనిమిదోసారి ఆదివారం (ఏప్రిల్ 19) మరోసారి పా ర్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. దేశంలో మొత్తం 60.60 లక్షలమంది అర్హులైన ఓ టర్లు ఉన్నారు. 14 రాజకీయపార్టీలు, 10 రాజకీ య కూటమిలకు చెందిన 4,700 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. ఉదయం ఏడు గ ంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకూ పో లింగ్ ప్రక్రియ కొనసాగింది. విదేశాలలో ఉన్న బ ల్గేరియన్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి 55 దేశాలలో తగిన ఏర్పాట్లు చేశారు. ఏప్రిల్ 23 వ తేదీలోపు ఎన్నికల ఫలితాలు వస్తాయి. పోలింగ్ ప్రక్రియ పూర్తి కాగానే ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెలువడ్డాయి .2021 నుండి ఇప్పటివరకూ దేశంలో మెరుపు ఎన్నికలు జరగడం ఇది ఏడవసారి. జాతీ య అసెంబ్లీగా పిలిచే బల్గేరియా పార్లమెంటులో మొత్తం 240 స్థానాలు ఉండగా, ఏ పార్టీ అయినా ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 121 స్థానాలు గె లుచుకోవాలి. 2024 అక్టోబరులో జరిగిన పార్లమె ంటు ఎన్నికల్లో రోసా జెలియాజ్కోవ్ ప్రధానమంత్రిగా మైనారిటీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. ఇ ందేలో జిఇఆర్‌బి, ఎస్‌బిఎస్, బిఎస్‌పి, ఓఎల్, ఐటిఎన్ పార్టీలు భాగస్వాములుగా ఉండగా ఎపిఎస్ పార్టీ బయట నుండి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిం ది. అవినీతి ఆరోపణల కారణంగా జెలియాజ్కోవ్ ప్రభుత్వం గత ఏడాది డిసెంబరులో రాజీనామా చేసింది. ఆ స్థానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో అధ్యక్షురాలు ఇలియానా ఇయోటోవా, ప్రధానమంత్రి ఆండ్రీ గ్యురోవ్ నాయకత్వంలో ఆపద్ధర్మ ప్రభు త్వం ఏర్పడింది. ఇరవైనాలుగు పార్టీలు ఎన్నికల్లో పోటీ చేశాయి.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘనే

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఆదివారం (ఏప్రిల్ 19) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌కు రాసిన ఒక లేఖలో ఎన్నికల సంఘం (ఇసి) తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆ లేఖలో కోరారు. ఐదు రాష్ట్రాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగం 'రాజకీయ స్వభావం' కలిగి ఉందన్నారు. తీవ్రమైన రాజకీయ పోటీ ఉన్న అంశంపై ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే లక్ష్యంతో 'పక్షపాత వాదనలు', 'ఎంపిక చేసిన కథనాలు' అందులో ఉన్నాయని సందోష్ కుమార్ పేర్కొన్నారు. దూరదర్శన్, సంసద్ టీవీ వంటి ప్రజావేదికలపై ఆ ప్రసంగాన్ని ప్రసారం చేయడం ప్రభుత్వ వనరుల దుర్వినియోగానికి పాల్పడటమేనని ఆయన ఆరోపించారు. 'ప్రాథమికంగా రాజకీయ ప్రసంగం కోసం ప్రభుత్వ నిధులతో నడిచే వేదికలను ఉపయోగించడం ఎన్నికల నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమే' అని సిపిఐ ఎంపి ఆక్షేపించారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం కల్పించాల్సిన సమాన ఎన్నికల అవకాశాల కల్పనను ఇటువంటి చర్యలు దెబ్బతీస్తాయని దీనిపై వాదించారు. చర్యలు తీసుకోకపోవడం ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందన్నారు. అంతేకాకుండా 'సంస్థాగత కుమ్మక్కు'కు సంకేతంగా నిలుస్తుందని సందోష్ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడటానికి ఎలక్షన్ కమిషన్ తక్షణ, చిత్తశుద్ధితో కూడిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై విచారణ ప్రారంభించాలని, అంతేకాకుండా జవాబుదారీతనం ఉండేలా కూడా చూడాలని సిపిఐ ఎంపి సందోష్ కోరారు. శనివారం తన ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ 'భ్రూణహత్య పాపానికిగాను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు మహిళల నుండి తీవ్ర శిక్ష ఎదుర్కోకతప్పదు' అని హెచ్చరించిన విషయం తెలిసిందే. మోదీ మహిళలకు క్షమాపణలు చెబుతూ 'ప్రభుత్వం ఎన్నికలలో ఓడిపోయి ఉండవచ్చు కానీ, మహిళా సాధికారత కోసం తన ప్రయత్నాలను మాత్రం ఎప్పటికీ వదులుకోదన్నారు.

సభలో మాట్లాడుతూ 'యావత్ దేశం ఎదుట నిజాయితీతో కూడిన కృషి కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు భ్రూణహత్య చేశాయి. ఈ విషయంలో కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎస్‌పి వంటి పార్టీలే దోషులు' అని తీవ్రస్థాయిలో ఆరోపించారు. లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్యను 50శాతానికి పెంచడం, 'నారీ శక్తి వందన్ అధినియమ్' కింద శాసనసభలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలుచేయడం కోసం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో ఓడిపోయిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ప్రసంగం చేశారు.

# ఆమోదం తెలపండి

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని,పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణపత్రం తీసుకోవాలని ప్రభుత్వానికి గవర్నర్ సూచించారు. కాగా గవర్నర్ సూచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**ఆ రెండు పేర్లు ఆమోదించండి..**

రాష్ట్ర మంత్రివర్గం ఇది వరకే ప్రతిపాదించిన గవర్నర్ కోటా ఎంఎల్‌సిలుగా రాష్ట్ర మైనార్టీ మంత్రి అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ పేర్లను ఆమోదించే అంశంపైన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో చర్చించినట్టు తెలిసింది.శాసనసభ, శాసనమండలి ఏ సభలో కూడా సభ్యుడు కాకపోయినప్పటికీ అజారుద్దీన్‌కు మంత్రిగా అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.అయితే మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆరు మాసాల్లోనే ఏదో ఒక సభలో సభ్యునిగా ప్రమాణ స్వీకరం చేయాల్సి ఉంటుంది. ఒక వేళ అలా చేయకపోతే ఆయన మంత్రి పదవి కోల్పోయే ప్రమాదం ఉన్నది. ఇదే విషయాన్ని గవర్నర్‌కు సిఎం రేవంత్ రెడ్డి వివరించినట్టు సమాచారం. పైగా ఎంఎల్‌సిల అంశంపైన సుప్రీం కోర్ట్ విచారణ అంశం నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు, ఇతర అంశాలపైన కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్టు తెలిసింది. కాగా అజారుద్దీన్‌కు మంత్రి పదవి గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనుంది.

# బాణసంచా తయారీ యూనిట్‌లో భారీ పేలుడు

## 23 మంది సజీవ దహనం

### మరో ఆరుగురికి తీవ్రగాయాలు, నలుగురి పరిస్థితి విషమం

### తమిళనాడులోని కట్టనార్‌పట్టినలో విషాద ఘటన



**విరుదునగర్ :** తమిళనాడులో విషాదం నెలకొంది. విరుదునగర్ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ బాణసంచా తయారీ యూనిట్‌లో ఆదివారం భారీ పేలుడు సంభవించింది. ఘటనలో 23 మంది సజీవ దహనమయ్యారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. వాచకరపట్టి పోలీస్ స్టేషన్ పరిధిలో కట్టనార్ పట్టిలో ముత్తుమనిక్కం అనే వ్యక్తికి చెందిన 'వనజ' బాణసంచా కర్మాగారంలో ఈ పేలుడు సంభవించింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం గాయపడిన ఆరుగురిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వారు విరుదునగర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పేలుడు సంభవించిన యూనిట్ నాగ్‌పూర్‌లోని పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పిఇఎస్) నుండి లైసెన్స్ కలిగి ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా తెలుస్తోంది. ఈ కాంప్లెక్స్‌లో 100 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. కార్మికులు ముడి పదార్థాలను కలుపుతూ, బాణసంచాకు తుది మెరుగులు దిద్దుతున్న ముందు వరండా ప్రాంతంలో ఈ పేలుడు సంభవించినట్లు భావిస్తున్నారు. పేలుడు ప్రభావం ఎంత తీవ్రంగా ఉండడంతో మూడు గదులు శిథిలమయ్యాయి. సమీపంలోని అనేక నిర్మాణాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. తాము 23 మృతదేహాలను వెలికితీశాం, వాటిలో చాలా వరకు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని ఒక పోలీసు అధికారి పిటిఐకి తెలిపారు. గాయపడిన ఆరుగురిలో ముగ్గురు మహిళలు ఉన్నారని, వారికి 60 శాతం కాలిన గాయాలయ్యాయని ఆ అధికారి తెలిపారు. అగ్నిమాపక, సహాయక సిబ్బంది చాలా గంటల పాటు మంటలను ఆర్పడానికి పోరాడారని వర్గాలు తెలిపాయి. తొలి పేలుడు జరిగిన చాలా సేపటి వరకు బాణసంచా పేలుతూనే ఉండటంతో సహాయక చర్యలకు గణనీయంగా ఆటంకం ఏర్పడింది. శిథిలాల కింద మరికొంత మంది కార్మికులు చిక్కుకుని ఉండవచ్చనే భయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది ఈ ప్రాంతంలో జరిగిన అత్యంత ఘోరమైన పారిశ్రామిక ప్రమాదం ఇదే. ఇదే జిల్లాలోని వేంబకోట్టయ్ ప్రాంతంలో ఇలాంటి పేలుడే జరిగి నలుగురు ప్రాణాలు కోల్పోయిన కొద్ది రోజులకే ఈ ఘటన చోటుచేసుకుంది. తాజాగా గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నందున మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయడానికి ఇద్దరు మంత్రులను ఘటనా స్థలానికి పంపినట్లు తెలిపారు. 'విరుదునగర్ జిల్లాలోని కట్టనార్‌పట్టిలో జరిగిన బాణసంచా యూనిట్ పేలుడులో పలువురు మరణించిన విషాద వార్త అపారమైన దుఃఖాన్ని కలిగిస్తోంది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయడానికి, పర్యవేక్షించడానికి, బాధితుల కుటుంబాలకు ఓదార్పునివ్వడానికి మంత్రులు కె.కె.ఎస్.ఎస్.ఆర్. రామచంద్రన్, తంగం తెన్నరసులను వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించినట్లు ఆయన చెప్పారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే, జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి, అవసరమైన సహాయం అంతటినీ సమన్వయం చేయాలని ఆయనకు ఆదేశాలు జారీ చేశానన్నారు.

# చెరువూ లేదు.. చేపలూ లేవు

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించాలనిభావించింది. ఆ మేరకు 2018 నుంచి 2025 మధ్య కాలంలో జిల్లాకు పలు యూనిట్లను కేటాయించింది. ప్రభుత్వ నిధులను కొల్లగొట్టడంలో ఆరితేరిన ఈ బోగస్ వ్యక్తులకు అప్పటి అధికారులు అండదండలు పుష్కలంగా అందాయి. ఇంకేముంది తిలా పాపం.. తలాపిడికెడు అన్నచందంగా చేపల పెంపకం వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న పేదలకు దక్కాల్సిన ఈ సబ్సిడీ నిధులు పెద్దల జేబుల్లోకి వెళ్లాయి. ఈ అంశపై సంబంధిత రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు అందాయి. అధికారులు కూడా తమ తనిఖీల్లో నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. కానీ వాటిని తిరిగి వెనక్కి తీసుకురావడంలోనూ, ఇందుకు సహకరించిన జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవడంలోనూ వెనుకాడుతుండటపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మచ్చుకు కొన్ని బోగస్ చెరువులు**

ఇబ్రహీంపట్నం రాందాస్‌పల్లి రెవెన్యూ సర్వే నంబర్లు 213/1, 214/1లో 1.05 ఎకరాల విర్ణంలో ఆర్‌ఎఎస్ రౌండ్ ట్యాంక్ ఏర్పాటు చేసినట్లు చూపించారు. ఆర్‌కెవి వై పథకం కింద రూ.25 లక్షల సబ్సీడి పొందారు. తీరా అధికారులకు అనుమానం వచ్చి తనిఖీ చేయగా,అక్కడ ట్యాంకు లేదు. చేపలు లేవు. కానీ ప్రభుత్వం నుంచి అక్రమంగా లబ్ధిపొందారు' ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు రెవెన్యూలోని సర్వే నంబర్ 470లో 375 గజాల విస్త్రర్ణంలో ఆర్‌ఎఎస్ రౌండ్ ట్యాంక్ నిర్మించి, అందులో చేపలు పెంచుతున్నట్లు చూపించి.. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆర్‌కేవీవై పథకం కింద రూ.25 లక్షల సబ్సీడి పొందారు. ఫిర్యాదులు రావడంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి,తనిఖీ చేయగా విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి. ట్యాంకు లేదు. అందులో చేపలు లేవు కానీ అప్పటికే ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ సొమ్ము ఆయన ఖాతాలో జమైంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరు సర్వేనంబర్ 60,70,76లో రూ.50 లక్షల అంచనా వ్యయంతో 365 చదరపు గజాల విర్ణంలో ఆర్‌ఎఎస్ రౌండ్ ట్యాంక్ నిర్మించి,అందులో చేపలు పెంచుతున్నట్లు చూపించారు. అప్పటికే రూ.25 లక్షల సబ్సీడీ పొందారు. తీరా తనిఖీ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించగా విస్తుపోయే అంశాలు వెలుగు చూశాయి. ట్యాంకు లేదు, చేపలు లేదు. లబ్ధిదారులు సమర్పించిన డాక్యుమెంట్ కూడా నకిలీగా నిర్ధారణ అయింది. గండిపేట మండలం వట్టినాగులపల్లి సర్వే నంబర్ 62/2/1లో 1.03 ఎకరాల విర్ణంలో ఆర్‌ఎఎస్ ట్యాంక్ నిర్మించి, అందులో చేపపిల్లలు పెంచినట్లు చూపించారు. అప్పటికే రూ.20 లక్షల సబ్సీడి పొందారు. తీరా అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలిస్తే..ట్యాంకు లేదు. చేపలు లేవు. కానీ ప్రభుత్వ నిధులు మాత్రం స్వాహా అయ్యాయి. మొయినాబాద్ మండలం పెద్దమంగాళారం రెవెన్యూ సర్వే నంబర్ 99లో ఎకరం విర్ణంలో ఆర్‌ఎఎస్ రౌండ్ ట్యాంక్ ఉన్నట్లు చూపించారు. రూ.30 లక్షలు సబ్సీడి పొందారు. తీరా తనిఖీ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలిస్తే.. ట్యాంకు లేదు. అందులో చేపలు కన్పించలేదు'

**అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి: జి.సురేష్, ఫిషర్‌మెన్ కో–ఆపరేటీవ్ సొసైటీ,**

గుడూరు జిల్లాలో చెరువులు, చేపల పెంపకం వృత్తిని జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న వాళ్లకు దక్కాల్సిన ప్రభుత్వ పథకాలు..బోగస్ లబ్ధిదారుల జేబుల్లోకి వెళ్తున్నాయి. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజ(పిఎంఎంఎస్‌వై), బ్లూ రెవల్యూషన్ స్కీం(బిఆర్‌ఎస్), రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజ(ఆర్‌కెవివై) పథకాల్లో చోటు చేసుకున్న అవినీతి,అక్రమాలపై మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేశాం. ఆర్‌ఎఎస్ రౌండ్ ట్యాంక్‌లు, చేపలు, ఫిష్ మార్కెట్ షాపుల ఏర్పాటు పేరుతో జిల్లా మత్స్యశాఖ అధికారులు చేసిన అవినీతిపై సాక్ష్యాధారాలతో సహా సమర్పించాం. తమ ఫిర్యాదుతో తనిఖీలు చేశారు. బోగస్ లబ్ధిదారులు గా గుర్తించారు. ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టినట్లు తే ల్చారు. కానీ ఇప్పటి వరకు ఇందుకు సహకరించిన ఏ ఒక్క అధికారిపై కూడా చర్య తీసుకున్న దాఖలాలు లేవు. ఇదే అంశంపై ఎసిబికి కూడా ఫిర్యాదు చేశాం. అంతేకాదు మత్స్య సొసైటీలకు ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించడం లేదు. తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి. చెరువులను పూర్తిగా వృత్తిదారులకే అప్పగించాలి.

# 'సమ్మెకు సై'

(మొదటి పేజీ తరువాయి)

జెఎసి సమ్మె చేయటానికి సమాయత్తమైనప్పుడు ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించిందని, రవాణా శాఖామాత్యులు ఆ టీమ్ కి నాయకత్వం వహించి అజ్మీరీ కలాకండ్ లాంటి తియ్యని మాటలు మాట్లాడారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. జాతీయ సమైక్యత దెబ్బతినే పరిస్థితి ఉన్నదని, పాకిస్తాన్ బూచిని చూపించి సమ్మెను వాయిదా వేసుకోవాలని కోరారని, ఏడాది కావస్తున్న వారింకా ముఖ్యమంత్రితో మాట్లాడుతూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. నష్టాల్లో నడుస్తున్న హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్ట్‌ని స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం వద్ద బడ్జెట్ ఉంటుంది, కానీ ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి మాత్రం బడ్జెట్ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

**ఆర్‌టిసి కార్మికుల మరణాలు ప్రభుత్వానికి పట్టదా?**

''2019 లో జరిగిన ఆర్‌టిసి సమ్మెలో 34 మంది కార్మికులు ఆత్మ బలి దానం చేసుకున్నారు. ఆనాటి కార్మికుల ఆశలు నేటివరకు నెరవేరలేదు. ఆనాడు టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. మాజీ ముఖ్యమంత్రి ఒక్క నోటి మాటతో ట్రేడ్ యూనియన్లపై బ్రహ్మాస్త్రాన్ని సంధించారు. 5 సంవత్సరాలు గడిచినా 2021 వేతన సవరణ ఇవ్వరు. ఆర్‌టిసికి బడ్జెట్ ప్రొవిజన్ పెట్టరు. ఆర్థిక అంశాలు అడగొద్దని ముఖ్యమంత్రి చాగంటి వారిలా ప్రవచనాలు చెప్తారు. తనను కోసినా రక్తం వస్తుందే తప్ప, డబ్బు రాలదంటూ బీద అరుపులు అరుస్తుంటారు. కాని ఆర్‌టిసి మేనేజ్‌మెంట్ కార్మికులను కోసి రక్తమాంసాలు రుచి చూస్తుంటే ఈ ప్రభుత్వం గుడ్లప్పగించి చూస్తుందే తప్ప, దిద్దుబాటు చర్యలు తీసుకో వడం లేదు. యాజమాన్యం వేధింపులు, పనిభారాలు తట్టుకోలేక కార్మికుల గుండె చప్పుడు బస్సులో స్టీరింగులపై ఆగిపోతోంది. కుటుంబాలు ఛిద్రమై పోతున్నాయి. నమ్మి ఓటేసిన కార్మికులు నిర్జీవమై నిటలేక్షుడి నివాసమైన స్మశానంలో దహించుకుపోతున్నారు. అయినా ఈ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయడం లేదు'' అని జెఎసి నాయకులు పేర్కొన్నారు.

**మరో సకల జనుల ఆర్‌టిసి సమ్మె..**

రాష్ట్ర, జాతీయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, సబ్బండ వర్గాల మద్దతుతో సమ్మెకి వెళ్తున్నామని, ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే వరకు సమ్మె విరమించేది లేదని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న స్పష్టం చేశారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడి, మన హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక కార్యక్రమంలో చెప్పినట్లు ఆర్‌టిసి జెఎసి సభ్యులలో ఒకరు మాత్రం రిటైర్డ్ అయిన ఉద్యోగి ఉన్నారని, మిగతా సభ్యులందరూ ప్రస్తుతం డ్యూటీలోనే ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి పేషీల్లో, ప్రభుత్వంలో, ఆర్‌టిసి యాజమాన్యంలో రిటైర్డ్ అయిన అధికారులు కొనసాగట్లేదా అని ప్రశ్నించారు. కార్మిక చట్టాల ప్రకారం రిటైర్డ్ అయిన ఉద్యోగులు కూడా యూనియన్లలో కొనసాగేలా ఉందని, మంత్రి ఒకసారి చట్టాలను తెలుసుకోని, మాట్లాడాలని సూచించారు.

# మహిళా బిల్లులో సామాజిక న్యాయం అమలు చేయాలి




### దళిత క్రైస్తవ తీర్పును పునః సమీక్షించాలి

**ప్రజాపక్షం/ వరంగల్ :** దేశంలో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశగా తీసుకొచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు సామాజిక న్యాయం సూత్రాలను పూర్తిగా ప్రతిబింబించాల్సిన అవసరం ఉందని, కాని ప్రస్తుత రూపంలో ఈ బిల్లు పేదలు, దళితులు, ఆదివాసీలు, బిసిల మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించే విధంగా లేదని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసు రత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ ,రాష్ట్ర కోశాధికారి ఆరుట్ల రాజ్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంఘీ ఎల్లెందర్, జిల్లా అధ్యక్షుడు జన్ను రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి భాష్మియా, సిపిఐ సీనియర్ నాయకులు మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, నాయకులు రచర్ల రాజేందర్ తో కలిసి శివానగర్ లోని తమ్మెర భవనంలో ఆదివారం రోజు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ 33 శాతం మహిళా రిజర్వేషన్‌లో ఎస్సి, ఎస్టి, బిసి మహిళలకు తగిన వాటా కేటాయిస్తూ సామాజిక న్యాయం అమలు చేయాలని, లేదంటే ఈ బిల్లు అసలు లక్ష్యాన్ని కో ల్పోయే ప్రమాదం ఉందన్నారు. దేశంలో దళిత క్రైస్తవులపై జరుగుతున్న అ న్యాయం అత్యంత బాధాకరమని, మతం మారిన కారణంగా దళితుల హక్కులను తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, అందువల్ల దళిత క్రైస్తవుల రిజర్వేషన్‌పై ఉన్న న్యాయ, విధాన పరమైన అడ్డంకులను వెంటనే తొలగించి, సంబంధిత తీర్పులను పునర్ సమీక్షించాలన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాము.

### నూతన కార్యవర్గం ఎన్నిక

డిహెచ్‌పిఎస్ రెండవ రాష్ట్రం మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాళ్లపల్లి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సలిగంటి శ్రీనివాస్, బోయిని అశోక్, వెంకటస్వామి, రాజరత్నందేవి, పోచన్నపొన్నగంటి,లావణ్య, సహాయకార్యదర్శిగా రత్నకుమారి, లక్ష్మిప తి, ఉషశ్రీ, సంగి ఎల్లెందర్, కనుకుంట్ల శం కర్, కోశాధికారిగా ఆరుట్ల రాజ్ కుమార్, 29 మంది కార్యవర్గ సభ్యులు, 75 రాష్ట్ర కౌన్సిల్ లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకు ంది

# నేడు రైతు భరోసా నిధుల విడుదల

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా కింద రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రూ.5,563 కోట్లు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, జౌళి, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఆదివారం కాటారం మండలం నస్తురుపల్లి గ్రామంలో సోమవారం జరగనున్న రైతు భరోసా నిధుల విడుదల బహిరంగ సభను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి భారత దేశంలో లక్షా 10 వేల కోట్లు ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్ర మని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నిధులు, నీళ్లు, నియామకాల మీద ఏర్పడిన గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో లక్షల కోట్ల రూపాయలు దుర్వినియోగం అయ్యాయన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తరతరాలకు ఉపయోగపడేలా నివేదికల ఆధారంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం అభివృద్ధికి 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాటారం మండలం నస్తురుపల్లి నుండి నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, వ్యవసాయ పనిముట్లు, రైతు భరోసా, సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సోమవారం కాలేశ్వరం సందర్శించి స్వామిని దర్శించుకుంటారని, కాలేశ్వరం అభివృద్ధికి సంబంధించిన 200 కోట్ల రూపాయలతో చేపట్టిన మాస్టర్ ప్రణాళిక కార్యక్రమానికి భూమి పూజ, శిలాఫలకం ఆవిష్కరణ తదుపరి, మేడిగడ్డ సందర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మాత్యులు ఉత్తంకుమార్ రెడ్డి, సహచర మంత్రులు పాల్గొననున్నట్లు తెలిపారు. సిఎం ఈ ప్రాంతానికి రావడం, రైతు భరోసా నిధులు చేయడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణమని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యకమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కూనంనేనికి నేతల పరామర్శల వెల్లువ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** హైదరాబాద్‌లో మైనర్ శస్త్ర చికిత్స అనంతరం పక్షం రోజుల తర్వాత నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఆదివారం పలువురు నాయలకులు పరామర్శించారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌కు చేరుకున్న ఆయనను ఈ సందర్భంగా కలిసేందుకు పలువురు వచ్చారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలను అందించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోడు భూములు, రహదార్లు, డ్రైన్లు, మంచినీటి సమస్యపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ప్రాధాన్యతా క్రమంలో ఇప్పటికే మౌలికసదుపాయాల ఏర్పాటుకు పెద్దపీట వేశామని, నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాలు, పల్లెలు, తండాలు, కాలనీలు కలుపుకుని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంత సమస్యలపై ఇప్పటికే అసెంబ్లీలో పలుమార్లు మాట్లాడానని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నియోజకవర్గాభివృద్ధికి సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు ముత్యాల విశ్వనాథం, కంచర్ల జమలయ్య, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, సలిగంటి శ్రీనివాస రావు, వాసిరెడ్డి మురళీ, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, మహిళా సంఘాల నాయకురాళ్లు రత్నకుమారి, లక్ష్మీ, షాహిన్, ఇస్కాఫ్ నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# తేజస్వీ సూర్య ఫ్లోలో మాట్లాడి ఉండొచ్చు

### ఆయన వ్యాఖ్యాల పట్ల తెలంగాణ, ఎపి ప్రజలు బాధపడితే క్షమాపణ చెబుతున్నా

### కేంద్రమంత్రి శోభా కరంద్లాజే



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్లమెంట్‌లో బిజెపి ఎంపి తేజస్వీ సూర్య ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని, ఫ్లోలో అలా మాట్లాడి ఉండొచ్చని కేంద్రమంత్రి శోభా కరంద్లాజే అన్నారు. ఆయన వ్యాఖ్యల పట్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు బాధపడితే అందుకు తాను క్షమాపణ చెబుతున్నానని ఆమె అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఒక ప్రశ్నకు సమాధానంగా పై విధంగా ఆమె స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో రాహుల్ గాంధీ మహిళా లోకాన్ని మోసం చేశారని శోభ విమర్శించారు. ఈనెల 17వ తేదీని భారత మహిళా చరిత్రలో ఒక చీకటి రోజుగా ఆమె అభివర్ణించారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో మహిళల కోసం విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణ రాష్ట్రాలకు సీట్లు పెరుగుతాయన్నారు. తెలంగాణలో ఎంపి సీట్లు 17 నుండి 26 కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుండి 38 కి పెరిగే అవకాశం ఉందని, దీన్ని ఇండియా కూటమి అడ్డుకుందన్నారు. జనాభా నియంత్రణ పాటిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా మోదీ రక్షణ కల్పిస్తుంటే, కాంగ్రెస్ ద్రోహం చేస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు మహిళలకు రూ. 2,500, విద్యార్థినులకు స్కూటీలు, తులం బంగారం హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసినందుకు రేవంత్ రెడ్డిపై 'చీటింగ్ కేసు' పెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను 'పిక్ పాకెట్' చేస్తున్నారని, ఆయన ఒక 'పిక్ పాకెటర్' అని తీవ్ర పదజాలంతో దూషించారు. కర్ణాటకలోనూ కాంగ్రెస్ గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, మహిళలను వంచించిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారని శోభా కరంద్లాజే హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, నాయకులు డి.కె. అరుణ, బండ కార్తీక చంద్రా రెడ్డి, మేకల శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జగిత్యాలలో నేడు కెసిఆర్ ప్రజా ఆశీర్వాద సభ




**ప్రజాపక్షం/జగిత్యాల :** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి జగిత్యాల వేదిక కాబోతోంది. బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నేడు జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది.దాదాపు ఏడాది కాలం తర్వాత కెసిఆర్ ప్రజల ముందుకు వస్తుండటంతో, ఈ ప్రజా ఆశీర్వాద సభపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జగిత్యాల నియోజకవర్గ రాజకీయ సమీకరణాల్లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్న ఈ సభ కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా, కీలక చేరికలకు వేదిక కానుంది. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు. కెసిఆర్ స్వయంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. ఇది ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, ఎంఎల్‌సి రమణ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్, కౌశిక్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు తో కలిసి రెండు సార్లు పర్యవేక్షించారు. సుమారు ఒక లక్ష మంది జనం వచ్చేలా పక్కా ప్లానింగ్‌తో ఇంచార్జ్‌లను నియమించారు. సభకు వచ్చే కార్యకర్తలకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా 2 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 3 లక్షల వాటర్ బాటిళ్లు సమకూర్చారు.ఈ సభ బిఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే కాకుండా, రాష్ట్రంలో పార్టీ జైత్రయాత్రకు నాంది పలుకుతుంది అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సభకు ఒక రోజు ముందేజగిత్యాల పట్టణమంతా గులాబీమయంగా మారింది. ప్రధాన కూడళ్లలో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు వెలిశాయి. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు స్థానిక నాయకులు బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

**కెసిఆర్ ఏం మాట్లాడబోతున్నారు?**

చాలా కాలం తర్వాత మైక్ పట్టనున్న కెసిఆర్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు చేస్తారు? హామీల అమలుపై సర్కారును ఎలా నిలదీస్తారు? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై కేసీఆర్ ఘాటుగా స్పందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రాష్ట్ర అభివృద్ధి కోసం ఏక తాటిపైకి రావాలి

### 'జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పని చేసిన నాయకులంతా ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్క తాటిపైకి రావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న బూర్జువా పార్టీలను వదిలేసి,కొత్త రాజకీయ శక్తిగా రాబోతున్న 'జాగృతి'లో చేరాలన్నారు. బోథ్ మాజీ ఎంఎల్ఎ , కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ బాపూరావు హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో ఆదివారం తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. అలాగే బిఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా మండల అధ్యక్షుడు సహా పలువురు నాయకులు కూడా జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా వారికి కల్వకుంట్ల కవిత కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాపూరావు తెలంగాణ జాగృతి నుంచే బిఆర్ఎస్‌లో చేరి, రెండు సార్లు ఎమ్మెల్యే అయ్యారని గుర్తు చేశారు. తమ రాజకీయ పార్టీలో చేరడానికి అన్ని జిల్లాల నుంచి నాయకులు ముందుకు వస్తున్నారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్త రాజకీయ పార్టీకి ఆదరణ ఉంటుందన్నారు. రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ బిఆర్ఎస్‌లో తమ తర్వాత వచ్చినవారు మంత్రులయ్యారని, తనకు కనీసం ఎంఎల్ఎ టికెట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్‌లో చేరినప్పటికీ తనకు తగిన ప్రాధాన్యత దక్కలేదన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత ఇచ్చోడలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి తన అనుచరులను, కార్యకర్తలను కూడా పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. జన గణనలో ఆదివాసీల మతం కోసం ప్రత్యేక కాలమ్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్ట్యూషనల్ రైట్స్, కల్చరల్ ప్రొటెక్షన్ జెఎసి' జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్‌పి మాజీ చైర్మన్, మాజీ ఎంఎల్ఎ చందా లింగయ్య దొర ఆధ్వర్యంలో జెఎసి ప్రతినిధులు హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో కవితతో ఆదివారం సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెసా చట్టానికి తూట్లు పొడుస్తూ ఆదివాసీల హక్కులను హరిస్తోందన్నారు. ఆదివాసీల భాష ''కోయతూర్'' ను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ జెఎసి నాయకులు పాడూరి శ్రీనివాస్, పాయం సత్యనారాయణ, మాడవి నర్సింగరావు, వట్టం నారాయణ దొర, రమణాల లక్ష్మయ్య, వజ్జ నర్సింహరావు, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్‌సింగ్, ఆదివాసీ జాగృతి అధ్యక్షుడు లోకిని రాజు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా ఐపిఎల్ టి-20 క్రికెట్ బెట్టింగ్‌లు!

### రూ. వేల నుంచి రూ.లక్షల్లో పందేలు
### బెట్టింగ్ కు తోడుగా ఆన్ లైన్ రమ్మీ
### ఈజీ మనీ కోసం యువత అడ్డదారులు
### ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లతో వెలుగులోకి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రస్తుతం ఐపిఎల్ టీ 20 క్రికెట్ సీజన్ నడుస్తున్నది. ఇదే అదునుగా చేసుకున్న కొంతమంది బెట్టింగ్ పై దృష్టి సారించారు. అనతి కాలంలోనే ధనార్జనే ధ్యేయంగా కొందరు యువకులు ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్‌లను జోరుగా సాగిస్తున్నారు. గతంలో గ్రేటర్ వరంగల్ నగరంలోని పలు చోట్ల పోలీసులు బెట్టింగ్ రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, సెల్ ఫోన్ లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ లో ఐపిఎల్ క్రికెట్ కోసం అంటూ భారీ తెర ఏర్పాటు చేయగా అదే వేదికగా క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న ముఠాను నగర పోలీసులు అరెస్టు చేశారు. అంతర్జాతీయంగా క్రికెట్ అంటే అంతులేని మోజు ఉన్నమాట వాస్తవమే అయినా ఆట చూడడం ఒక ఎత్తైతే.. మరో కోణంలో ఆటలో గెలుపొటములపై బెట్టింగ్‌ల ద్వారా లక్షల రూపాయలు వెచ్చించి కుటుంబాలను వీధికీడుస్తున్న సంఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సాగుతున్నాయి. ప్రతి చోటా ఏదో ఒక ప్రాం తంలో బెట్టింగ్ లు పోలీసుల కంట పడుతూ వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఏటేటా వేసవి వినోదం గా ప్రపంచ క్రికెట్ లీగ్‌లకే మెగా లీగ్‌గా ఆవిర్భవించిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌లు ఆరంభమవుతున్నాయంటేనే చాలు నగరాలు, పట్టణాలలో బెట్టింగ్ ముఠాలు రహస్యంగా రంగంలోకి దిగుతాయి. ఇలా గత అనేక సంవత్సరాలుగా క్రికెట్ బెట్టింగ్‌లు సాగుతూనే ఉన్నాయి. అప్పుడప్పుడు పోలీసులకు పట్టుబడిన వారు రాజకీయ అండదండలతో ఎలాగోలా బయటకొస్తున్నా రు. మళ్లీ ఏడాది నాటికి నాడు పట్టుబడి పోగొట్టుకున్న పైకాన్ని తిరిగి రికవరీ తరహాలో సంపాదించుకుంటున్నారు. కొందరయితే ప్రత్యేకంగా జాతీ య, అంతర్జాతీయ క్రికెట్ పోటీలు ఎప్పుడు ఆరంభమవుతాయా? అంటూ ఎదురుచూస్తూ బెట్టింగ్‌ల కోసం పందెం కోళ్లను సిద్ధం చేసినట్లు ప్రత్యేకంగా ఈ ఆటపై ఆసక్తి చూపుతున్నారు. బెట్టింగ్‌లపై ఆశలు ఉన్న వారిని ఏరి కోరి సంసిద్ధులను చేస్తున్నారు.

**భారీ మొత్తంలో పందేలు..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బెట్టింగ్ బ్యాచ్‌ల దందాకు అంతులేకుండా పోయింది. ప్రతి రోజు జనంలో కలిసి తిరిగే యువకుల్లో కొందరూ బెట్టింగ్‌ల ద్వారా అనతికాలంలోనే లక్షల రూపాయలు సంపాదించే దొడ్డి దారినే మార్గంగా ఎంచుకుంటున్నారు. వీరికి అధికారంలో ఎవరున్నా వారి మద్దతు లభిస్తూ వస్తోంది. ఇప్పుడు ఐపిఎల్ మా ర్చి 28వ తేదీ నుంచి ఆరంభం కాగా ఈ క్రికెట్ లీగ్‌లలో పెద్దపెద్ద జట్లు ఆడినప్పుడు భారీ మొత్తంలోనే పందాలు కాస్తున్నారు. శని, ఆదివారాలు వీకేండ్ రెండేసి మ్యాచ్‌లు ఉండడంతో ఆ రోజుల్లోనైతే పందాలకు అడ్డుఅదుపు లేదు. నేరుగా రూ.100కు రూ.1000 చొప్పున లాభాలు చూపి ఈ గేమ్‌లో అమాయకుల్ని దింపుతున్నారు. వంద తో మొదలెట్టిన ఆట వేలు, ఆపై లక్షల రూ పాయలకు చేరుకుంటోంది. వివిధ చోట్ల అప్పులు చేసి మరీ యువత ఈ రొంపిలోకి దిగి కొందరు నిండా మునిగి వీధులపాలవుతున్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఎస్ఆర్‌హెచ్, సిఎస్‌కే మ్యాచ్ సందర్భంగా నగరంలో కొన్ని బార్‌లలో ప్రత్యేకంగా భారీ తెర ఏర్పాటు చేసి మద్యం అందుబాటులో ఉంచి బెట్టింగ్‌కు సహకరించినట్లు వార్తలు వస్తున్నాయి

**బెట్టింగ్ తో పాటు ఆన్‌లైన్ గేమ్‌ల్లో..**

బెట్టింగ్ లాంటి ప్రత్యక్ష పందెం ఒకటయితే ఇంకా ఆన్‌లైన్ గేమ్‌ల్లో అనేక రకాల బెట్టింగ్‌లు ఇప్పుడు జోరుగా నడుస్తున్నాయి. రమ్మీ సర్కిల్, రమ్మీ కల్చర్, డిఫాబెట్ లాంటి అప్లికేషన్‌లు తెలంగాణలో నిషేదం ఉన్నప్పటికి ఇంకా రహస్యంగా కొనసాగుతున్నాయని తెలుస్తోంది. బెట్టింగ్ చేసే వారు ముందుగా ఒక ఐడీని క్రియేట్ చేసుకుని సదరు అప్లికేషన్‌లో లాగిన్ అయి తన బ్యాంకు అకౌంట్‌ను లింకప్ చేసుకుని డబ్బులు జమ చేసి ఆడుతున్నారని తెలుస్తోంది. ఇందులోనే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, బాల్ టు బాల్, ఓవర్ టై ఓవర్, ఎకాట్రస్, ఫోర్, సిక్స్, వికెట్ ప్లేయిర్స్‌పై రకరకాల బెట్టింగ్‌లు కాస్తున్నారంటున్నారు.పోలీసులు వీటి పై దృష్టి సారించి బెట్టింగ్, ఆన్ లైన్ ల ఆట కట్టించాలని పలువురు కోరుతున్నారు.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆన్‌లైన్, బెట్టింగ్ యాప్‌లపై నిషే ధం విధించి, వాటిని ప్రమోట్ చేస్తున్న సినీ తారలపై,ఇతర సెలబ్రిటీలపై కేసులు నమోదు చేస్తు న్నా రహస్యంగా వాటిని ఇతర రూపాలలో కొనసాగిస్తున్నారు.

### టిసిఎస్‌లో లైంగిక ఘటన నేపథ్యంలో


# హైదరాబాద్ ఐటి రంగం అలర్ట్

### మహిళా ఉద్యోగుల భద్రతపై పోలీసుల ఆరా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాసిక్‌లోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) కేంద్రంలో వెలుగులోకి వచ్చిన లైంగిక వేధింపుల కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఇప్పుడు దాని ప్రభావం హైదరాబాద్ ఐటి రంగంపై కూడా కనిపిస్తోంది. దేశంలోని ప్రధాన టెక్ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌లో లక్షలాది మంది మహిళలు పనిచేస్తున్న నేపథ్యంలో, కార్పొరేట్ సంస్థల్లో భద్రత, హెచ్‌ఆర్ వ్యవస్థల పనితీరు, ఫిర్యాదు పరిష్కార విధానాలపై తీవ్ర చర్చ ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని ప్రముఖ ఐటి కారిడార్ హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఉప్పల్, ఆదిబట్ల, శంషాబాద్ ప్రాంతాల్లో ఉన్న బహుళజాతి సంస్థలు, స్టార్టప్‌లు లక్షలాది ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాయి. వాటిలో మహిళల భద్రతకు సంబంధించిన అంశం అత్యంత కీలకంగా మారింది. ఐటి రంగంలో పనిచేసే మహిళలు రాత్రి పూట షిఫ్టులు, ప్రాజెక్ట్ డెడ్‌లైన్ ఒత్తిళ్లు, టీమ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలలో ఎదురయ్యే సమస్యల కారణంగా కొన్ని సందర్భాల్లో వేధింపులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. నాసిక్ ఘటనలో బయటపడిన అంశాలను ఒక సారి పరిశీలిస్తే, ఫిర్యాదు చేయడంలో భయం, హెచ్‌ఆర్ విభాగాల నిర్లక్ష్యం, అంతర్గత కమిటీల పనితీరులో లోపాలు హైదరాబాద్‌లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, ఫిర్యాదు చేస్తే కెరీర్‌కు ముప్పు అనే భావనను తొలగించకపోతే సమస్యలు బయటపడవని నిపుణులు అంటున్నారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న పిఓఎస్‌హెచ్ చట్టం 2013 ప్రకారం ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల విభాగం (ఇంటర్నల్ కాంప్లెయింట్స్ కమిటీ–ఐసిసి) ఏర్పాటు తప్పనిసరి. హైదరాబాద్‌లోని చాలా సంస్థలు ఈ నియమాన్ని అమలు చేస్తున్నప్పటికీ, వాటి పనితీరు, పారదర్శకతపై తరచూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు గోప్యంగా స్వీకరించడం, వేగంగా విచారణ జరపడం, బాధితురాలికి మానసిక సహాయం అందించడం వంటి అంశాలు మరింత బలపరచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఇక విద్యాసంస్థల విషయానికి వస్తే, ఐఐటిలతో సహా ప్రముఖ యూనివర్సిటీల్లో కూడా ఇదే పరిస్థితి ఉండే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని చెబుతున్నారు. ప్రొఫెసర్ స్టూడెంట్ సంబంధాలు, ప్రాజెక్ట్ వర్క్ ఒత్తిళ్లు, కెరీర్ భయాలు కారణంగా చాలా ఘటనలు వెలుగులోకి రాకపోవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ఐటి కంపెనీలు కొన్ని చర్యలు తీసుకోవాలి. స్వతంత్ర, నిష్పక్షపాత ఐసిసి వ్యవస్థలు బలోపేతం చేయడం, గోప్య ఫిర్యాదు మెకానిజం అమలు, రెగ్యులర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సేఫ్టీ ఆడిట్లు, సిసిటివి పర్యవేక్షణ పెంచడం, మహిళల కోసం కౌన్సెలింగ్ సదుపాయాలు కల్పించడం. అలాగే, ఉద్యోగుల్లో నమ్మకం పెంచే విధంగా హెచ్‌ఆర్ వ్యవస్థలను పారదర్శకంగా మార్చాల్సిన అవసరం ఉంది. మొత్తానికి, నాసిక్ ఘటన హైదరాబాద్ ఐటి రంగానికి ఒక హెచ్చరికగా మారిం ది. సంఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందే నివారణ చర్యలు తీసుకోవడం అనే దిశగా సంస్థలు చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. మహిళలు భయపడకుండా ఫిర్యాదు చేయగల సురక్షిత వాతావరణం ఏర్పడినప్పుడే నిజమైన భద్రత సాధ్యమవుతుందని స్పష్టం చేస్తున్నారు.

**నాసిక్ ఘటన ఒక హెచ్చరిక : ఐపిఎస్ అధికారి చారుసిన్హా**



''నాసిక్‌లో జరిగిన సంఘటన కేవలం ఒక కంపెనీ సమస్య కాదు. వ్యవస్థలోని లోపాలను బయటపెట్టిన సంఘటన. కార్పొరేట్ సంస్థలు, ఐఐటిలు, యూనివర్సిటీలు, అన్ని చోట్లా ఒక ముఖ్యమైన మార్పు అవసరం, ఫిర్యాదు చేసిన మహిళను ప్ర శ్నించే సంస్కృతి నుంచి తప్పు చేసిన వ్యక్తిని ప్రశ్నించే సంస్కృతికి మారాలి. మహిళల భద్రతను కేవలం నిబంధనలకే పరిమితం చేస్తే సరిపోదు. అది సంస్థ సంస్కృతిలో భాగం కావాలి'' అని ఉమెన్ సేఫ్టీ వింగ్ చీఫ్ చారు సిన్హా చెప్పారు.

## మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు
# కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుత సీజన్‌లోనైనా మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని, శనగ, పొద్దు తిరుగుడు పంటలపై ఉన్న 25 శాతం పరిమితిని ఎత్తివేసి,ఆ పంటలను పూర్తిగా కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పదేళ్ల కాలంలో (2024 నాటికి) రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పంటలకు మద్దతు ధర ప్రకటించడం, ప్రతి సంవత్సరం పెంచడం వరకే కేంద్ర పరిమితమైందని, వాస్తవ కొనుగోళ్ల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి మరోసారి లేఖ రాసినట్టు ఆదివారం ఒక ప్రకటనలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. మద్ధతు ధరకు,ప్రస్తుత మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు కూడా పంటల కొనుగోళ్ల విషయంలో రాష్ట్రాలకు మద్ధతు ఇవ్వకపోవడం పట్ల రైతులు ఎలా అర్థం చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో పండిన పంటలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడంలేదన్నారు. రాష్ట్రంలో అధికంగా వరి ఉత్పత్తి అయినప్పటికీ, ధాన్యం సేకరణను ప్రతి సంవత్సరం తగ్గించడం, దొడ్డు బియ్యం సేకరణ విషయంలో మాట మార్చడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోయాబీన్, చిక్కుడు, వేరుశనగ,పెసర, పొద్దుతిరుగుడు వంటి పంటల విషయంలో మొత్తం ఉత్పత్తిలో కేవలం 25 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్రం పరిమితులు విధించడంతో, రాష్ట్ర ప్రభుత్వమే మిగిలిన ఆ పంటలకు కూడా మద్ధతు ధరతో కొనుగోలు చేయాల్సి వస్తోందని మంత్రి ఆ లేఖలో పేర్కొన్నారు. తద్వారా రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతోందన్నారు. తెలంగాణలో విస్తృతంగా పండే మొక్కజొన్న పంటల విషయంలో కూడా కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ తీరుతో రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియని స్థితిలో ఉన్నారని, బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర లభించక ఆర్థికంగా నష్టపోతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో వివరించారు. కేంద్రం నుంచి ఎటువంటి స్పందన లేకపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వమే రెండువందలకు పైగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, మద్దతు ధరతో ఇప్పటి వరకు 1,20,000 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసిందని వివరించారు.ధాన్యం కొనగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా తగ్గిస్తున్న లెవి అడ్డంకిగా మారుతుందని, పత్తి విషయంలో కొత్త పద్ధతిని తీసుకురావాలన్న కేంద్ర నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించిందని మంత్రి తుమ్మల గుర్తుచేశారు. మొక్క జొన్న పంటను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నాఫెడ్ ద్వారా కొనుగోలుకు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని, అలాగే శనగ, పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్లపై ఉన్న 25 శాతం పరిమితిని ఎత్తివేసి, పూర్తిగా కొనుగోలు చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి మద్ధతు అందించాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.





# హైరైజ్ భవనాల్లో ఫైర్ సేఫ్టీకి కట్టుదిట్ట చర్యలు

### -ఫైర్ డిజి విక్రమ్ సింగ్ మాన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైరైజ్ భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సమర్ధవంతమైన ఫైర్ ఫైటింగ్ వ్యవస్థలు, రెగ్యులర్ ఫైర్ ఆడిట్లు, మాక్ డ్రిల్స్ తప్పనిసరిగా ఉండాలని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డిజి విక్రమ్ సింగ్ మాన్ పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల కోసం హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్ ఫైర్ సర్వీస్ వీక్2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరైన విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలకు దారితీసే ప్రధాన కారణాలు, ముఖ్యంగా హైరైజ్ భవనాల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల పార్కింగ్, ఛార్జింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ ఎన్‌ఒసిలను సమయానికి పునరుద్ధరించడం, స్వచ్ఛంద సేవకులకు శిక్షణ ఇవ్వడం వంటి అంశాలపై ఆయన దృష్టి సారించారు. ఫైర్ అమెండ్మెంట్ చట్టంపై ఆర్డబ్ల్యూఏల అభిప్రాయాలను కూడా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది సభ్యులు పాల్గొనగా, ఇటీవల కాలంలో ఫైర్ సేఫ్టీపై ఆర్డబ్ల్యూఏల అతిపెద్ద సమాగమంగా నిలిచింది. భవనాల్లో భద్రతా చర్యలపై తమ సూచనలు తెలియజేసిన ఆర్డబ్ల్యూఏలు, ప్రజలతో ఫైర్ శాఖ మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నంగా ఈ కార్యక్రమాన్ని అభినందించాయి. ఫైర్ సర్వీసెస్ డిజి ఆర్‌డబ్ల్యూఎల సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో శాఖతో సమన్వయంతో పని చేసి అగ్ని ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫైర్ శాఖకు చెందిన ప్రత్యేక వాహనాలు, పరికరాలను ప్రదర్శనకు ఉంచారు. డైరెక్టర్, అదనపు డైరెక్టర్, రీజినల్, జిల్లా ఫైర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

# మే డే కానుకగా 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలి

### ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మే డే పురస్కరించుకొని, 61 నెలల నుంచి జాప్యమవుతున్న ఆర్‌టిసి కార్మికుల వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో తక్షణం ప్రకటించి మే, జూన్ నెలలో అమలు చేయాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. రూ. 500 కోట్ల లోపల వ్యయం అయ్యే పదవీ విరమణ చేసిన కార్మికుల గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌కాష్‌మెంట్, 2017 వేతన సవరణ బకాయిలను ఒకే దఫాగా మే నెలలో చెల్లించాలని, అవసరమైతే ఋణ సేకరణ చెయ్యాలని ఎం.నాగేశ్వర రావు ప్రభుత్వాన్ని, ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.



## మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల
# యుద్ధ ప్రాతిపదికన పూర్తి

### మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/నారాయణపేట :** నారాయణపేట జిల్లా దామరగిద్ద వద్ద కానుకుర్తి రిజర్వ్యాయర్‌కు మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చి గత ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. గత ప్రభుత్వ దౌర్భాగ్యం వల్ల పాలమూరు రైతులు ఆగమైపోయారని మండిపడ్డారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మొదటి విడతను కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. సర్ అర్థర్ కాటన్ మాదిరిగా చరిత్రలో నిలిచిపోయేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతుల బాధలు తెలిసిన వాడిగా ఈ ప్రాంత బిడ్డ అయినందుకే మక్తల్ నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భారత దేశ చరిత్రలో నిలిచిపోయేలా రైతుల భూములకు అధిక మొత్తంలో పరిహారం ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ ప్రాజెక్టు పూర్తి కావాలని కోరుకోవడం అభినందనీయమన్నారు. 4,500 కోట్ల బడ్జెట్ తో ఈ ప్రాజెక్టు ను పూర్తి చేస్తున్నామన్నారు. మరో 20 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడి ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన కానుకుర్తి గ్రామం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 95 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడాన్నీ భవిష్యత్తు తరాలు ఆదర్శంగా తీసుకుంటాయని పేర్కొన్నారు. మీ నిర్ణయాన్ని రాబోయే తరాలు స్మరించుకుంటాయని కితాబునిచ్చారు. ఇక్కడి రైతులకు వందనం చేస్తున్నామని, ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన కుటుంబాలకు బాధ్యతతో అండగా ఉంటామని వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తానని హామి ఇచ్చారు.



## మహిళా రిజర్వేషన్ల అమలుపై..
# ప్రధాని మోదీది దృఢ సంకల్పం

### బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలనే దృఢ సంకల్పంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం 2023లో అన్ని పార్టీల మద్దతుతో బిల్లును ఆమోదించిందని బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మహిళలకు రాజకీయంగా సమాన హక్కులు కల్పించడంలో ఈ బిల్లు ఎంతో ముఖ్యమన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ బిల్లు అమలు కావడానికి ముందుగా జనగణన, నియోజకవర్గాల పునర్విభజన లాంటి సాంకేతిక ప్రక్రియలు పూర్తవాల్సి ఉంటుందని తెలిపారు. పునర్విభజన వల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు నష్టం జరుగుతుందన్నది తప్పుడు ప్రచారమన్నారు. ప్రతి రాష్ట్రంలో సీట్లు పెరగడం వల్ల ప్రాతినిధ్యం మరింత విస్తరిస్తుందని చెప్పారు. గతంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లుల్లో ఓబిసిల ప్రస్తావన లేదన్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఆరోపణలు కేవలం బిల్లును అడ్డుకోవడానికేనని విమర్శించారు. బిల్లు అమలును 2034 వరకు ఆలస్యం చేయాలన్న ఉద్దేశం లేదని, వీలైనంత త్వరగా అమలు చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు ద్వారా మహిళలకు రాజకీయంగా సమాన అవకాశాలు లభిస్తాయని, దీనిపై ప్రతిపక్షాల విమర్శలు నిరాధారమని విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు.

## దేశవ్యాప్తంగా రోడ్డు భద్రతపై
# 'సుప్రీం' మార్గదర్శకాలు జారీ

### ఎక్స్‌ప్రెస్‌వేలు ప్రమాదకర కారిడార్లుగా మారకూడదని హితవు

**న్యూఢిల్లీ :** పరిపాలనాపరమైన అలసత్వం లేదా మౌలిక సదుపాయాల లోపాల కారణంగా ఎక్స్‌ప్రెస్ వేలు ప్రమాదకర ప్రాంతాలుగా మారే ప్రమాదం ఉందని గమనించిన సుప్రీంకోర్టు రహదారి భద్రతను మెరుగుపర్చేందుకు దేశవ్యాప్తంగా పలు మార్గదర్శకాలను జారీచేసింది. ఇందులో భాగంగా అటువంటి రోడ్లపై భారీ వాహనాలను నిలపడంపై అత్యున్నత న్యాయస్థానం నిషేధం విధించింది. భారతదేశంలోని మొత్తం రహదారులలో జాతీయ రహదారులు రెండు శాతం మాత్రమే ఉన్నప్పటికీ, మొత్తం రోడ్డు ప్రమాద మరణాలలో దాదాపు 30శాతానికి ఇవే కారణం అవుతున్నాయని న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, ఎ.ఎస్.చందుర్కర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వెల్లడించింది. అక్రమ పార్కింగ్‌లు లేదా బ్లాక్‌స్పాట్‌ల వంటి నివారించదగిన ప్రమాదాల మూలంగా ఒక్క ప్రాణం పోయినా రాష్ట్ర రక్షణ వ్యవస్థ విఫలమైనట్లేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రహదారులను మరింత సురక్షితంగా మార్చాలని జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఎం.ఎస్.చందుర్కర్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏ), రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీచేసింది. 'అక్రమ పార్కింగ్‌లు లేదా బ్లాక్‌స్పాట్‌లు వంటి నివారించదగిన ప్రమాదాల వల్ల ఒక్క ప్రాణం పోయినా అది ప్రభుత్వ రక్షణ గొడుగు విఫలమైనట్లే. అది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద పొందుపరుచబడిన జీవించే హక్కు అనేది కేవలం చట్టవిరుద్ధంగా ప్రాణాలు తీయకుండా ఇచ్చే హక్కు మాత్రమే కాదు. మానవ జీవితం పరిరక్షించబడి, విలువ ఇవ్వబడే సురక్షిత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వానికి అప్పగించే ఒక స్పష్టమైన ఆదేశం' అని ఏప్రిల్ 13 నాటి తన ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు పేర్కొంది. రాజస్థాన్‌లోని ఫలోడి, తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డిలో 2025 నవంబరు 2, 3 తేదీలలో వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదాలలో 34మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో వ్యవస్థాగత నిర్లక్ష్యం, విపత్కర మౌలిక సదుపాయాల వైఫల్యాల కారణంగా అనివార్యప్రాణనష్టం వాటిల్లిందనే ఆరోపణలపై సుమోటోగా నమోదు చేసిన కేసులో ఈ ఉత్తర్వులను జారీచేసింది. దేశ వ్యాప్త ఆదేశాలు జారీచేసిన ధర్మాసనం ఇలా పేర్కొంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ప్రకారం గౌరవప్రదంగా జీవించే హక్కులో ప్రయాణికుల భద్రత ఒక అంతర్భాగమని, ఈ మధ్యంతర ఆదేశాలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద అధికారాలకు ఉపయోగించి జారీ చేయబడటానికి గల వ్యవస్థాగత మూలకారణాన్ని పరిష్కరించడం వారి ప్రయోజనాల దృష్ట్యా అవసరం'. మానవ జీవిత పవిత్రతను ఏ ద్రవ్య లేదా పరిపాలనాపరమైన పరిమితి అధిగమించలేదని, ఇందులో నిర్దేశించిన కఠినమైన కాలపరిమితులు ఈ రాజ్యాంగ బాధ్యత యొక్క ఆవశ్యకతను ప్రతిబింబిస్తున్నాయని న్యాయస్థానం పునరుద్ఘాటిస్తోందని ధర్మాసనం తెలిపింది. 'నిర్దేశిత బే, లే–బే లేదా మార్గం పక్క సౌకర్యం ఉన్న ఏ జాతీయ రహదారి క్యారేజ్‌వే లేదా పేవ్డ్ షోల్డర్ పైన భారీలేదా వాణిజ్య వాహనాలను పార్క్ చేయకూడదు / ఆపకూడదు' అని సుప్రీం కోర్టు ఆదేశించింది. రాష్ట్ర పోలీసులకు, అధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ (ఏటిఎంఎస్) రియల్–టైమ్ హెచ్చరికలు, జిపిఎస్ టైమ్ స్టాంప్‌తో కూడిన ఫోటోగ్రాఫిక్ ఎవిడెన్స్, సమీకృత ఇ–చలాన్ జనరేషన్ ద్వారా ఈ ఆదేశం అమలు చేయబడుతుందని ధర్మాసనం పేర్కొంది. 'ఈ ఆదేశాలను ఎన్‌హెచ్ఏఐ, రాష్ట్ర పోలీసులు, రాష్ట్ర రవాణ శాఖ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాటించాలి. ఈ అధికారులందరిచే ఆసక్తికర తనిఖీలు, గస్తీకి సంబంధించి, సంబంధిత జిల్లా మెజిస్ట్రేట్స్ ఈ ప్రయోజన ం కోసం ఒక ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని ఏర్పాటు చేయాలి. ఈ ఉత్తర్వు తేదీ నుండి 60రోజులలోపు ఈ ఆదేశాలను పాటించాలి' అని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. ఏదైనా జాతీయ రహదారి యొక్క రైట్ ఆఫ్ వే (ఆర్‌ఓడబ్ల్యు) పరిధిలో ఎలాంటి కొత్త ధాబా, భోజనశాల వాణిజ్య కట్టడాల నిర్మాణం/నిర్వహణను తక్షణమే నిషేధించడం ఈ ఆదేశాలలో ఒక ముఖ్యమైన అంశం. '2025 ఆగస్టు 7' నాటి సిఎన్‌హెచ్ విధాన, ఎస్‌ఓపి నిబంధనల ప్రకారం జిల్లా మెజిస్ట్రేట్లు 60 రోజులలోపు ఒక లేదా ఇప్పటికే ఉన్నటువంటి అనధికార నిర్మాణాలను కూల్చివేయడం/ తొలగించడం అమలు చేయాలి' అని ధర్మాసనం ఆదేశించింది. జాతీయ రహదారి భద్రతా మండలాలలోని ఏ సైట్లకైనా ఎన్‌ఎచ్‌ఏఐ/ పిడబ్ల్యుడి ముందస్తు అనుమతి లేకుండా ఏ శాఖ, అధికార సంస్థ లేదా స్థానిక సంస్థ అయినా ఎలాంటి లైసెన్స్ ఎన్‌ఓసి లేదా ట్రేడ్ అప్రూవల్‌ను మంజూరు చేయడంగానీ, పునరుద్ధరించండంగానీ చేయరాదని, అలాగే అటువంటి సైట్లకు ఉన్న అన్ని లైసెన్స్‌లను 30 రోజులలోగా సమీక్షించాలని అందులో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వు వెలువడిన 15రోజులలోపు జాతీయ రహదారి వెళ్లే ప్రతీ జిల్లాలో సంబంధిత జిల్లా మెజిస్ట్రేట్, జిల్లా అడ్మినిస్ట్రేషన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అధికారులు ,ఎన్‌హెచ్ఏఐ, పిడబ్ల్యుడి, స్థానిక సంస్థల అధికారులతో కూడిన ప్రతీ జిల్లా రహదారి భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను ఏడు రోజులలోపు భారతదేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.



## తెలంగాణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా
# నండూరి హరీష్ ఘనవిజయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా నండూరి హరీష్ విజయం సాధించారు. తన సమీప అభ్యర్థి డి రవీందర్ పై 213 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ప్రవీణ్ కుమార్ తన సమీప ప్రత్యర్థి మణికుమార్ పై 7 ఓట్ల తేడాతో విజయం సాధించారు. సోమాజిగూడ ప్రెస్ ప్రెస్ క్లబ్ ఆవరణలో ఆదివారం జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం 740 ఓట్ల గాను 477 మంది వీడియో జర్నలిస్టులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జనరల్ సెక్రటరీగా పిఎస్ సన్నీ, ట్రెజరర్‌గా విజయకుమార్, జాయింట్ సెక్రటరీ గా జనార్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ ఎన్నికలకు సీనియర్ కెమెరామెన్ మోహన్ రాజు పిళ్ళై ఎన్నికల అధికారిగా వ్యవహరించగా కౌంటింగ్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు వనం నాగరాజు సీనియర్ జర్నలిస్టు గుండా నిరంజన్ ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరి ప్రసాద్ ద్ పర్యవేక్షించారు.

## స్క్రాప్ విక్రయాలతో
# రైల్వేలకు భారీ ఆదాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:**రైల్వే శాఖ స్క్రాప్ విక్రయాలు, నాన్‌ఫేర్ రెవెన్యూ (టికెట్ కాని ఆదాయం) ద్వారా గణనీయమైన ఆర్థిక వృద్ధిని సాధించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో స్క్రాప్ విక్రయాల ద్వారా రూ.6,813.86 కోట్లు సంపాదించి, రూ.6,000 కోట్ల లక్ష్యాన్ని అధిగమించింది. రైల్వే యార్డులు, డిపోలు, వర్క్‌షాప్‌లలో ఉపయోగంలో లేని పరికరాలను విక్రయించడం ద్వారా విస్తృత స్థలాన్ని ఖాళీ చేసి, 'రీసైక్లింగ్' 'వెస్ట్ రిడక్షన్' లక్ష్యాలను ప్రోత్సహిస్తోంది. దీనివల్ల రైల్వే వ్యవస్థ మరింత పర్యావరణ హితంగా మారుతోంది. ఇక నాన్‌ఫేర్ రెవెన్యూ విషయంలో కూడా గణనీయమైన వృద్ధి నమోదైంది. గత ఐదేళ్లలో 168 శాతం పెరుగుదలతో రూ.290 కోట్ల నుంచి రూ.777 కోట్లకు పెరిగింది. స్టేషన్లలో ఏర్పాటు చేసిన 120 జనౌషధి కేంద్రాలు, 22 ప్రీమియం బ్రాండ్ ఔట్‌లెట్లు ఈ వృద్ధికి కీలకంగా నిలిచాయి.ఈ అదనపు ఆదాయాన్ని ఉపయోగించి రైల్వేలు ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందిస్తున్నాయి. శుభ్రమైన స్టేషన్లు, ఆధునిక మౌలిక వసతులు, మెరుగైన భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేయడంతో పాటు కోవర్కింగ్ డిజిటల్ లాంజ్‌లు, మెడికల్ సెంటర్లు, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, గేమింగ్ జోన్లు వంటి సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నారు. టికెట్ ధరలు పెంచకుండా ఈ విధంగా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను పెంచడం ద్వారా ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరచడం రైల్వే శాఖ కీలక వ్యూహంగా కొనసాగిస్తోంది.

## మందకొడిగా 1982లో మొదలైన రహదారుల విస్తరణ
# 2006–2026 మధ్యకాలంలో వేగవంతమైన పురోగతి

### 20 ఏళ్లలోనే 331 రహదారుల పనులు
### 5,231 ఆస్తుల స్వాధీనం
### చర్చల దశలో హెచ్-సిటీ ప్రాజెక్ట్ సేకరణ ప్రక్రియ
### మారుతున్న హైదరాబాద్ రూపురేఖలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'హెచ్ సిటీ' ప్రాజెక్ట్‌లో భాగంగా భూసేకరణ ప్రక్రియను మరింత వేగం పెంచారు. హెచ్‌సిటీ ప్రాజెక్టు నిమ్మితం భూ నిర్వాసితులకు ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్)ను అందించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి పనుల నిమ్మితం 2007 నుంచి 2026 సంవత్సర మధ్యకాలంలో మొత్తం 331 రహదారుల విస్తరణ పనులు చేపట్టగా, ఇందులో 66 రహదారుల పనులు పూర్తయ్యాయని, ఈ పనుల కోసం మొత్తం 5,231 ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ అధికారులు అంతర్గతంగా రూపొందించిన ఒక నివేదికలో స్పష్టమైంది. హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు చేపట్టిన వివిధ రహదారి అభివృద్ధి ప్రాజెక్టుల కోసం గత 20 ఏళ్లలో భారీస్థాయిలో ఆస్తుల సేకరణ జరిగింది. 2007 నుండి 2026 మధ్య కాలంలో మహానగర పాలక సంస్థ (జిహెచ్ఎంసి) మొత్తం 331 రహదారుల అభివృద్ధి లక్ష్యంగా నిర్ధేశించుకోగా, 5,231 ఆస్తులను స్వాధీనం చేసుకుంది. ఇటీవల హైదరాబాద్ నగరాన్ని మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లుగా ప్రభుత్వం విభజించిన విషయం తెలిసిందే. 'ట్రైసిటీ'లో ప్రస్తుతం కోటికిపైగా జనాభా చేరుకుంది. దీంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జిహెచ్ఎంసి మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్లు, జంక్షన్‌ల అభివృద్ధి, మిస్సింగ్ లింక్ రోడ్లు వంటి పలు ప్రాజెక్టులను చేపడుతున్నారు.

**46 ఏళ్ల కిందటే రహదారుల విస్తరణకు శ్రీకారం..**

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 1982లో 46 ఏళ్ల కిందటే అప్పటి ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం నగరంలో ప్రధాన రహదారులను విస్తరించేందుకు ప్రభుత్వం పలు దశల్లో చర్యలు చేపట్టినట్టు ఈ నివేదికలో వెల్లడించారు.

**ప్రైవేట్ చర్చల ద్వారా వేగవంతమైన సేకరణ**

భూ సేకరణలో భాగంగా జిహెచ్ఎంసి ముందుగా ప్రభావిత ఆస్తి యజమానులతో చర్చలు జరిపి వారి సమ్మతి తీసుకుంటుంది. ప్రస్తుతం యజమాని అంగీకరిస్తే ప్రైవేట్ చర్చల ద్వారా, లేదంటే 'భూసేకరణ చట్టం 2013 ' ప్రకారం ఆస్తులను సేకరిస్తున్నారు. 1982కు ముందు రోడ్డు విస్తరణ కోసం ఆస్తుల స్వాధీనం పనులను ఇంజనీరింగ్ విభాగం నిర్వహించేది. ఆ తర్వాత ఈ బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగానికి మారింది. దీంతో అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి ప్లానింగ్ విభాగాన్ని భాగస్వామ్యం చేస్తూ రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డిపి) సిద్ధం చేశారు. అప్పటి స్పెషల్ ఆఫీసర్ తీసుకున్న నిర్ణయం మేరకు ప్లానింగ్ విభాగం భాగస్వామ్యంతో ప్రైవేట్ చర్చల ద్వారా భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. అప్పట్లో పరిహారం చాలా తక్కువగా ఉండేది. చదరపు అడుగుకు రూ.130తో పాటు 30 శాతం సోలాటియం మాత్రమే చెల్లించే వారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లింపు ప్రక్రియ మెరుగైంది. అయితే, యజమానులు స్వచ్ఛందంగా భూమిని అప్పగిస్తే భవన నిర్మాణ అనుమతుల్లో మినహాయింపులు ఇచ్చే వెసులుబాటు కల్పించడంతో నగరంలో అనేక ప్రధాన రహదారుల విస్తరణకు భూ యాజమానులు ముందుకొస్తున్నట్టుగా ఆ నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది.

**టిడిఆర్‌తో తగ్గనున్న ఆర్థిక భారం**

- ■ ప్రభుత్వం 2012లో ప్రవేశపెట్టిన టిడిఆర్ పాలసీని 2017లో మరింత సరళీకరించి, ప్రయోజనాలను పెంచింది.
- ■ రహదారి విస్తరణకు : 400 శాతం టిడిఆర్.
- ■ నాలాలు, చెరువుల అభివృద్ధికి : 200 శాతం టిడిఆర్.
- ■ ఈ విధానంతో జిహెచ్ఎంసిపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, ఆస్తి యజమానులకు లాభదాయకంగా ఉండటంతో సేకరణ ప్రక్రియ వేగవంతమైంది.

**మెట్రో రైల్ – విజయవంతమైన నమూనా**

హైదరాబాద్ నగరంలో రోడ్డు విస్తరణ పనుల్లో మెట్రో రైల్ ప్రాజెక్టు అత్యంత వేగంగా పురోగతి సాధించింది. మెట్రో కోసం 2,024 ఆస్తులను సేకరించారు. 29 రహదారులను విస్తరించాల్సి ఉండగా, ఇప్పటికే 25 మార్గాల్లో పనులు పూర్తయ్యాయి. మెట్రోతో పోలిస్తే ఎస్ఆర్‌డిపి, మిస్సింగ్ లింక్ రోడ్లు, జంక్షన్‌ల అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయని అధికారులు అంతర్గతంగా రూపొందించిన నివేదికలో పేర్కొన్నారు. ముఖ్యంగా వెస్ట్ జోన్ (ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) పరిధిలో చేపట్టిన మిస్సింగ్ లింక్ ప్రాజెక్టులలో కేవలం మూడో వంతు మాత్రమే పూర్తయ్యాయి. జంక్షన్‌ల అభివృద్ధి కోసం 125 చోట్ల పనులు మొదలు పెట్టినా, కేవలం ఒక్కటి మాత్రమే పూర్తి కావడం గమనార్హం.

**గత (2007–2026) 20 ఏళ్ల ప్రగతి – ప్రాజెక్టుల వారీగా ఆస్తి సేకరణ వివరాలు**

| క్ర.సం. | పని పేరు | చేపట్టిన రోడ్లు | పూర్తయినవి | సేకరించిన ఆస్తులు |
|---|---|---|---|---|
| 1 | సాధారణ రహదారులు | 65 | 13 | 1655 |
| 2 | మెట్రో రైల్ | 29 | 25 | 2024 |
| 3 | ఎస్ఆర్‌డిపి | 31 | 13 | 882 |
| 4 | మిస్సింగ్ లింక్ రోడ్లు | 38 | 13 | 330 |
| 5 | జంక్షన్‌ల అభివృద్ధి | 125 | 01 | 34 |
| 6 | హెచ్‌సిటీ | 38 | 0 | 167 |
| | మొత్తం | 331 | 66 | 5231 |

**చర్చల దశలో 'హెచ్-సిటీ' ఆస్తుల స్వాధీనం ...**

హైదరాబాద్ మెట్రో రైల్, వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రణాళిక (ఎస్ఆర్‌డిపి), చార్మినార్ పాదచారుల ప్రాజెక్ట్(సిపిపి), మిస్సింగ్ లింక్ రోడ్లు, జంక్షన్ అభివృద్ధి కోసం భూసేకరణ చేపట్టారు. తాజాగా హెచ్‌సిటీ ప్రాజెక్టులకు సంబంధించి 167 ఆస్తుల స్వాధీన ప్రక్రియ ప్రస్తుతం చర్చల దశలో ఉంది. జిహెచ్ఎంసి సాధారణ రోడ్డు విస్తరణ పనుల కోసం 65 రోడ్డు విభాగాల్లో 1,655 ఆస్తులను గుర్తించగా, కేవలం 13 విభాగాల్లోనే పనులు పూర్తయ్యాయి. కాగా మూసీ పునరుద్ధరణ అభివృద్ధి ప్రాజెక్ట్ ప్రారంభమైతే, నది పరివాహక ప్రాంతాలు, బఫర్ జోన్‌లలో 10,000కు పైగా ఆస్తులను స్వాధీనం చేసుకునే అవకాశం ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. భవిష్యత్తులో నగర ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు చెప్పారు.

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం...

# 13% తగ్గిన ఎల్‌పిజి వినియోగం

పెరిగిన డీజిల్, పెట్రోల్ అమ్మకాలు



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారతలో వంట గ్యాస్ వినియోగంపై పడింది. గృహ వంట గ్యాస్, వాణిజ్య వినియోగదారులకు ఎల్పిజి సరఫరాను తగ్గించడంతో దేశంలో ఎల్పిజి వినియోగం ఏకంగా 13 శాతం పడిపోయింది. 2026 మార్చిలో దేశంలో ఎల్పిజి వినియోగం 2.379 మిలియన్ టన్నులుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంలో (2025 మార్చి) వినియోగించిన ఎల్పిజి 2.729 మిలియన్ టన్నులు. దీంతో గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది వినియోగం 12.8 శాతం మేర తగ్గింది. మరోవైపు, దేశంలో చమురు కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలతో పెట్రోల్, డీజిల్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. భారత్ తన ఎల్పిజి అవసరాలలో సుమారు 60 శాతాన్ని దిగుమతి చేసుకుంటోంది. ఈ దిగుమతులు అధిక భాగం హార్ముజ్ జలసంధి ద్వారానే జరుగుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ కలిసి సంయుక్తంగా దాడులు చేయడం, దానికి టెహ్రాన్ ప్రతీకార చర్యల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి మూతపడింది. దీంతో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి భారతకు వచ్చే ఎల్పిజి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో గృహ వంట గ్యాస్ వినియోగదారులకు సరఫరాను కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, పరిశ్రమలు వంటి వాణిజ్య సంస్థలకు ఎల్పిజి సరఫరాను తగ్గించింది. చమురు మంత్రిత్వ శాఖకు చెందిన పెట్రోలియం ప్రణాళిక అండ్ విశ్లేషణ విభాగం (పిపిఎసి) ప్రకారం, గృహ వినియోగ ఎల్పిజి సిలిండర్ల అమ్మకాలు మార్చిలో 8.1 శాతం తగ్గి 2.219 మిలియన్ టన్నులకు పడిపోయాయి. గృహేతర వినియోగదారులకు ఎల్పిజి అమ్మకాలు దాదాపు 48 శాతం తగ్గాయి. బల్క్ ఎల్పిజి అమ్మకాలు ఏకంగా 75.5 శాతం తగ్గాయి. దేశంలో ఎల్పిజి సరఫరాలు సాధారణంగా ఉన్నాయని, గృహ వినియోగదారుల డిమాండ్ మొత్తం తీరిందని ప్రభుత్వం చెప్తున్న వాదనలతో పోలిస్తే, పిపిఎసి డేటా తక్కువ ఎల్పిజి వినియోగాన్ని చూపించింది. ఈ కొరతను భర్తీ చేసే, ఎల్పిజి ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోకెమికల్ ఉత్పత్తి నుంచి ఫీడ్‌స్టాక్‌ను మళ్లించాలని రిఫైనరీలను ఆదేశించింది. తద్వారా దేశీయ ఎల్పిజి ఉత్పత్తి 1.1 మిలియన్ టన్నుల నుంచి 1.4 మిలియన్ టన్నులకు పెరిగింది. మొత్తం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఎల్పిజి ఉత్పత్తి 13.1 మిలియన్ టన్నులకు చేరుకుంది. అదే సమయంలో మొత్తం సంవత్సరానికివినియోగం 6 శాతం పెరిగి 33.212 మిలియన్ టన్నులకు చేరుకుంది. యుద్ధం కారణంగా అనేక గల్ఫ్ దేశాలలో గగనతలం మూసివేయడం, విమాన సర్వీసుల నిలిచి పోవడంతో జెట్ ఇంధనం (ఎటిఎఫ్) వినియోగం మార్చి నెలలో దాదాపు స్థిరమైన వృద్ధిని మాత్రమే నమోదు చేసింది. గతేడాది ఇదే నెలలో 8,01,000 టన్నుల అమ్మకాలు జరగగా, ఈసారి అవి 8,07,000 టన్నులకు చేరింది. యుద్ధ ప్రభావానికి లోనైన ఆ రెండు ఇంధనాలు మినహా పెట్రోల్, డీజిల్ అమ్మకాలలో గణనీయమైన వృద్ధి కనిపించింది. మార్చి నెలలో పెట్రోల్ అమ్మకాలు 7.6 శాతం పెరిగి 3.78 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. డీజిల్ వినియోగం 8.1 శాతం పెరిగి 8.727 మిలియన్ టన్నులకు చేరింది.

మహిళా రిజర్వేషన్ అమలు

# ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం

మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన ప్రదర్శన



**న్యూఢిల్లీ :** రాజకీయ కారణాల వల్ల మహిళల కోటాను ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివారం నిరసన తెలిపింది. ఈ సందర్భంగా, ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసింది. 2029 నాటికి శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు, అలాగే లోక్‌సభ స్థానాల సంఖ్యను 816కు పెంచేందుకు ఉద్దేశించిన 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు' లోక్‌సభలో వీగిపోయిన రెండు రోజుల తర్వాత, ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. ఈ నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ 'ఆ బిల్లు ఆమోదం పొందినప్పుడు, దానిని 2024 లోక్‌సభ ఎన్నికల నుంచే అమలు చేయాలని మేము (కాంగ్రెస్) డిమాండ్ చేశాము. ఆ డిమాండ్‌ను వారు పట్టించుకోలేదు; అది ఎప్పటి నుంచి అమలవుతుందనే విషయాన్ని తర్వాత తెలియజేస్తామని మాకు చెప్పారు. దాదాపు 30 నెలల పాటు వారు మౌనంగానే ఉన్నారు. అకస్మాత్తుగా, ఏప్రిల్ 16 రాత్రి ఆ బిల్లుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేశారు' అని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన నిబంధనలు కలిగిన ఆ బిల్లు, ప్రతిపక్షాల ఐక్యత కారణంగా ఆమోదం పొందదని స్పష్టమయ్యాక, ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నోటిఫై చేసే విషయంలో హడావిడి పడిందని, ఇప్పుడు మాత్రం కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకమని ఆరోపిస్తోందని రమేష్ మండిపడ్డారు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో, పార్టీ కార్యకర్తలు నినాదాలు చేస్తూ బిజెపి ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబా, ఢిల్లీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుష్ప సింగ్, ఐఎసిసి అధికార ప్రతినిధి రాగిణి నాయక్ వంటి సీనియర్ నాయకులు పాల్గొన్నారు. సభను ఉద్దేశించి యాదవ్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల పరిధిలోనే మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఈ కోటాను అమలును ఆలస్యం చేసేందుకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే డీలిమిటేషన్‌తో ముడిపెట్టిందని ఎఐసిసి అధికార ప్రతినిధి రాగిణి నాయక్ ఆరోపించారు. '2023లో ప్రతిపక్షమంతా మహిళా రిజర్వేషన్ చట్టానికి మద్దతు ఇచ్చింది, కానీ మోదీ ప్రభుత్వం జనాభా లెక్కలు, డీలిమిటేషన్ అనే రెండు షరతులు విధించి దానిని వాయిదా వేసింది. 543 సీట్లలో రిజర్వేషన్ అమలు చేయాలని ఈనాటికీ మేమే చెబుతున్నాం' అని ఆమె అన్నారు. రౌస్ అవెన్యూ కోర్టు సమీపంలోని ఢిల్లీ కాంగ్రెస్ కార్యాలయం వద్ద పలువురు కాంగ్రెస్ నిరసనకారులు గుమిగూడి, ప్రధానమంత్రి దిష్టిబొమ్మకు దహనం చేసి, బిజెపి ప్రధాన కార్యాలయం వైపు పాదయాత్ర చేసేందుకు ప్రయత్నించారు.

## చట్ట విరుద్ధమైన పోస్ట్‌లపై ఇ.సి చర్యలు

ఎ.ఐతో వక్రీకరణలు చేయవద్దని హెచ్చరిక

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియాలో వచ్చిన 11,000 చట్టవిరుద్ధమైన పోస్టులు, ఇతర కంటెంట్‌పై చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. సోషల్ మీడియాలో వచ్చిన ఈ చట్టవిరుద్ధమైన పోస్టులన్నీ ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించినవేనని, అందుకే తగిన చర్యలు తీసుకున్నామని తెలియజేసింది. మార్చి 15వ తేదీన ఎన్నికల సంఘం పోలింగ్ ప్రక్రియ ప్రకటన జారీ చేసింది. ఇక అప్పటినుండీ సోషల్ మీడియా పోస్టులు, యూఆర్ఎల్ పోస్టులను తనిఖీ చేయగా ఎన్నికలకు సంబంధించి 11,000 చట్టవిరుద్ధమైన పోస్టులు కనిపించామని, వాటన్నింటినీ పరిశీలించి ఆ కంటెంట్‌ను తొలగించడంతోపాటు వారిని గుర్తించడం, వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం, ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయడం వంటి ప్రక్రియ చేపట్టినట్లు ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటించింది. అసోం, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలలో ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తికాగా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఈనెలాఖరున పోలింగ్ జరుగుతుంది. ఈ ప్రక్రియను తప్పుతోవ పట్టించేందుకు లేదా కృత్రిమ మేధ ద్వారా చట్టవిరుద్ధంగా వక్రీకరించే కంటెంట్‌ను సృష్టించేందుకు ఎలాంటి పని చేసినా తమ దృష్టికి వచ్చిన కేవలం మూడు గంటల వ్యవధిలోనే ఆ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల దృష్టికి తీసుకువచ్చి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. రాజకీయపార్టీలు, అభ్యర్థులు, ప్రచారం చేసే ప్రతినిధులు కూడా వాస్తవాలుగా భ్రమపెట్టే సింథటిక్ జనరేటెడ్ లేదా కృత్రిమ మేథతో తయారు చేసిన కంటెంట్‌ను ప్రచారంలో గనుక ఉపయోగిస్తే, వాటిని ''ప్రత్యేకంగా సృష్టించినవి'' అని స్పష్టంగా తెలియజేసే లేబుల్స్ వాటిపై ముద్రించాలని, ఒరిజినల్ కంటెంట్‌ను కూడా బహిర్గతం చేయాలని, డిజిటల్ రూపంలో ఎలాంటి సందిగ్ధంలో పడేయకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని కోరింది. ఓటర్ల విశ్వసనీయత, వారి బాహాటత్వంకోసం కట్టుబడి ఉండాలని కోరింది.

ఇది ప్రజాస్వామ్యం..

## హిట్లర్ పాలన కాదు...

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్



**బెంగళూరు :** మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ప్రవేశపెట్టిన సమయం, వ్యవహరించిన తీరుపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ బిజెపి నేతృత్వంలోని కేంద్రాన్ని విమర్శించారు. ఈ విషయంలో ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదని మండిపడ్డారు. ప్రజాస్వామ్య చట్రంలో విస్తృత సంప్రదింపులు జరపాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తోందని, అయితే ప్రతిపక్ష పార్టీలతో తగినంత చర్చ లేకుండా ఈ బిల్లును ప్రవేశపెట్టారని ఆరోపిస్తూ, దానిని ముందుకు తెచ్చిన తీరును ఉప ముఖ్యమంత్రి వ్యతిరేకించారు. 'ఇది ప్రజాస్వామ్యం; ఇది హిట్లర్ తరహా పాలన కాదు. ఎన్నికల మధ్యలో దీనిని తీసుకువచ్చి, మొత్తం నియోజకవర్గాలను మార్చడానికి ప్రయత్నించలేరు' అని ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో శివకుమార్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై పార్టీలకు అతీతంగా చర్చించి ఉండాల్సిందని ఉప ముఖ్యమంత్రి సూచించారు. 'వారు అందరినీ విశ్వాసంలోకి తీసుకోవాలి, కానీ అలా చేయలేదు. అందుకే ప్రతిపక్ష పార్టీలు చాలా మంచి పని చేశాయి. ఇది భారత కూటమి విజయం' అని కాంగ్రెస్ కర్ణాటక యూనిట్ అధ్యక్షుడైన శివకుమార్ అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లో కూడా సీట్లను పెంచాల్సి ఉంది. కాగా, కాంగ్రెస్ పార్టీ మహిళా వ్యతిరేకి అని బిజెపి చేసిన ఆరోపణలపై శివకుమార్ స్పందిస్తూ 'ఇది ఎవరి సొంత ఆస్తి కాదు— మహిళలు దేశ సంపద. మేము దీనిని రాజ్యసభలో ఆమోదించాము, అంతేకాక స్థానిక సంస్థలలో మహిళలకు కాంగ్రెస్ ఇప్పటికే 50 శాతం రిజర్వేషన్ కల్పించింది. నేటికీ, మేము దీనికి మద్దతు ఇస్తున్నాము' అని అన్నారు.

మరో నాలుగు రోజుల్లో పోలింగ్...

## బెంగాల్‌లో 7 లక్షల కొత్త ఓటర్లను చేర్చిన ఇసి

**న్యూఢిల్లీ :** మరో నాలుగు రోజుల్లో పశ్చిమ బంగాల్‌లో తొలి దశ ఎన్నికల పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు బంగాల్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఓటరు జాబితాలో కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) సుమారు ఏడు లక్షల కొత్త ఓటర్లను చేర్చింది. అయితే, ఈ అదనపు ఓటర్ల వయసు, వారు పురుష లేదా మహిళా ఓటర్లా అనే విషయాన్ని సిఇసి వెల్లడించకపోవడం గమనార్హం. అలాగే ఓటర్ల జాబితాలో చేర్చడం కోసం అందిన ఫారం 6 దరఖాస్తుల సంఖ్యను గానీ, వాటిలో ఎన్ని తిరస్కరణకు గురయ్యో అనే విషయాన్నీ వెల్లడించలేదు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందే బెంగాల్ ఓటరు జాబితాల్లో లక్షలాది మందిని చేర్చడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘంపై టిఎంసి, ఇతర ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఈ కొత్త ఓటర్లలో సుమారు 3.22 లక్షల మంది మొదటి దశ పోలింగ్‌లో (ఏప్రిల్ 23న) ఓటు వేయనుండగా, మిగిలిన 3.88 లక్షల మంది ఓటర్లు రెండో దశ పోలింగ్‌లో (ఏప్రిల్ 29న) తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా మొత్తం గణాంకాలను విడుదల చేశామని పేర్కొన్నారు. వివరణాత్మక సమాచారాన్ని తర్వాత విడుదల చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 6,82,51,008గా ఉందని, మరిన్ని పేర్లు చేరితే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

రాజకీయ ప్రచారానికి

# ప్రభుత్వ యంత్రాంగం దుర్వినియోగం

జాతినుద్దేశించి మోదీ ప్రసంగం
బిజెపి తరపున చట్టవిరుద్ధమైన
ప్రచారం : మమతా బెనర్జీ



**తారకేశ్వర్ :** రాజకీయ ప్రచారాల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగిన ఒక ఎన్నికల సభలో ఆమె ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి జాతినుద్దేశించి చేసిన ప్రసంగం ద్వారా మోదీ బిజెపి తరపున చట్టవిరుద్ధమైన ప్రచారం చేశారని బెనర్జీ మండిపడ్డారు. 'వారు (బిజెపి) శనివారం రాజకీయ ప్రచారాల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారు. మేము దీనిని ఖండిస్తున్నాము. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాము'అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎంసిసి) ఉల్లంఘించారని పేర్కొన్నారు. 2029 నుండి శాసనసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లను అమలు చేసే బిల్లు లోక్‌సభలో వీగిపోయిన మరుసటి రోజు, అంటే శనివారం నాడు జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో, 'భ్రూణ హత్య అనే పాపానికి' కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు భారతదేశ మహిళలు కఠిన శిక్ష విధిస్తారని మోదీ హెచ్చరించారు. దానిపై మమతా బెనర్జీ స్పందిస్తూ 'మీరు (ప్రధాని) మీ పార్టీ కోసం చట్టవిరుద్ధమైన ప్రచారం చేశారు కాబట్టి, మీరు భారతదేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది' అని బెనర్జీ డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు సెప్టెంబర్ 2023లోనే ఆమోదించబడిందని గుర్తుచేసిన తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ దానిని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఒకే బిల్లును ఎన్నిసార్లు ఆమోదించాల్సి ఉంటుంది? నిలదీశారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుతో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ముడిపెట్టిందని ఆరోపించారు. బిల్లును ఆమోదించడానికి అవసరమైన సంఖ్యాబలం లేకపోయినప్పటికీ, దానిని లోక్‌సభలో ప్రవేశపెట్టే సాహసం వారు చేశారు అని ఆమె అన్నారు. బిజెపి పతనం మొదలైందని ఆమె వ్యాఖ్యానించారు. బెంగాల్ ఎన్నికల్లోని మొత్తం 294 స్థానాల్లోనూ తానే బిజెపి అభ్యర్థి నని మోదీ చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తూ, 'నేను చెప్పే మాటలను అనుకరించడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు' అని బెనర్జీ అన్నారు. మీరు (ప్రధాని) బెంగాల్‌లో ఓటరు కాదు, మీరు ఒక బయటి వ్యక్తి' అని మోదీకి చురకలంటించారు. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి, ఆ తర్వాత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించుకోవాలని ఆమె మోదీని సూచించారు. పూర్వ బర్ధమాన్ జిల్లాలోని కల్నాలో జరిగిన మరో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ, ఒకవేళ బిజెపి అధికారంలోకి వస్తే, టిఎంసి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లక్ష్మీర్ భండార్', ఆదివాసీల కోసం 'జోయ్ జోహార్', మైనారిటీల కోసం 'ఐక్యశ్రీ' వంటి సంక్షేమ పథకాలన్నింటినీ రద్దు చేస్తుందని బెనర్జీ ఆరోపించారు. రాష్ట్రంలో కోటి మంది బాలికలు 'కన్యాశ్రీ' పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆమె తెలిపారు. '2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు, ప్రతి పౌరుడి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. ఆ పార్టీ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసింది; కానీ దానికి భిన్నంగా, బిజెపి ప్రభుత్వ హయాంలో దేశంలో నిరుద్యోగం 40 శాతం మేర పెరిగింది' అని టిఎంసి అధినేత్రి పేర్కొన్నారు. టిఎంసి నాయకులను భయపెట్టేందుకు సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను పావులుగా వాడుకుంటూ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చే శారు. ఏదీ ఏకపక్షంగా జరగదు అని హెచ్చరిస్తూ బెనర్జీ చట్టపరమైన చర్య లు తీసుకుంటామని స్పష్టం చేశారు. తన భద్రతా అధికారికి సంబంధించిన ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించడం ద్వారా తనను భయపెట్టడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని టిఎంసి అధినేత్రి మండిపడ్డారు.

## చొరబాట్లతో రాష్ట్ర భాష, సంస్కృతిని మార్చేస్తోంది

బెంగాల్‌లో టిఎంసి ప్రభుత్వంపై ప్రధాని మోదీ ఫైర్



**పురూలియా :** పశ్చిమ బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. చొరబాట్ల ద్వారా రాష్ట్ర భాష, సంస్కృతిని మార్చేస్తోందని, గిరిజన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తోందని, తాను 'మహా జంగల్ రాజ్' అని అభివర్ణించిన దానికి ప్రభుత్వం అధ్యక్షత వహిస్తోందని ఆయన ఆరోపించారు. గణనీయమైన గిరిజన జనాభా ఉన్న పురూలియాలో జరిగిన ఒక ర్యాలీలో మోదీ ప్రసంగిస్తూ, 2026 అసెంబ్లీ ఎన్నికల ముందు జంగల్‌మహల్‌లో బిజెపి రాజకీయ పట్టును మరింత పదును పెట్టేందుకు మోదీ ప్రయత్నించారు. ఈ పోటీని అభివృద్ధి, బుజ్జగింపు మధ్య పో రుగా ఆయన అభివర్ణించారు. చొరబాట్ల కారణంగా బెంగాల్ భాష, సంస్కృతి లో మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. అధికార పార్టీ రాజకీయాలు రా ష్ట్ర సామాజిక స్వరూపాన్ని మార్చేశాయని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమె ప్రభుత్వంపై దాడిని తీవ్రతరం చేస్తూ, బుజ్జగింపు రాజకీయాల కోసం గిరిజన గుర్తింపు, భాషను విస్మరిస్తున్నారని మోదీ ఆరోపించారు. 'మదర్సా విద్యకు రికార్డు స్థాయిలో బడ్జెట్ కేటాయిస్తూ, సంతాలి భాష ను అవమానిస్తున్నారు. ఇది బుజ్జగింపు తప్ప మరేమీ కాదు' అని ఆయన అన్నా రు. పురూలియా, బంకురా, ఝార్‌గ్రామ్ వంటి గిరిజన ప్రాబల్య జిల్లాలను రో డ్లు, తాగునీరు, ఉద్యోగాలు, ఇతర ప్రాథమిక సౌకర్యాలకు దూరంగా ఉంచుతోందని ఆరోపిస్తూ, ప్రధాని మోదీ టిఎంసి పాలనను పదేపదే 'మహా జంగల్ రాజ్'గా అభివర్ణించారు. మహిళా శాసనసభ్యుల సంఖ్య పెరుగుతుందనే భయంతో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను టిఎంసి వ్యతిరేకిస్తోందని కూడా మోదీ ఆరోపించారు. 'మరింత మంది మ హిళా ఎమ్మెల్యేలు ఎన్నికైతే, వారు మహిళల హక్కుల కోసం గళం విప్పుతారని టిఎంసి భయపడిందని, అందుకే మహిళలకు రిజర్వేషన్‌ను వ్యతిరేకించిందన్నారు. ఈ నేరానికి కూడా మీరు టిఎంసిని శిక్షించాలి అని ఆయన అన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది.. కశ్మీర్ వ్యాప్తంగా

# పర్యాటక ప్రాంతాల్లో పటిష్ఠ భద్రత



**శ్రీనగర్ :** పహల్గాం దాడి జరిగి దాదా పు ఏడాది కావస్తోంది. గత ఏడాది ఏప్రి ల్ 22న జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం లో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. అ మాయక పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. హిందువులే ల క్ష్యంగా ఈ దాడి జరిగింది. ఈ ఘటన లో 25 మంది మరణించారు. వీరిలో ఇ ండియాతోపాటు నేపాల్‌కు చెందిన వా రు కూడా ఉన్నారు. పర్యాటక ప్రాంతం లో ఆనందంగా గడుపుతున్న పర్యాటకు ల్ని ఉగ్రవాదులు హతమార్చారు. కాగా, దాడి జరిగి ఏడాది కావసున్న సందర్భంగా కశ్మీర్ వ్యాప్తంగా పర్యాటక ప్రాంతా ల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల పరిసరాల్లో విధ్వంసకర కార్యకలాపాలు జరిగే అవకాశం ఉం దనే దానిపై అప్రమత్తంగా ఉండాలని అన్ని భద్రతా సంస్థలను కోరినట్లు వారు చెప్పారు. పటిష్టమైన భద్రతా ప్రణాళిక ను రూపొందించడానికి క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు నిర్వహించగా, ఉన్నతాధికారులు ఇటీవల ఈ ఏర్పాట్ల ను సమీక్షించారని వారు తెలిపారు. లష్కరే తోయిబా ఉగ్రవాదులు జరిపిన దారుణ దాడి కారణంగా జమ్ముకశ్మీర్ నుండి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. దీంతో అధికారులు దాదాపు 50 పర్యాటక ప్రదేశాలను మూసివేసి, భద్రతా తనిఖీ అనంతరం వాటిలో కొన్నింటిని దశలవారీగా తిరిగి తెరిచారు. సంవత్సరం తరువాత, గత ఏడాది జరిగిన ఉగ్రదాడి నీడ నుండి బయటపడుతున్న అనంతనాగ్ జిల్లాలోని మినీ స్విట్జర్లాండ్‌గా ప్రసిద్ధి చెందిన పహల్గాం పచ్చిక బయళ్ళు మరోసారి పర్యాటక సందడితో కళకళలాడుతున్నాయి. పర్యాటకుల భద్రతను నిర్ధారించడానికి పహ ల్గాం రిసార్ట్‌లో అనేక కొత్త చర్యలు ప్రవేశపెట్టబడ్డాయి. పహల్గాంలో పర్యాటకుల భద్రత కోసం పర్యాటక సేవా ప్ర దాతలందరికీ ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు వ్యవస్థ ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థ పోనీ రైడ్ ఆపరేటర్లు, తోపుడు బండ్ల వ్యాపారులు, వ్యాపార సంస్థలు, అలాగే బయటి విక్రేతలతో సహా నిజమైన, నమోదిత సేవా ప్రదాతలను సులభంగా గుర్తించడానికి, ధృవీకరించడానికి వీలు కల్పిస్తుంది. ప్రతి సేవా ప్రదాతను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులు నమోదు చేసుకున్నారు. వారికి సంబంధించిన వ్యక్తిగత సమాచారం, ఇతర వివరాలతో కూడిన ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌ను కూడా కేటాయించినట్లు అధికారులు తెలిపారు. పర్యాటకులు తమ మొబైల్ ఫోన్‌లతో ఈ కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు, సంబంధిత వ్యక్తికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. క్యూఆర్ కోడ్‌లలో సేవా ప్రదాత పేరు, సంస్థ వివరాలు, పూర్తి చిరునామా, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, కార్యకలాపాల మార్గం, వారు పోలీసులచే ధృవీకరించబడ్డారా లేదా అనే వివరాలు ఉంటాయి. ఇటీవల జరిగిన ఒక సమావేశంలో సందర్శకులకు సురక్షితమైన, భద్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు, ప్రముఖ పర్యాటక ప్రదేశాలతో సహా సున్నితమైన ప్రాంతాల చుట్టూ భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేయాలని కశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) వి.కె. బిర్ది ఆదేశించారు.

## కోల్‌కతా పోలీస్ డిసి ఇంటిపై ఇడి దాడులు



**కోల్‌కతా :** కోల్‌కతా పోలీస్ డిప్యూటీ కమిషనర్ శాంతను సిన్హా బిస్వాస్, స్థానిక వ్యాపారి కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆదివారం సోదాలు నిర్వహించింది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో ఒక నిందితుడు, అతనికి సంబంధించిన ముఠాపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా సోదాలు చేసినట్లు అధికారులు తెలిపారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) నిబంధనల ప్రకారం, బల్లిగంజ్ ప్రాంతంలోని బిస్వాస్‌తో పాటు అతని నివాసం, సన్ ఎంటర్‌ప్రైజ్ అనే కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ కామ్దార్ అనే వ్యాపారికి చెందిన మరో కార్యాలయంపై సోదాలు జరిగాయి. విచారణ నిమిత్తం కామ్దార్‌ను అధికారులు స్థానిక ఇడి కార్యాలయానికి తీసుకెళ్లారు. పశ్చిమ బెంగాల్, కోల్‌కతా పోలీస్ సంక్షేమ కమిటీ ముఖ్య సమన్వయకర్త, నోడల్ అధికారి అయిన బిస్వాస్ తన కార్యాలయంలో లేరని వారు తెలిపారు. హత్యాయత్నం, దోపిడీ ఆరోపణలపై పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న బిస్వజిత్ పోద్దర్ అలియాస్ సోనా పప్పు అనే స్థానిక నిందితుడి మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఈ చర్య తీసుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ కేసులో ఏప్రిల్ 1న మొదటి విడత సోదాలు నిర్వహించింది. సోదాలు జరిపిన కొన్ని ప్రాంగణాల నుంచి రూ. 1.47 కోట్ల నగదుతో పాటు రూ. 67.64 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి, ఒక నాటు తుపాకీని ఇడి స్వాధీనం చేసుకుంది. అల్లర్లు, హత్యాయత్నం, నేరపూరిత కుట్ర, ఆయుధాల చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్లు పోద్దర్‌పై కోల్‌కతా పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ దర్యాప్తు ప్రారంభమైంది. పోద్దర్‌తో సహా నిందితులు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వ్యవస్థీకృత నేరముఠా కార్యకలాపాలలో నిమగ్నమై, సిండికేట్ కార్యకలాపాల ద్వారా అక్రమంగా నిధులను సమకూర్చుకున్నారని ఇడి ఏప్రిల్ 9న ఒక ప్రకటనలో తెలిపింది. కోల్‌కతాలోని గోల్‌పార్క్ సమీపంలో ఉన్న కంకులియా రోడ్డులో జరిగిన హింసాకాండ కేసులో మోస్ట్ వాంటెడ్‌గా ఉండి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఇడి పోద్దర్‌కు సమన్లు జారీ చేసినప్పటికీ, అతను ఇప్పటివరకు విచారణలో చేరలేదని ఆ సంస్థ తెలిపింది.

**హమాస్–ఫతాహ్ మధ్య గాజాలో చాలా అరుదైన సమావేశాలు జరిగాయి. ఈ వరుస సమావేశాలలో తన గవర్నరింగ్ అధికారాలు స్వాధీనం చేసేందుకు హమాస్ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. హమాస్ ఆయుధాలు స్వాధీనం చేయడంపై ఒక దృక్పథం రూపొందించడం,గాజాస్టిప్ పాలనలో పాలస్తీనా అథారిటీ కేంద్రానికి క్రియాశీల పాత్ర కల్పించడంపై చర్చలు జగాయి.**

### ప్రకటన

ఇందుమూలంగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన శ్రీ వి. రమేష్, తండ్రి: వెంకటేశ్వర్‌రావు, R/o.హైదరాబాద్ జిల్లా గారు వరంగల్ పట్టణంలోని పైడిపల్లి రెవెన్యూ గ్రామములోని ఆరేపల్లి గ్రామ పంచాయతీ సర్వే నం. 581A, 585, 586, 587, 610 మరియు 611 గల మొత్తం ఎ. 13.07 గల షెడ్ మరియు ఖాళీ స్థలంకి గల ఇంటి నెంబర్ 506214 గల ఆస్తిని IFCI Ltd., బ్యాంక్ వారి ప్రజా వేలం ప్రకటన ద్వారా తేది 30-07-2009 రోజున కొనుగోలు చేసినారు.

కావున ఇందు షెడ్యూల్ దాఖలా గల ఆస్తిపై ఎవరైనా అభ్యంతరములు గాని, క్లెయిములు గాని ఉన్నచో ఈ దిగువ అడ్రస్సుకు తమ సాక్ష్యాధారములతో తెలియపరచగలరు. లేనిచో నా క్లయింట్ ఇందు షెడ్యూల్ దాఖలా గల ఆస్తిపై ఎవరి క్లెయిములు గాని, అభ్యంతరములు గాని లేవని భావించి షెడ్యూల్ దాఖలా గల ఆస్తిపై M/s Lamination Granite Limited Company గారి నుండి M/s. Coastal Projects Pvt. Ltd., గారిపై పేరు మార్పిడి చేయుచు తదుపరి వచ్చు అభ్యంతరములు చెల్లనేరవు.

**వివరాలు:** వరంగల్ పట్టణంలోని పైడిపల్లి రెవెన్యూ గ్రామములోని ఆరేపల్లి గ్రామ పంచాయతీ సర్వే నం. 581A, 585, 586, 587, 610 మరియు 611 గల మొత్తం ఎ. 13.07 గల షెడ్ మరియు ఖాళీ స్థలము.

**తూర్పు:** Part of S.No 858 (old) and 859 (old).
**పడమర:** Part of S.No 858 (old) and 859 (old).
**ఉత్తరం:** S. No. 860 (old).
**దక్షిణం:** 60' రోడ్.

Date: 19-04-2026

సం/-
K శ్రీకాంత్, అడ్వకేట్,
గిర్మాజీపేట, వరంగల్
ఫోన్ నం: 9440631394

# ప్రగతిశీల సాహిత్యానికి మాతృక 'వాస్తవికత'

సాహిత్య వాస్తవికత (లిటరరీ రియలిజం)ను ప్రగతిశీల సాహిత్యానికి మాతృకగా పేర్కోవచ్చు. ఇది సాహిత్యంలో ఒక ప్రధాన ధోరణి. ఉత్తమ ప్రక్రియ. సాధారణ జన జీవితం, రోజువారీ అనుభవాలు, వారి జీవన విధానాన్ని యథాతథంగా ప్రతిబింబించడమే దీని ప్రధాన లక్ష్యం. అద్భుతాలు, అతిశయోక్తులు, అలౌకిక సంఘటనలు, కల్పిత ప్రపంచాల వంటి అంశాలను దూరంగా ఉంచి, వాస్తవ జీవితంలోని సంఘటనలను నిష్పక్షపాతంగా చిత్రించడం ఈ ధోరణి మూల సూత్రం. ఇది కథా సాహిత్యానికి పరిమితం కాకుండా, వ్యాసాలు, జీవిత చరిత్రలు వంటి గద్యరచనలకు కూడా వర్తిస్తుంది. 19వ శతాబ్ది మధ్యకాలంలో ఫ్రెంచ్, రష్యన్ సాహిత్యంలో ఈ వాస్తవిక ధోరణి స్పష్టంగా రూపుదిద్దుకుంది. ఫ్రాన్స్‌లో స్టెంధల్, రష్యాలో అలెగ్జాండర్ పుష్కిన్ వంటి రచయితల రచనలు ఈ మార్పుకు దారితీశాయి. చిత్రకళలో కూడా 1848 ఫ్రెంచ్ విప్లవం తరువాత వాస్తవిక ఉద్యమం ప్రారంభమైంది. ఇది రొమాంటిసిజానికి వ్యతిరేక ప్రతిస్పందనగా రూపుదిద్దుకున్న ఆలోచనా విధానం. రొమాంటిసిజం భావోద్వేగాలకు, కల్పనాశక్తికి, వ్యక్తిగత అనుభూతులకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడు, వాస్తవికత భౌతిక ప్రపంచం, సామాజిక వాస్తవాలు, శాస్త్రీయ దృష్టికోణాన్ని ఆధారంగా చేసుకుంది. సాహిత్యంలో వాస్తవికతను సిద్ధాంతపరంగా ప్రతిపాదించినవారిలో జులెస్ ఫ్రాంకోయిస్ ఛాంఫ్లెరీ ముఖ్యుడు. వాస్తవిక సాహిత్యం అనేది 'వస్తు వాస్తవాన్ని' పునర్నిర్మించాలంటాడు జులెస్. రచయిత తన వ్యక్తిగత వ్యాఖ్యానాన్ని తగ్గించి, మూడవ వ్యక్తి దృక్కోణంలో జీవితం ఎలా ఉందో అలా చూపించాలి. ఈ భావనకు తత్వశాస్త్ర పరంగా పునాది వేసే నవలలో రెనే డెస్కార్టెస్, జాన్ లాకే, థామస్ రీడ్ పేర్లను కూడా ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. వీరి అభిప్రాయం ప్రకారం, సత్యాన్ని మనిషి తన ఇంద్రియాల ద్వారా తెలుసుకుంటాడు. ఒనోరే దే బాల్జాక్ తన 'ద హ్యూమన్ కామెడీ' పరిచయంలో సాహిత్య సృష్టి శాస్త్రీయ పరిశోధనతో సమానమని పేర్కొన్నాడు. శాస్త్రపద్ధతి వంటి ఖచ్చితత్వం, పరిశీలన, ఆధారసహిత వాస్తవిక రచనలకు అవసరమని ఆయన భావించాడు. అదే సమయంలో, రొమాంటిసిజం అనే ఉద్యమం 18వ శతాబ్దం వివేక యుగానికి, పరిశ్రమ విప్లవానికి ప్రతిస్పందనగా వచ్చింది. కానీ 19వ శతాబ్దంలో వాస్తవికత రొమాంటిసిజానికి ప్రతిఘటనగా ఎదిగింది. వాస్తవిక సాహిత్యంలో అనేక ఉపప్రక్రియలు ఉన్నాయి. సామాజిక వాస్తవికత పేదలు, కార్మిక వర్గం జీవన పరిస్థితులను విమర్శనాత్మకంగా చిత్రిస్తుంది. సోవియట్ యూనియన్‌లో జోసెఫ్ స్టాలిన్ కాలంలో స్థాపితమైన సోషలిస్టు వాస్తవికత కార్మిక వర్గ పోరాటాన్ని ఘనంగా చూపే రీతిలో సాహిత్యాన్ని మలిచింది. ఈ సిద్ధాంత రూపకల్పనలో ఆండ్రే జానోవ్ కీలక పాత్ర పోషించాడు. అయితే ఈ విధానం కళాత్మక స్వేచ్ఛను పరిమితం చేసిందని విమర్శలు వచ్చాయి. కాగా, నేచురలిజం అనే ధోరణి వాస్తవికత నుంచి అభివృద్ధి చెందింది. ఇది చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంత ప్రభావంతో, వారసత్వం, పరిసరాలు మనుషుల ప్రవర్తనను నిర్ణయిస్తాయని చూపిస్తుంది. ఎమిల్ జోలా రచనలు దీనికి ఉదాహరణలు. జీవితం యొక్క అంధకార, కఠిన వాస్తవాలను ఆయన నిస్సందేహంగా చిత్రించాడు. ఇటలీలో వెరిస్మో అనే వాస్తవిక ధోరణి ఏర్పడింది. దీని ప్రముఖ రచయితలు జియోవన్నీ వేర్గా, లుయిజీ కాపువానా. వీరి రచనల్లో పాత్రల సామాజిక స్థితికి అనుగుణమైన భాష, స్థానిక పదాలు విస్తృతంగా కనిపిస్తాయి. రచయిత తన అభిప్రాయాన్ని ప్రత్యక్షంగా వ్యక్తం చేయకుండా, సంఘటనలను యథాతథంగా చూపించడం ఈ శైలిలో ముఖ్య లక్షణం. సంక్షిప్తంగా చెప్పాలంటే, సాహిత్య వాస్తవికత అనేది జీవితం ఎలా ఉందో అలా చూపించే ప్రయత్నం. ఇది భావోద్వేగాల అతిశయోక్తి లేదా కల్పిత ప్రపంచాల కన్నా సామాజిక వాస్తవాలను, శాస్త్రీయ దృక్కోణాన్ని, సాధారణ మనిషి అనుభవాలను ప్రాధాన్యంగా తీసుకుంటుంది. 19వ శతాబ్దంలో పుట్టిన ఈ ధోరణి, తరువాతి ఆధునిక సాహిత్య వికాసానికి పునాది వేసింది. ప్రగతిశీల భావనలకు పునాదులు వేసి, సరికొత్త సాహితీ ప్రస్థానానికి దారులు చూపింది.


నవలలో వాస్తవికత అనేది సమాజాన్ని, వ్యక్తుల జీవనానుభవాలను, చారిత్రకసామాజిక పరిస్థితులను యథాతథంగా ప్రతిబింబించాలనే లక్ష్యంతో అభివృద్ధి చెందిన ధోరణి. ఇది కల్పిత ఆడంబరాలకన్నా సాధారణ జీవిత సత్యాలపై దృష్టి కేంద్రీకరిస్తుంది. దేశానుసారం దీని రూపం, శైలి, ప్రధానాంశాలు మారినా, 'ఎలా ఉన్నది అలా చూపించడం' అనే మూలసిద్ధాంతం మాత్రం ఒకటే. ఆస్ట్రేలియాలో 19వ శతాబ్ద ప్రారంభంలో ఆంగ్ల వలస సంస్కృతికి భిన్నమైన స్వతంత్ర సాంస్కృతిక స్వరాన్ని నిర్మించాలనే ఆకాంక్ష పెరిగింది. వలసదారులు, స్థానిక ఆదివాసీలు, బంగారు గనుల కార్మికులు వంటి అంశాలు వాస్తవిక చిత్రణకు కేంద్రబిందువయ్యాయి. 1881లో సిడ్నీ బులెటిన్ పత్రిక పేర్కొన్న రొమాంటిక్ ఐడెంటిటీ భావనకు వ్యతిరేకంగా ఆస్ట్రేలియన్ వాస్తవికత ఎదిగింది. జోసెఫ్ ఫర్ఫీ రచించిన 'సచ్ ఇస్ లైఫ్' (1897)



గ్రామీణ జీవితాన్ని కల్పనవాస్తవికత మేళవింపుతో చూపించింది. హెన్రీ హాండెల్ రిచర్డ్సన్ ఫ్రెంచ్, స్కాండినేవియన్ వాస్తవికత ప్రభావాన్ని అనుసరించాడు. 20వ శతాబ్దంలో దృష్టి గ్రామీణ ప్రాంతాలనుంచి నగర కార్మిక వర్గ జీవనానికి మారింది. పాట్రిక్ వైట్ రచనలు 'ట్రీ ఆఫ్ మాన్', 'వాస్' విశేష ప్రాధాన్యం పొందాయి. 1973లో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. తరువాత కాలంలో డర్టీ రియలిజం అనే ఉపశాఖ ఎదిగి, యువత జీవనంలోని నిరాశ, మాదకద్రవ్యాల సంస్కృతి వంటి అంశాలను నిర్దాక్షిణ్యంగా చిత్రించింది. ఇక, యునైటెడ్ కింగ్‌డమ్‌లో నవల పుట్టుకనే వాస్తవికతతో అనుసంధానించినవారిలో ఇయాన్ వాట్ ముఖ్యుడు. ఆయన అభిప్రాయం ప్రకారం 18వ శతాబ్దంలో డేనియల్ డిఫో, సామ్యూయెల్ రిచర్డ్సన్, హెన్రీ ఫీల్డింగ్ రచనల్లో ఫార్మల్ రియలిజం రూపుదిద్దుకుంది. 19వ శతాబ్దంలో జార్జ్ ఎలియట్ రాసిన 'మిడిల్‌మార్చ్' సామాజికరాజకీయ మార్పులను లోతుగా విశ్లేషించింది. ఆర్నోల్డ్ బెన్నెట్, జార్జ్ మూర్ ఫ్రెంచ్ వాస్తవికతను అనుకరించారు. అమెరికాలో విలియం డీన్ హోవెల్స్ వాస్తవిక శైలిని స్థాపించాడు. మార్క్ ట్వెయిన్ తన ప్రాంతీయ భాషా శైలితో అమెరికన్ వాస్తవికతకు స్వరాన్ని ఇచ్చాడు. స్టీఫెన్ క్రేన్ రచించిన 'ది రెడ్ బ్యాడ్జ్ ఆఫ్ కరేజ్' యుద్ధ వాస్తవాలను తీవ్రంగా చిత్రించింది. 'మాగీ: ఎ గర్ల్ ఆఫ్ ది స్ట్రీట్స్' సహజవాద దృక్పథానికి ఉదాహరణ. తరువాత జాన్ స్టెయిన్‌బెక్, థియోడోర్ డ్రైసర్ వంటి రచయితలు సామాజిక వాస్తవాలను విస్తరించారు. యూరప్‌లో ఒనోరే దే బాల్జాక్ రచించిన 'లా కామెడీ హ్యూమైన్' సమకాలీన ఫ్రెంచ్ సమాజాన్ని విస్తృతంగా ఆవిష్కరించింది. గుస్తావ్ ఫ్లోబేర్ రచన 'మాడమ్ బోవరీ' రొమాంటిసిజం భ్రమలను విచ్ఛిన్నం చేసింది. రష్యాలో ఫ్యోడర్ దోస్తోయెవ్స్కీ, లియో టోల్‌స్టోయ్ మానసికనైతిక సంఘర్షణలను లోతుగా పరిశీలించారు. ఇటలీలో వెరిస్మో ఉద్యమంలో జియోవన్ని వేర్గా ప్రధాన ప్రతినిధి. స్పెయిన్‌లో బెనిటో పెరెజ్ గాల్డోస్ సమాజపు అంతర్ముఖతను ప్రతిబింబించాడు. నవలా రచనల్లో వాస్తవికత అనేది దేశానుసారం భిన్న రూపాలు తీసుకున్నా, దాని ప్రధాన లక్ష్యం సామాజిక వాస్తవాన్ని విశ్లేషణాత్మకంగా, శాస్త్రీయ దృక్కోణంతో, నిష్పక్షపాతంగా చిత్రించడమే. ఇది రొమాంటిక్ అతిశయోక్తులకు ప్రత్యామ్నాయం మాత్రమే కాక, ఆధునిక నవల వికాసానికి పునాది కూడా. రంగస్థల వాస్తవికత అనేది 19వ శతాబ్దం చివర నుండి 20వ శతాబ్దం మధ్యకాలం వరకు అభివృద్ధి చెందిన ప్రధాన నాటక ధోరణి. దీని లక్ష్యం వేదికపై జీవితం యథార్థంగా కనిపించాలి అనే సిద్ధాంతం. కథా నిర్మాణం, సంభాషణలు, వేదిక అమరిక, పాత్రల ప్రవర్తన నిజ జీవితానికి దగ్గరగా ఉండే విధంగా నియమాలు ఏర్పడ్డాయి. మధ్యతరగతి కుటుంబ జీవితం, సాధారణ సంభాషణ భాష, అలంకార రహిత వేదిక రూపకల్పన ఈ శైలికి లక్షణాలు. వాస్తవికత, సహజవాదం మధ్య సారూప్యత ఉన్నప్పటికీ, ముఖ్యమైన తేడా పాత్రల స్వేచ్ఛ విషయంలో ఉంటుంది. సహజవాదం ప్రకారం వ్యక్తి జీవితాన్ని ప్రధానంగా వారసత్వం, ఆర్థిక పరిస్థితులు వంటి బాహ్య శక్తులు నిర్ణయిస్తాయి. వాస్తవికత మాత్రం వ్యక్తిగత నిర్ణయశక్తికి ప్రాధాన్యం ఇస్తుంది. ఈ భావనను స్పష్టంగా చూపించిన నాటకాలకు, హెన్రిక్ ఇబ్సెన్ రచించిన 'ఏ డాల్ హౌస్' ప్రముఖ ఉదాహరణ. రియలిజం ఒక ఉద్యమంగా ప్రారంభమైన కాల పరిమితి సుమారు 1820 నుండి 1920 వరకు విస్తరించింది. రియలిజం అనేక విధాలుగా రొమాంటిసిజాన్ని తిరస్కరించినప్పటికీ, విలియమ్ వర్డ్స్‌వర్త్ గతంలో వ్యక్తం చేసిన పారిశ్రామిక విప్లవంపై ఉన్న ఆందోళనలను ఇది మరో కోణంలో పరిష్కరించింది. కాలక్రమేణా పారిశ్రామికీకరణ లోపాలను గుర్తించిన రచయితల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా కాలుష్యం, జీవన నాణ్యత క్షీణత వంటి అంశాల్లో. బ్రిటిష్ విక్టోరియన్ కాలం (1837–1901) రొమాంటిసిజం నుండి రియలిజానికి క్రమంగా మార్పును చూసింది. లార్డ్ టెన్నిసన్, రాబర్ట్ బ్రౌనింగ్ వంటి కవులు ఈ పరివర్తన దశకు ప్రతినిధులు. వారు రొమాంటిక్ సంప్రదాయం నుండి వచ్చినప్పటికీ, తమ రచనల్లో వాస్తవిక దృక్కోణాన్ని స్పష్టంగా వ్యక్తపరచారు. సాహిత్య ఉద్యమాలు ఖచ్చితమైన గడువులతో నిలిచిపోవని, అవి కాలానుగుణంగా మారుతూ పునర్వ్యాఖ్యానించబడతాయని గుర్తుంచుకోవాలి. చార్లెస్ బొడ్లేర్ తన 'ది ఫ్లవర్స్ ఆఫ్ ఈవిల్' (1857) రచించినప్పుడు గుస్తావ్ ఫ్లోబేర్ అతన్ని రొమాంటిక్ కవిగా అభివర్ణించాడు. అయితే, ఆధునిక పండితులు బొడ్లేర్‌ను వాస్తవికతకు చెందినవాడిగా పరిగణించి, ఆధునికవాదానికి ఆద్యుడిగా చూశారు. అప్పటి వరకూ సాహిత్యానికి మారు పేరుగా మారిన 'రొమాంటిసిజం' క్రమంగా కనుమరుగైంది. ప్రపంచాన్ని ఉన్నట్టుగా అర్థం చేసుకోవాలనే లక్ష్యంతో వచ్చిన రచనలు పాఠకులను ఆకట్టుకున్నాయి. మరోవిధంగా చెప్పాలంటే, 'రొమాంటిసిజం'ను 'రియలిజం' భర్తీ చేసింది. అయితే, వాస్తవికతను సంపూర్ణంగా ఒక కవిత, నాటకం, కథ లేదా నవలలో ప్రతిబింబించడం సులభం కాదు. ప్రారంభ వాస్తవికవాదులు మధ్యతరగతి, దిగువ తరగతి పాత్రలను ప్రధానంగా చిత్రించారు. ఇవి పూర్వ సాహిత్యంలో ప్రధాన అంశాలుగా ఎక్కువగా కనిపించలేదు. యూరప్‌లో ఇబ్సెన్ వంటి రచయితలు మధ్యతరగతి జీవనానికి నాటకాల్లో ప్రాధాన్యం ఇచ్చారు. హెన్రీ జేమ్స్ వంటి రచయితలు సాధారణ సంఘటనలను మాత్రమే చిత్రించడంపై విమర్శలు ఎదుర్కొన్నారు, ఎందుకంటే, అవి రొమాంటిక్ రచనలలో కనిపించేలా అతిశయోక్తి నాటకీయతను కలిగించవు. కొన్నిసార్లు వాస్తవికతను సాధించాలనే ప్రయత్నంలో రచనలు మానవ జీవితంలోని ప్రతికూలాంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాయి, సానుకూలతను పూర్తిగా పక్కన నెట్టాయి. ఈ క్రమంలోనే, భావోద్వేగం, అంతర్దృష్టిపై ఆధారపడిన రొమాంటిసిజానికి భిన్నంగా, రియలిజం ప్రత్యక్షమైన, సూటిగా ఉండే భాషను ఉపయోగించి నిర్దిష్ట సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించింది. అమెరికన్ వాస్తవికతలో మార్క్ ట్వెయిన్ మాండలిక భాష వినియోగం దీనికి మంచి ఉదాహరణ. ఆయన రచించిన 'అడ్వెంచర్స్ ఆఫ్ హకిల్‌బెర్రీ ఫిన్' (1884)లో సాధారణ దైనందిన భాష, యాసలను వినియోగించడం వాస్తవికతను బలపరుస్తుంది. ఈ నవలలో హక్ అనే పేద తెల్ల బాలుడు, పారిపోయిన బానిస జిమ్ మధ్య అభివృద్ధి చెందే స్నేహం వాస్తవికంగా ఆవిష్కృతమైంది. వాస్తవికత మరో ముఖ్య లక్షణం మానవ మనస్తత్వాన్ని లోతుగా పరిశీలించడం. రాబర్ట్ బ్రౌనింగ్ తన నాటకీయ ఏకపాత్రాభినయాల్లో నార్సిసిస్టులు, హంతకులు, మానసిక రోగుల మనోవైఖరిని పరిశీలించాడు. ఫ్యోడర్ దోస్తోయెవ్‌స్కీ రచనలు పాత్రల అంతర్ముఖ ప్రపంచాన్ని విపులంగా ఆవిష్కరించాయి. ఆయన 'నోట్స్ ఫ్రమ్ అండర్‌గ్రౌండ్' (1864)లో వాస్తవికతను ఉపయోగించి రొమాంటిసిజం ఆకర్షణ, ప్రమాదాలను విశ్లేషించాడు. ఈ రచనలో ప్రధాన పాత్ర తన ప్రవర్తనను మాత్రమే కాకుండా పాఠకుని స్వభావాన్నీ ప్రశ్నిస్తుంది. ఇది బొడ్లేర్ తన రచనలో ఉపయోగించిన వ్యూహానికి సమానమైనది. సాధారణంగా వాస్తవికత సమాజ సమస్యలను గుర్తించి చూపిస్తుంది. కానీ, వాటికి పరిష్కారాలను నిర్దేశించదు. సహజవాదం అనే ఉపశాఖ మాత్రం ప్రపంచాన్ని మార్చాలనే లక్ష్యంతో ముందుకు సాగింది. ఇది ముఖ్యంగా పేద వర్గాల జీవన పరిస్థితులను కేంద్రీకరిస్తుంది. సహజవాదం జీవితంలోని ప్రతికూలాంశాలను ఎక్కువగా చూపుతుందని విమర్శలు వచ్చాయి. ఎమిల్ జోలా రచించిన 'జెర్మినల్' (1885) సహజవాదానికి ప్రముఖ ఉదాహరణ. ఇందులో బొగ్గు గని కార్మికుల జీవితం, సమ్మెలు తీవ్ర వాస్తవికతతో కళ్లముందు కదలడతాయి. ఆయన రచనా శైలి భావోద్వేగరహితంగా, జర్నలిజం పద్ధతిని పోలి ఉంటుంది. ఈ విధానం అటు సంప్రదాయవాదులను, ఇటు సామ్యవాదులను కూడా అసంతృప్తికి గురిచేసింది. ఏన్నో మార్పులు, చేర్పుల తర్వాత, వాస్తవికత, సహజవాదం మధ్య సరిహద్దులు కలిసిపోయి, ఆధునికవాదం అనే కొత్త సాహిత్య దిశకు మార్గం సుగమమైంది. ఆధునికవాదం తనను తాను వాస్తవికత కంటే మరింత లోతైన వాస్తవాన్ని ప్రతిబింబించేదిగా భావించింది. కళాకారిణి జార్జియా ఓకీఫ్ అభిప్రాయం ప్రకారం, వాస్తవికత కంటే తక్కువ వాస్తవికమైనది మరొకటి లేదు. అందువల్ల వియుక్త కళ ద్వారా మరింత సమగ్ర సత్యాన్ని అందుకోవాలనే ప్రయత్నం జరిగింది. మొత్తం మీద వాస్తవికతను సాహిత్య, కళా రూపాల్లో ప్రతిబింబించడం ద్వారా సాహిత్యం ఒక రకంగా స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. అప్పటి వరకూ ఉన్న 'రొమాంటిసిజం' సంకెళ్లు తెంపుకొని, నిజాన్ని నిజంలా చూడడం... చూపిచడం మొదలైంది. ఆధునిక ప్రగతిశీల, ప్రజా రచనలకు పునాదులు వేసింది.

**– సత్యశ్రీ**

## సామాజిక – రాజకీయ అంశాలపై లోతైన అధ్యయనం..




'ఎ కనెక్టికట్ యాంకీ ఇన్ కింగ్ ఆర్థర్స్ కోర్ట్' అనేది అమెరికన్ హాస్య రచయిత మార్క్ ట్వెయిన్ 1889లో రచించిన ప్రఖ్యాత చారిత్రక వ్యంగ్య నవల. ఇది ఆర్థర్ రాజు కాలాన్ని నేపథ్యంగా తీసుకున్న వినోదాత్మక కథ. అయితే, ఇది సామంతవ్యవస్థ, రాజ్యాధికారం, మతాధిపత్యం, పరిశ్రమీకరణ, ప్రజాస్వామ్య విలువలు వంటి విస్తృత సామాజికరాజకీయ అంశాలపై లోతైన వ్యంగ్య విమర్శగా కూడా మన్ననలు అందుకుంది. సమకాలీన అమెరికా సమాజాన్ని కూడా పరోక్షంగా ప్రశ్నించే గ్రంథంగా ఇది నిలుస్తుంది. సమయయానం (టైమ్ ట్రావెల్) అనే శాస్త్రీయ కల్పిత ప్రక్రియకు ప్రారంభ దశలో దిశానిర్దేశం చేసిన రచనగా కూడా దీనికి ప్రత్యేక స్థానం ఉంది. కథా నిర్మాణ పరంగా ఈ నవల ఒక ఫ్రేమ్ నారేటివ్ పద్ధతిని అనుసరిస్తుంది. 19వ శతాబ్దానికి చెందిన ఒక వక్త (రచయిత స్వరూపానికి సమీపమైన వ్యక్తి) వార్విక్ కోటలో ఒక వింత అతిథిని కలుస్తాడు. అతనే హాంక్ మోర్గన్ అనే కనెక్టికట్ యాంకీ. హాంక్ తలపై గాయమై అపస్మారక స్థితిలో పడిపోయిన తర్వాత, అకస్మాత్తుగా ఆరు శతాబ్దాల వెనక్కి, అంటే, రాజు ఆర్థర్ పాలనలోని ఇంగ్లాండ్‌కు, తరలిపోతాడు. ఆధునిక పరిశ్రమలలో నిపుణుడైన అతను మధ్యయుగ ప్రపంచంలో అత్యంత జ్ఞానవంతుడిగా మారిపోతాడు. ఈ విరుద్ధ స్థితి నుంచే నవల వ్యంగ్య బలం ఉద్భవిస్తుంది. హాంక్ ప్రారంభంలో సర్ కే చేతిలో బందీ అవుతాడు. రాజదర్బారులు అందూ అతన్ని విచిత్ర వేషధారణతో ఎగతాళి చేస్తారు. అక్కడ మెర్లిన్ అనే మాంత్రికుడు అతని ప్రధాన ప్రత్యర్థి. అయితే, సూర్యగ్రహణం అనే ఒకానొక ఖగోళ సంఘటన సమయాన్ని ముందుగానే తెలుసుకున్న హాంక్, తనను శిక్షించబోతున్న వేళ సూర్యుణ్ని ఆర్పివేస్తాను అని బెదిరిస్తాడు. గ్రహణం సంభవించగానే అత ను దాన్ని తన మాయశక్తిగా ప్రచారం చేసుకుని రాజుకు విశ్వాసపాత్రుడవుతాడు. ఈ ఘట్టం ద్వారా ట్వెయిన్ అంధవిశ్వాసాన్ని, విజ్ఞానహీనతను తీవ్రంగా విమర్శిస్తాడు. నవలలో ట్వెయిన్ విస్తృతంగా లెమోర్టె డిఆర్థర్ నుంచి భాటగాలను ఉటంకించాడు. మధ్యయుగ భాషా శైలి, రొమాంటిక్ శౌర్యకథనాల్ని ప్రత్యక్షంగా ఉపయోగించి వాటిని వ్యంగ్యాత్మకంగా విఘటించడం ఆయన లక్ష్యం. ముఖ్యంగా సర్ వాల్టర్ స్కా ట్ ప్రభావంతో పాశ్చాత్య ప్రపంచంలో ఏర్పడిన చివల్రీ మహిమ భావనను ట్వెయిన్ తీవ్రంగా ప్రశ్నిస్తాడు. యుద్ధాన్ని, రాజరికాన్ని, సామంతశ్రేణి అహంకారాన్ని సాహిత్యం గొప్పగా చూపించడం సమాజానికి ప్రమాదకరమని ఆయన భావించాడు. హాంక్ రాజ్యంలో ప్రధాన మంత్రిగా ఎదిగిన తరువాత తన జ్ఞానాన్ని ఉపయోగించి దేశాన్ని ఆధునీకరించేందుకు ప్రయత్నిస్తాడు. రహస్యంగా గన్‌పౌడర్ తయారీ, విద్యుత్ తీగలు, టెలిఫోన్ వ్యవస్థలు, పాఠశాలలు, ఫ్యాక్టరీలు స్థాపిస్తాడు. యువతరానికి ఆధునిక ఇంగ్లీషు, విజ్ఞానశాస్త్ర బోధన ప్రారంభిస్తాడు. ప్రజాస్వామ్య భావజాలాన్ని నాటాలని యత్నిస్తాడు. అయితే ఈ ఆధునీకరణ ప్రజల సంక్షేమానికా లేక హాంక్ స్వీయ అహంకారానికా? అనే ప్రశ్నను నవల సూటిగా లేవనెత్తుతుంది. సామంతవ్యవస్థలో రైతుల దుస్థితిని ప్రత్యక్షంగా చూసినప్పుడు రాజు ఆర్థర్ కొంత నిరాశ చెందుతాడు. అయినప్పటికీ వ్యవస్థాత్మక మా ర్పు సాధ్యమవుతుందా అనే సందేహం మిగులుతుంది. బానిసత్వం, శిక్షల క్రూరత్వం, చర్చి ఆధిపత్యం వంటి అంశాలన్నీ ట్వెయిన్ దృష్టిలో సామాజిక దుర్వ్యవస్థలుగా నిలుస్తాయి. చర్చి విధించిన ఇంటర్డిక్ట్ ద్వారా మతాధికారులు రాజకీయ అధికారాన్ని ఎలా నియంత్రిస్తారో నవల స్పష్టంగా చూపిస్తుంది. చివరి భాగం అత్యంత విషాదకరమైనది. హాంక్ 52 మంది యువకులతో కలిసి మెర్లిన్ గుహలో తలదాచుకుని ఆధునిక ఆయుధాలతో 30,000 మంది రాణులను సంహరిస్తాడు. గాట్లింగ్ గన్స్, విద్యుత్ తీగలు మధ్యయుగ వీరత్వాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తా యి. కానీ విజయానంతరం దుర్వాసన, వ్యాధి, మానవ శవాల మధ్య చి క్కుకుపోయిన హాంక్ బృందం క్షీణిస్తుంది. శాపమో లేక విద్యుదాఘాతమో తెలియదుగానీ మెర్లిన్ మరణిస్తాడు. హాంక్ 1,300 సంవత్సరాల నిద్రలోకి జారిపోతాడు. ఈ అపోకలిప్టిక్ ముగింపు ట్వెయిన్ భావజాలంలో పెరుగుతున్న నిరాశావాదాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ రచనలో ట్వె యిన్ ప్రజాస్వామ్యాన్ని ప్రశంసించినప్పటికీ, పరిశ్రమీకరణ ఫలితాలపై ద్వంద్వ దృష్టిని చూపాడు. మూలధన వాద లాభదాహం, యంత్రాల ఆధిపత్యం, శాస్త్రీయ పురోగతి తదితర ఇవి సమానత్వాన్ని తేవగలవా? లేక కొత్త అసమానతలకు దారితీయగలవా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవవుతాయి. ఫ్రెంచ్ విప్లవాన్ని ఆయన సమర్థించిన దృష్టి కూడా ఇక్కడ ప్రతిఫలిస్తుంది. రాజరిక దమనంతో పోలిస్తే విప్లవ హింస తక్కువ దుష్పరిణామమని ఆయన భావించాడు. సైన్స్ ఫిక్షన్ దృష్టిలో ఈ నవల ప్రాధా న్యం అపారం. ఆధునిక మనిషి అకస్మాత్తుగా గతంలోకి వెళ్లి అక్కడ తన జ్ఞానంతో సమాజాన్ని మార్చే కథా నమూనా తరువాత అనేక రచనలకు మూలాధారమైంది. హెచ్‌జి వేల్స్ రచించిన 'ది టైమ్ మెషిన్' వంటి నవలలతో పోలిస్తే, ట్వెయిన్ యాంత్రిక కాల యంత్రం కాకుండా అజ్ఞాత శక్తి ద్వారా కాలయానం చూపించాడు. ఈ విధానం తరువాతి అనేక రచనల్లో పునరావృతమైంది. సాహిత్య పరంగా ఈ నవలలో హా స్యం, వ్యం గ్యం, తాత్విక చింతన, భావోద్వేగ తీవ్రత ఒకదానితో ఒకటి ముడిబడి కనిపిస్తాయి. ముఖ్యంగా చివరి అధ్యాయాల్లో హాంక్ తన భార్య సాండీ, శిశువు హాలోసెంట్రల్ పట్ల చూపే ప్రేమ, వేదన రచయిత వ్యక్తిగత అనుభవాలతో అనుసంధానమై కనిపిస్తుంది. కుటుంబం, కాలం, మానవ సంబంధాల విలువలను రచయిత ఆవిష్కరించిన తీరు రాజకీయ విమర్శకంటే, మరింత లోతుగా మనసుల్ని కుదిపేస్తాయి. అందుకే, 'ఎ కనెక్టికట్ యాంకీ ఇన్ కింగ్ ఆర్థర్స్ కోర్ట్'ను ఒక సంపూర్ణ రచనగా పేర్కొంటారు. ఇది మధ్యయుగ శౌర్యకల్పనపై వ్యంగ్యమైతే, సమకాలీన అమెరికన్ అహంకారంపై కూడా విమర్శ కూడా. ప్రజాస్వామ్య వి శ్వాసాన్ని ప్రతిపాదిస్తూ, శాస్త్రీయ పురోగతి పరిమితులను గుర్తుచేసే రచ న. కాలయానం అనే కల్పిత యంత్రాంగాన్ని ఉపయోగించి సమాజాన్ని అద్దంలో చూపించిన ఈ నవల. హాస్యపు పూతలో తీవ్రమైన సామాజికరాజకీయ ప్రశ్నలను దాచిన శక్తివంతమైన కృతి.



## మేధకు పునాది పుస్తకం..

(ఏప్రిల్ 23 ప్రపంచ పుస్తక పఠన దినోత్సవం)



మేధస్సుకు పునాది వేయాలంటే జ్ఞానం అవసరం. జ్ఞానానికి స్థిరమైన వనరు పుస్తకం. మానవ నాగరికత ప్రారంభ దశల్లో శిలాఫలకాలు, తాళపత్రాలు, చర్మపత్రాలు వంటి మార్గాల ద్వారా జ్ఞానం తరతరాలకు సంక్రమించింది. అనంతరం కాగితం రూపంలో పుస్తకాలు ఏర్పడి విజ్ఞాన ప్రసారానికి ప్రధాన సాధనమయ్యాయి. డిజిటల్ యుగంలో సమాచార ప్రసారం వేగవంతమై, సామాజిక మాధ్యమాలు, వీడియో వేదికలు, తక్షణ సందేశాల యాప్‌లు విస్తరించినప్పటికీ, పుస్తకానికి ఉన్న స్థిరమైన విలువను అవి భర్తీ చేయలేవు. ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక పఠనం ప్రాధాన్యాన్ని పునర్విమర్శించడం సముచితం. పుస్తకం ఏకాగ్రతను పెంపొందించే సాధనం. ఒక అంశాన్ని లోతుగా అర్థం చేసుకోవాలంటే నిరంతర దృష్టి అవసరం. డిజిటల్ వేదికలలో అలవాటు అయిన వేగవంతమైన స్క్రోలింగ్, చిన్న వీడియోల వీక్షణ మనలో అసహనాన్ని పెంచుతుంది. ముఖ్యంగా యువతలో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఒక విషయం మీద ఎక్కువసేపు దృష్టి కేంద్రీకరించలేని పరిస్థితి ఏర్పడుతోంది. పుస్తక పఠనం దీనికి విరుద్ధం. ప్రతి పేజీని చదివి, అర్థం చేసుకొని, ఆలోచించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ సహనాన్ని పెంచి, మెదడు సామర్థ్యాన్ని పదును పెడుతుంది. దీర్ఘకాలిక దృష్టి సామర్థ్యం విద్యా, వృత్తి, పరిశోధనా రంగాల్లో కీలక పాత్ర పోషిస్తుంది. భాషాపరమైన ప్రావీణ్యం కూడా పుస్తకాల ద్వారా అభివృద్ధి చెందుతుంది. నేటి సంభాషణలో మాతృభాష పదాల స్థానంలో మిశ్రమ భాష విస్తరిస్తోంది. ఇతర భాషలను నేర్చుకోవడం అవసరమే.. అయితే మాతృభాషపై పట్టు కోల్పోవడం అనర్థకరం. పుస్తక పఠనం పదసంపదను విస్తరిస్తుంది, వాక్య నిర్మాణంపై అవగాహన పెంచుతుంది, భావవ్యక్తీకరణను సమర్థవంతంగా చేస్తుంది. మంచి రచనలు చదవడం వల్ల రచనా శైలి మెరుగుపడుతుంది; సంభాషణలో స్పష్టత పెరుగుతుంది. భాష మన ఆలోచనల రూపకల్పనకు ఆధారం. కాబట్టి పఠనం ద్వారా భాషను మెరుగుపరచడం అంటే ఆలోచనలను మెరుగుపరచడమే. పుస్తకాలు ప్రాపంచిక అవగాహనను విస్తరింపజేస్తాయి. ఒక రచయిత తన జీవితంలో అనుభవించిన సంఘటనలు, పరిశీలించిన వాస్తవాలు, సాధించిన విజ్ఞానం పుస్తకాల ద్వారా వివరిస్తాడు. అంతటి అపారమైనఅనుభవాన్ని పాఠకుడు కొద్ది గంటల్లోనే ఆ అనుభవాన్ని స్వీకరించగలడు. చరిత్ర, ఆర్థిక వ్యవస్థ, సమాజ శాస్త్రం, రాజకీయ పరిణామాలు, నాగరికతల వికాసంఇవన్నీ పుస్తకాల ద్వారా స్పష్టమవుతాయి. వివిధ దేశాలు, సంస్కృతులు, భావజాలాలపై అవగాహన పెరగడం మేధో పరిమాణాన్ని విస్తరింపజేస్తుంది. విభిన్న దృక్కోణాలు తెలుసుకోవడం విమర్శనాత్మక ఆలోచనకు దారి తీస్తుంది. స్ఫూర్తి, ప్రేరణ అంశాల్లో కూడా పుస్తకాలు కీలకమైనవి. జీవితంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్న వ్యక్తుల జీవితచరిత్రలు మనకు ధైర్యం నూరిపోతాయి. విజయం వెనుక ఉన్న క్రమశిక్షణ, పట్టుదల, విఫలతలతో పోరాటం వంటి అంశాలు పాఠకునికి మార్గదర్శకత్వం ఇస్తాయి. స్వీయాభివృద్ధి గ్రంథాలు సమస్యలను విశ్లేషించి, పరిష్కార మార్గాలను సూచిస్తాయి. ఈ ప్రక్రియ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. మానసిక ఆరోగ్య పరిరక్షణలో కూడా పఠనం ప్రయోజనకరం. దైనందిన జీవిత ఒత్తిడులు సహజం. నిరంతర డిజిటల్ వినోదం మెదడును అలసటకు గురిచేస్తుంది. పుస్తక పఠనం ఒత్తిడిని తగ్గించే శాస్త్రీయంగా నిర్ధారిత పద్ధతి. హృదయ స్పందన వేగం, రక్తపోటు తగ్గడానికి సహకరిస్తుంది. ముఖ్యంగా నిద్రకు ముందు పుస్తకం చదవడం శరీరానికి విశ్రాంతి సంకేతాన్ని ఇస్తుంది. స్క్రీన్ వెలుతురు లేకపోవడం వల్ల నిద్రలేమి సమస్యలు తగ్గుతాయి. పిల్లలలో చదివే అలవాటు పెంపొందించడంలో పెద్దల పాత్ర కీలకం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పుస్తక పఠనాన్ని ఆచరణలో చూపితే పిల్లలు అనుసరిస్తారు. ఒక మంచి పుస్తకాన్ని పూర్తిచేయడం ద్వారా వారిలో సాధన భావం పెరుగుతుంది. ఇది దీర్ఘకాలిక విద్యా విజయానికి పునాది అవుతుంది. నేటి విజయవంతమైన అనేక సినిమాలు, వెబ్‌సిరీస్‌లు గతంలో వచ్చిన నవలల ఆధారంగా రూపొందినవే. మూలకథను పుస్తకరూపంలో చదవడం లోతైన అనుభూతిని ఇస్తుంది. పఠనం ద్వారా ఎంపథీఅనుభూతి సామర్థ్యంవృద్ధి చెందుతుంది. రచయిత దృక్కోణం నుంచి ప్రపంచాన్ని చూడడం వల్ల ఇతరుల భావోద్వేగాలను అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఇది వ్యక్తిగత సంబంధాలను మెరుగుపరుస్తుంది. సమాజంలో సహానుభూతి, పరస్పర గౌరవం పెరగడానికి ఇది దోహదం చేస్తుంది. మేధస్సును చురుకుగా ఉంచడంలో పుస్తక పఠనం కీలక పాత్ర పోషిస్తుంది. నిరంతర మానసిక వ్యాయామం అల్జీమర్స్, డిమెన్షియా వంటి వృద్ధాప్య సంబంధిత సమస్యలను ఆలస్యంగా ఎదుర్కొనేలా చేస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. కొత్త విషయాలు నేర్చుకోవడం మెదడు నాడీజాలాలను చురుకుగా ఉంచుతుంది. ఒంటరితనాన్ని అధిగమించడంలో కూడా పుస్తకాలు తోడ్పడతాయి. పాఠకుడు కథా పాత్రలతో మానసిక అనుబంధం ఏర్పరచుకుంటాడు. ఇది భావోద్వేగ సహాయాన్ని అందిస్తుంది. నిరుత్సాహం, నిరాశ వంటి భావాల నుంచి బయటపడటానికి పఠనం ఉపకరిస్తుంది. సారాంశంగా, పుస్తకం కేవలం సమాచార సాధనం కాదు... అది మేధస్సు వికాసానికి పునాది. ఏకాగ్రత, భాషా నైపుణ్యం, ఆలోచనా శక్తి, భావోద్వేగ స్థిరత్వం, ప్రేరణఈ అన్ని అంశాల అభివృద్ధికి పుస్తక పఠనం కీలకం. ఇప్పటికే చదివే అలవాటు ఉన్నవారు దాన్ని కొనసాగించాలి; ఇంకా ప్రారంభించని వారు ఇప్పుడు మొదలుపెడితే, దీర్ఘకాలంలో మానసిక మరియు మేధో ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తాయి. పుస్తకం మనసుకు దిక్సూచి, మేధస్సుకు బలమైన పునాది.

## ఈ వారం కవితలు

### ఇది రాజాశ్రమం

ఆశ్రమం, ఆశ్రమం. ఇది రాజాశ్రమం, మా ఈ రాజేశ్వరం,
ఆశ్రమం, ఆశ్రమం. ఇది రాజాశ్రమం, మా ఈ రాజేశ్వరం,

పచ్చ, పచ్చని మొక్కలతో, కడు చక్కని ప్రాంగణంలో
విభాసిల్లే, హరితేశ్వరం మా ఈ రాజేశ్వరం

ప్రియముతో అమ్మా, అమ్మా అని పలకరించే
యువ నేస్తాలతో శోభిల్లే, సేవాశ్రమం మా ఈ రాజేశ్వరం

కమ్మనైన అన్న, పరమాన్నములతో, ఆర్తిని తీర్చి,
ఆదరించే, పరమేశ్వరం మా ఈ రాజేశ్వరం.

తోడు వచ్చిన ఎందరో సోదర సోదరీమణుల
ప్రేమతో పరిమళించే ప్రేమేశ్వరం మా రాజేశ్వరం.

ఆటపాటలతో, కథాకాలక్షేపములతో, విందు వినోదాలతో
అలరించే అమరేశ్వరం మా రాజేశ్వరం.

సాటిలేని, మేటి జ్ఞానులెందరో, కవులెందరో
వశించు జ్ఞానేశ్వరం మా రాజేశ్వరం.

అస్వస్థత అయిన వేళ, వైద్య బృంద పర్యవేక్షణతో
అప్రమత్తతతో ఉన్న వైద్యేశ్వరం మా ఈ రాజేశ్వరం.

విభిన్న కళా ప్రదర్శన కార్యక్రమాలను ప్రోత్సహించి,
ఆశ్రయమిచ్చు ఆనందేశ్వరం మా ఈ రాజేశ్వరం.

బహుళార్థ వృత్తి శిక్షణలకు నిలయంగా
భాసిల్లే ఉన్నత రాజాశ్రమం ఈ రాజేశ్వరం.



**– రమాదేవి,**
**సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమ నివాసి**

### పిగిలి పిట్ట

పిగిలి పిట్ట పిగిలి పిట్ట పిగిలి పిట్ట
పిట్టల్లో నీ అందమే అందమంట
ఎత్తైన ప్రాంతం అంటే ఇష్టమంట
నీటి చెంత గూళ్ళు కడతావంట!

పిట్ట కొంచెం
కూత ఘనమంట
నీ పాట వింటే
మనుసు కెంతో ఆనందమంట!

అందరినీ ఆకర్షించే
తోక పిగిలి పిట్ట
దేహం చూస్తే పిడికెడంత
తోక మాత్రం బారెడంత !

తోక చూస్తే తెల్లగుంటదంట
మెడ చూస్తేనేమో నల్లగుంటదంట
తలపై చిన్న కొప్పు ఉంటదంట
చూసే వారి మనుసు నింపునంట!

పిగిలి పిట్ట పిగిలి పిట్ట పిగిలి పిట్ట
చిన్నా పెద్దలకు నువ్వు ఇష్టమంట
నిన్ను కాపాడుకొనుట మా బాధ్యతంట
నువ్వు హాయిగా బ్రతుకితే సంతోషమంట!

**– పట్లోళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

### అతని యానం సాగుతున్నది

రెక్కలు కట్టుకున్న కలలతో
రయ్యిరయ్యినా రేగిపోతూ
అవధులన్నీ అడ్డుగోడలై నిలిచినా
ఆకాశాన్నే తన అడుగుజాడగా
మలుచుకుంటూమబ్బులమోముపై
మృదువైన స్పర్శగా తేలుతూ
బరువైన బాధల్ని వదిలేస్తూ
తేలికైన తత్వంగా మారిపోతూ

వెన్నెల వీధుల్లో విహరిస్తూ
విన్నుకే వెన్నుదన్నుగా నిలుస్తూ
నిశీధి నిశ్శబ్దాన్ని చెదరగొట్టుతూ
నిజాల్ని నూతన పుటలకెక్కిస్తూ
నక్షత్రాల్ని ఏరుకుంటూ
నవ్వుల్ని నిండుగా చల్లుతూ
అనంతాకాశంలో ఆశల
అక్షరాలు చల్లుతూ
అమృత క్షణాలను ఆవిష్కరిస్తూ

కవితల గర్భంలో కాలాన్ని
కరిగిస్తూ కూరుస్తూ
స్వేచ్ఛే తనశ్వాసగా మిగిల్చుకొంటూ
సృష్టినే తన సొంతంగా చేసుకుంటూ
స్వేచ్ఛకోసం అతని ప్రయాణం
ఒక కల కాదు, కలల కలబోత కాదు
అది అతని జీవితం
అది అతని మనసు మోక్షం!

**– జి. రాజేంద్రప్రసాద్**

## వరి కోతల సమయంలో విద్యుత్ కోతలు

కేశవరం సబ్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగిన రైతులు



ప్రజాపక్షం/శామీర్‌పేట : వరి పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేశవరం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొంపల్లి భూమేష్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కేశవరంలో సబ్‌స్టేషన్ వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కోతలతో పంట దిగుబడి తగ్గుతుందని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోవడం చాలా బాధాకరమని ఆవేదన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని చెబుతున్న రైతులకు నాణ్యమైన విద్యుత్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారని విద్యుత్ అంతరాయం వలన రైతులు ఇబ్బందులు పడకుండా విద్యుత్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బొమ్మలపల్లి చిత్తారి, కొంపల్లి గోపాల్‌గౌడ్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు గృహ వసతి కల్పించడమే ధ్యేయం



ప్రజాపక్షం/శామీర్‌పేట : నిరుపేదలకు గృహ వసతి కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మేడ్చల్ జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ సింగాయిపల్లిలో నమీనా బేగం, షేక్ ఇమామ్‌లు ప్రభుత్వ సహకారంతో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదవారికి గృహవసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలేష్, జాఫర్, శ్రీనివాస్‌యాదవ్, ధర్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాయికుమార్, మల్లేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ నగర్, రాయన్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/జవహర్ నగర్ : అంబేద్కర్ నగర్ రాయన్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్ నెంబర్: 252/2005) నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు ప్రకటించారు. నూతన కార్యవర్గ వివరాలు నూతన అధ్యక్షుడిగా, కె.ఉప్పలయ్య, ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా, శాగంటి వెంకటేష్, శాధికారిగా దువాసి దుర్గాప్రసాద్, బాధ్యతలు చేపట్టారు. గౌరవ అధ్యక్షులు తూర్పుగొండ రామన్న, ఆర్కే బాబు, వెంకటేష్ గౌడ్, మాదుగుల విజయ్, సలహాదారులు ఎం.ఆనంద్, పి.రమేష్, ఉపాధ్యక్షులు డి.కె.దేవేందర్, జి.రమేష్, సంయుక్త కార్యదర్శులు హరిబాబు, మహంకాళి వెంకటేష్, సంగి పరమేష్, కార్యవర్గ సభ్యులు: రామచందర్, అంజయ్య, జాన్, దుర్గేష్, రాజ్ కుమార్, సిహెచ్ రాములు, కుమార్ గౌడ్, నాగరాజు గౌడ్, రామస్వామి, రాజు, శీను, కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కె. ఉప్పలయ్య మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు, డ్రైనేజీ మరియు తాగునీటి సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. కాలనీ వాసులందరినీ సమన్వయం చేసుకుంటూ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతామని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు కాలనీ వాసులు అభినందనలు తెలియజేశారు.

## రాజకీయాలకతీతంగా మహిళా బిల్లును ఆమోదించాలి



ప్రజాపక్షం/బోడుప్పల్ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 374వ ఆదివారం జ్ఞాన మాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేసిన మహనీయుడని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచినట్లు మహిళలకు తప్పనిసరిగా 33 రిజర్వేషన్ కల్పించాలన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ సారాధ్యంలో బిజెపి ప్రభుత్వం మహిళా బిల్లును ప్రవేశపెట్టడం హర్షించదగ్గ విషయమని, ఇత ర పార్టీలు రాజకీయాలకతీతంగా మహిళా బిల్లుకు మద్దతు తెలిపాలని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాఖ్యాత గాయకుడు తమ్మెర వెంకట్, ఉద్యమకారుడు బర్ల ఆంజనేయులు ముదిరాజ్, చిల్ల అంజయ్య, సాయి బండారి, ఏసు రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాలు తొలగించిన చోటే ప్రతిష్టించాలి

ప్రజాపక్షం/చర్లపల్లి : మహనీయుల విగ్రహాలను తొలగించడం అన్యాయమని, సమాజానికి అవమానమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో డాక్టర్ అంబేద్కర్,జ్యోతిబాపూలే,జగ్జీవన్‌రామ్ విగ్రహాలను తొలగించిన ప్రదేశంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.విగ్రహాలను తొలగించడం తీవ్ర ఆందోళనకు గురిచేసిందని ఎమ్మెల్యే అన్నారు. వెంటనే విగ్రహాలను తొలగించిన చోటే పునః ప్రతిష్టించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్‌గౌడ్,గిరిబాబు,ఎస్ శ్రీనివాస్‌రెడ్డి,జె ప్రభాకర్‌రెడ్డి,కె బాబు, నర్సింహా,డి లక్ష్మయ్య, బి బిక్షపతి,కడియాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## అనుమతులు, ఫైర్ సేఫ్టీ నిల్..

# అక్రమ ఫర్నీచర్ షెడ్లు ఫుల్..



● ప్రధాన రహదారి పొడవునా అక్రమంగా వెలసిన ఫర్నీచర్ షెడ్లు ● ప్రగతినగర్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించినా మారని భూ యజమానులు ● యథేచ్ఛగా షెడ్లలోనే ఫర్నీచర్ దుకాణాల నిర్వహణ ● ప్రమాదం జరిగిన చోటే మళ్లీ షెడ్ల నిర్మాణానికి యత్నాలు ● అనుమతులు, సేఫ్టీ లేకపోతే చర్యలు తప్పవు ● హెచ్చరించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్

ప్రజాపక్షం/ నిజాంపేట్ : అనుమతులు ఉండవు.. సేఫ్టీ ఉండదు.. ప్రధాన రహదారిలో అక్రమంగా షెడ్లను ఏర్పాటు చేసుకుని ఫర్నీచర్ దుకాణాల వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. భారీ అగ్ని ప్రమాదాలు జరిగినా అవేవి పట్టనట్లుగా వ్యాపారాన్ని సాఫీగా సాగిస్తుండడం ఇక్కడ పరిపాటి. ఇది మరెక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పప్పులో కాలు వేసినట్లే. ఇది ఎక్కడో కాదు నగర శివారు ప్రాంతంలోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ జోన్, నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ఈ దందా సాగుతుంది. సర్కిల్ పరిధిలోని ప్రగతినగర్ కమాన్ ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో అక్రమంగా భారీ షెడ్లను వేసుకుని ఫర్నీచర్ దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహిస్తుంటారు. మేడ్చల్ నుండి గండిమైసమ్మ మీదుగా బాచుపల్లి, మియాపూర్ వరకు వెళ్లే ప్రధాన రహదారిలో ఈ ఫర్నీచర్ దుకాణాల వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ప్రగతినగర్ కమాన్ ప్రక్కనే గల కేజీఆర్ కన్వెన్షన్ హాల్‌కి ఆనుకుని సుమారు ఇరవైకి పైగా అక్రమ షెడ్లలో ఫర్నీచర్ దుకాణాల వ్యాపారం సాగిస్తున్నారు. ఇది చూసి మరికొందరు కైసర్‌నగర్‌కి వెళ్లే చౌరస్తాలో సైతం అక్రమంగా షెడ్లను వేసుకుని ఫర్నీచర్ దుకాణాలను నడుపుతున్నారు. ఈ షెడ్లకు సర్కిల్ నుండి ఎలాంటి అనుమతు లు ఉండవు. ఫర్నీచర్ దుకాణాల్లోనే ఉంటూ వ్యాపారాన్ని సాగిస్తుండడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. ఇటీవల మార్చి 4వ తేదీన భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఏకంగా ఇరవైకి పైగా దుకాణాలు దగ్ధమయ్యా యి. ఈ ఘటనలో భారీ స్థాయిలో ఆస్తి నష్టం జరిగింది. కాని ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారు లు, నిర్వాహకులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ప్రమా దం సంభవించిన చోటే మళ్లీ వ్యాపారాన్ని నిర్వహించేందుకు షెడ్లను నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అయితే భారీ స్థాయి లో అగ్నిప్రమాదం సంభవించి ఆస్థి నష్టం జరిగినా అధికారులు ఈ అక్రమ షెడ్లపై ఎందుకు చర్యలు తీసుకోవ డం లేదని పలువురు నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారిలో ఇంత పెద్ద ఎత్తున వ్యాపారాలను సాగిస్తుంటే కనీస అనుమతులు, వ్యాపార పన్నులైనా ప్రభుత్వానికి చెల్లించాలి కదా ఎందుకు అధికారులు వీటిపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరో సంఘట న పునరావృతం కాకముందే అక్రమంగా వెలుస్తున్న షెడ్లకు, ఈ ఫర్నీచర్ దుకాణాలకు కనీస అనుమతులు, జాగ్రత్త ప్రమాణాలు పాటించేలా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



### ఖాళీ స్థలంలో అక్రమ షెడ్లు.. ఫర్నీచర్ దుకాణాల వ్యాపారం..

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ జోన్, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతినగర్ కమాన్ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను కొందరు వ్యక్తులు లీజుకు ఇవ్వడం అందులో యథేచ్ఛగా అక్రమ షెడ్లను వేసుకుని వ్యాపారాలను సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. భూ యజమానికి లక్షల్లో కిరాయిలు ఇస్తే చాలు ఎలాంటి అనుమతులు, ప్రభుత్వానికి పన్నులు కట్టకున్నా, సేఫ్టీ ప్రమాణా లు పాటించకు న్నా వ్యాపారాలను సాగించుకోవచ్చు. ఉ న్నతాధికారులు అక్రమంగా వెలుస్తున్న షెడ్లను ఎందుకు అనుమతులు జారీ చేయడం లేరని, పన్నులను ఎందుకు విధించడం లేరని ప్రశ్నిస్తున్నారు. లేదంటే అక్రమంగా వెలుస్తున్న షెడ్లపై కఠిన చర్యలు తీసుకోకపోవడంలో అసలు కారణమేమిటని పలువురు నిలదీస్తున్నారు. ప్రమాదాలు జరిగినా అధికారుల్లో ఎందుకు చలనం రావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాచుపల్లి, ప్రగతినగర్, బౌరంపేట్, గండిమైసమ్మలలో వెలుస్తున్న అక్రమ షెడ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### అనుమతులు, ఫైర్ సేఫ్టీ తప్పనిసరిగా తీసుకోవాలి



అనుమతులు లేకుండా, జాగ్రత్త ప్రమాణాలు పాటించకుండా షెడ్లను నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ లలిత్ కుమార్ హెచ్చరించారు. గండిమైసమ్మ నుండి బాచుపల్లి మీదుగా మియాపూర్ వెళ్లే రహదారిలో వెలుస్తున్న అక్రమ షెడ్లు, దుకాణాలపై జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌ని వివరణ కోరగా ఎలాంటి వ్యాపార సముదాయాలైనా తప్పసరిగా అనుమతులు, ఫైర్ సేఫ్టీని తీసుకోవాలని అన్నారు. కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలో అధికంగా ఇలాంటి వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయని, ఇటీవల అగ్నిప్రమాదాలు సైతం అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వారం, పది రోజుల్లో ఫైర్, టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్, ఇండస్ట్రియల్ విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. తప్పనిసరిగా వ్యాపార సముదాయాలకు ఫైర్ సేఫ్టీతో పాటు అనుమతులు తప్పనిసరిగా తీసుకునేలా చూస్తామని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్
పింకేష్ కుమార్

## ఎంత ఎదిగినా సంస్కృతి, సంప్రదాయాలు మరువద్దు

బిఆర్ఎస్ ఎల్పీ విప్ కెపి వివేకానంద



ప్రజాపక్షం/ నిజాంపేట్ : ఎంత ఎదిగినా సంస్కృతి, సంప్రదాయాలను ఎన్నటికీ మరువరాదని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్ పద్మావతి కన్వెన్షన్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద ఏళ్లను పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సమ్మేళనానికి విచ్చేసిన యోగాధారణ ఫౌండేషన్ వ్యవస్థాకులు, హిందూ ధర్మ ప్రచారకులు బోధన్ శ్రీ ఉదయ్ మహరాజ్ స్వామీజీని వివేక్ కలిసి ఆశీస్సులను పొందారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నేటి యువత ఆధునికతను అందిపుచ్చుకుంటూనే మన సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, తత్వ స్కూల్ ఉపాధ్యాయురాలు హిమ బిందు, జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర కార్యదర్శి మావుదూరి సూర్యనారాయణ మూర్తి, అధ్యక్షులు మినుముల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింత శివరాజ్, కోశాధికారి దొమ్మాట ప్రభాకర్ గౌడ్, సలహాదారులు పగిడి శంకర్, సోమిరెడ్డి, టివి శ్రీను పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల డివిజన్ న్యూ వివేకానంద నగర్‌లో నూతనంగా నిర్మించిన విజయ గణపతి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్యఅతిథిగా విచ్చేసి గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ విజయ గణపతి స్వా మి దయతో చేపట్టే ప్రతి కార్యక్రమంలో విజయాలు చే కూరాలని కోరుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు దాస్ గౌడ్, బుచ్చిరెడ్డి, విశాల్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## పేదవాడి కలలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి




ప్రజాపక్షం/శామీర్‌పేట : పేదవాడి ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపల్‌లో కమఠం స్వప్న అభిషేక్‌రెడ్డిలకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్‌చేసి ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలని కోరారు. ఈ కార్యమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు ముద్దం సుధాకర్‌రెడ్డి, కైర గణేష్, గుర్కల సాయి, మౌనిఖ దినేష్, గాదె వెంకటేష్, ఎఇ సనా షాహీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతాం..

అలియాబాద్ మున్సిపాలిటీలో రానున్న వేసవికాలంలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతామని మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. అలియాబాద్‌లోని 7, 8, 17వ వార్డుల్లో నీటి బోర్లను ఫ్రెషింగ్ చేయించారు. దీంతో ప్రజలకు నీటి ఇక్కట్లు లేకుండా నిరంతరం నీరును సరఫరా చేస్తామని చెప్పారు. అలియాబాద్ మున్సిపల్ నుంచి నిధులు మంజూరు చేసి కొత్తగా బోరు బావులు తవ్విస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, గ్రామస్థులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దప్పిక తీర్చుకోవడానికి చలివేంద్రాలు ఎంతో దోహదం

టిపిసిసి జనరల్ సెక్రటరీ, ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మల శ్రీనివాస్



ప్రజాపక్షం/ నిజాంపేట్ : మండుతున్న ఎండల వేడిమికి దప్పిక తీర్చుకోవడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లిలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, ఆర్యవైశ్య సంఘం బాచుపల్లి ఆధ్వర్యంలో వ్యాల్యూమేడ్ ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఐదు చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త, మాజీ కార్పొరేటర్‌లు కొలను వీరేందర్ రెడ్డి, వాకలపూడి రవికిరన్, బిఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డిలు విచ్చేసి బాచుపల్లి ప్రధాన చౌరస్తాలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. ముందుగా మజ్జిగను ప్రయాణికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐవిఎఫ్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు కట్ట రవి, గ్రేటర్ హైదరాబాద్ ఐవిఎఫ్ అధ్యక్షులు, బాచుపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వంగపల్లి నవీన్ కుమార్, సభ్యులు విద్యాసాగర్, వినయ్, సురేష్, కిరన్, శ్రవన్, వ్యాల్యూమేడ్ ఆసుపత్రి అధినేత సతీష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదవాడికి సొంతింటి కల నెరవేరింది!

చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్



ప్రజాపక్షం/నవాబుపేట్ : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సొంత ఇంటి కల నెరవేరుతుందని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పామేనా భీమ్ భరత్ అన్నారు. ఆదివారం నవాబ్ పేట్ మండలం చిట్టిగిద్ద గ్రామంలో లబ్ధిదారుడు పోతురాజు రాధాకృష్ణ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతరం చిట్టిగిద్ద గ్రామంలోని మెథడిస్ట్ చర్చ్, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ పెట్ మండలం అధ్యక్షులు వెంకట య్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి, నవాబ్ పేట సర్పంచ్ నరసింహ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు గణపురం ప్రసాద్, చించ ల్ పేట్ అనంత రాములు, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప స ర్పంచ్ శ్రీహరి, బందయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి చేస్తున్న విషప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పి కొట్టాలి

డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మహిళా రిజర్వేషన్ బిల్లుపై బిజెపి చేస్తున్న విష ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపిచ్చారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మహిళా వ్యతిరేక పార్టీగా కాంగ్రెస్ పార్టీని చూపించే యత్నంలో భాగంగా పార్లమెంటులో అడ్డుకొందంటూ బిజెపి చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. వాస్తవానికి 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించినా కేంద్ర ప్రభుత్వం అమలు చేయటంలో నిర్లక్ష్యం వహించిన విషయం అందరికి తెలిసిందేనన్నారు. దేశవ్యా ప్తంగా పార్లమెంటు, శాసనసభా స్థానాల సంఖ్యను పెం చటం, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టే కుటిల యత్నం లక్ష్యంగా దానికి మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టే ప్రయత్నాన్ని మాత్రమే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందే తప్ప మహిళా రిజర్వేషన్ల బిల్లును ఎంత మాత్రం కాదన్నారు.

## కరెంటు షాక్‌తో బాలుడు మృతి


ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : కరెంటు షాక్‌తో పీత్ నాయక్ (16) సంవత్సరాల బాలుడు మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన పీత్ నాయక్ బతుకుతెరువు కోసం ఘట్‌కేసర్ వచ్చి శనివారం ఉదయం రైల్వే స్టేషన్ ప్రక్కన బ్రూక్ బాండ్ వెంచర్లలో ఓ కాంట్రాక్టర్ వద్ద సెంట్రింగ్ పనులకు వెళ్ళాడు సెంట్రింగ్ డబ్బాలు తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తెకేదార్ ఆదినారాయణ, బిడ్డర్ కిషోర్ కుమార్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పవర్ బోరు పనుల ప్రారంభం



ప్రజాపక్షం/మల్కాజిగిరి : మల్కాజిగిరి ఎంపి నిధులతో మంజూరైన పవర్ బోరు పనులను మౌలాలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ బుధవారం ఎంజె కాలనీలో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సెక్రటరి పిబి సింగ్, ప్రసాద్ చౌదరి, సత్యవతి, లక్ష్మి కాంతా రావు, దేవేందర్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపడి ఎద్దు మృతి



ప్రజాపక్షం/మోమిన్‌పేట్ : వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని మోరంగపల్లి గ్రామంలో సాయంత్రం ఈదురు గాలులు , భరీ వర్షం కురువడంతో పిడుగుపడి ఎద్దు అక్కడికి అక్కడే పశువుల పాకలో కట్టేసి ఉన్న మంగల రాములుకు చెందిన ఎద్దు మృతి చెందింది.ఈ సందర్భంగా రైతుకు సుమరు లక్షరూపాయలవరకు నష్టం జరిగినట్లు తెలిపారు.ఎద్దు వద్ద రైతు కన్నీరు అయ్యారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని గ్రామ సర్పంచు ,గ్రామస్తులు కోరారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం /పరిగి : మొక్కజోన్న కొనుగోలు కేంద్రం ప్రాంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో మార్క్‌పెడ్ ద్వారా మొక్కజోన్న కొనుగోలు కేంద్రాన్నిపరిగి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.2400 గిట్టుబాటు ధరను అందిస్తున్నదని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు పాల్గోన్నారు.



# సర్కారు దవాఖాన - శాంపిల్ ఇస్తే హైరానా

## సిబ్బంది తక్కువ - నిర్లక్ష్యం ఎక్కువ, ముదిరిన ఎండలు - ఫలితాల్లో తప్పులు?, ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగులు

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** వివిధ వ్యాధుల నివారణ కోసం సర్కారు ఆసుపత్రుల్లో రక్త పరీక్షల కోసం శాంపిళ్లు ఇచ్చిన వారు నానా హైరానా పడాల్సి వస్తోంది. రోగ నిర్ధారణ సరిగ్గా జరగక పోగా ఒక్కో సారి ఒక వ్యాధికి బదులు మరొకటి ఉన్నట్లుగా ఫలితాలు వస్తుండడంతో రక్త నమూనాలు ఇచ్చిన వారు భయాందోళనలకు గురై ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగులు తీయాల్సిన పరిస్థితులు నగరంలో నెలకొన్నాయి. రక్త నమూనాలు సేకరించి వాటిని పరీక్షల కోసం ప్రధాన ల్యాబ్‌కు తీసుకువెళ్లే సిబ్బంది తక్కువగా ఉండడం, ఉన్న వారు కూడా నమూనాల సేకరణ, తరలింపులో నిబంధనలు పాటించకపోతుండడం దీనికి కారణం. ఈ పరిస్థితి నగరంలోని బస్తీ దవాఖానలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నెలకొంది. నిజానికి రక్త పరీక్షల ఫలితాలు కచ్చితంగా రావాలంటే వాటి సేకరణ నుంచి ల్యాబ్‌కు తరలించడం వరకు సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. నగరంలో ఏమూలన ఉన్న బస్తీ దవాఖాన, పట్టణ ఆరోగ్యకేంద్రంలోనైనా రక్త పరీక్షలు చేసే సౌకర్యాలు లేవు. ఇక్కడ రక్త నమూనాలు సేకరించి నారాయణగూడలోని సెంట్రల్ డయోగ్నిస్టిక్ సెంటర్‌కు తరలించి అక్కడ పరీక్షలు చేయించి వాటి నివేదికలను ఆయా ఆసుపత్రులకు తరలించాలి. దీనికోసం నియమించిన సిబ్బంది వివిధ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తిరిగి అక్కడ నమూనాలు సేకరించి నారాయణగూడ ల్యాబ్‌కు తీసుకువస్తారు. ఈ సిబ్బంది తక్కువగా ఉండడమే కాకుండా ఈ ప్రక్రియను పర్యవేక్షించే వారి నిర్లక్ష్యం కూడా తోడై ఈ పరిస్థితులు నెలకొన్నాయి. నిజానికి సేకరించిన రక్త నమూనాను రెండు నుంచి నాలుగు గంటల్లోపే నారాయణగూడ ల్యాబ్‌కు తీసుకు రావాలి. నారాయణగూడకు దూరంగా ఉన్న ప్రాంతాల్లోని బస్తీదవాఖానలు, అర్బన్‌ప్రైమరీ హెల్త్ సెంటర్లలో తీసుకున్న రక్తనమూనా పరీక్షల్లో ఎక్కువగా తప్పులు దొర్లుతున్నాయి. నిజానికి నిబంధనల ప్రకారం రక్తం నమూనా సేకరించిన రెండు నుంచి నాలుగు గంటల లోపే ల్యాబ్‌కు రావాలి. తీసుకున్న శాంపిల్‌ను రెండు నుంచి ఎనిమిది డిగ్రీల సెల్సియస్ వద్ద నిల్వ చేయాలి. అంతే కాదు ఉష్ణోగ్రతలో మార్పు రాకముందే వీలైనంత త్వరగా ల్యాబ్‌కు చేరవేయాలి. అలాగే శాంపిళ్లను థర్మ



కోల్ డబ్బాలు, ఐస్‌ప్యాక్‌లో తీసుకుపోవాలి. గత కొన్ని రోజులుగా ఎండలు ముదిరాయి. ఎంత ఐస్‌బాక్సుల్లో పెట్టినా కూడా నారాయణగూడా ల్యాబ్‌కు వచ్చే వరకు నాణ్యతా ప్రమాణాల మేర ఉష్ణోగ్రతలో ఉంచడం కష్టంగా మారింది. డాక్టర్లు, సూపర్‌వైజర్లు ఈ విషయంలో కొంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం, తరలింపులో సిబ్బంది ఇష్టారాజ్యంగా నడుచుకుంటుండడంతో రక్తనమూనాల పరీక్షల పలితాల్లో గందరగోళం నెలకొంటోంది. అంతే కాదు రక్త పరీక్షల పలితాలు వచ్చే వరకు వారం పదిరోజులు పడుతోంది. ఈలోపు తీవ్రత పెరుగుతోంది. ఆలస్యంగా వచ్చిన తర్వాత వాటిని చూసి దీంతో లబోదిబోమంటూ ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగులు తీయాల్సి వస్తుండడమే కాకుండా రోగ నిర్ధారణలోనూ జాప్యం జరిగి అనర్థాలకు దారితీస్తోంది. బస్తీ దవాఖానాలు, పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో ప్రైవేటుగా వైద్యం చేయించుకోలేని నిరుపేదలే వస్తారు. వీరు మళ్లీ ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లే పరిస్థితులు కూడా లేక ఎంత చాలా మంది దూరభారమైనా కూడా నేరుగా నారాయణగూడ ల్యాబ్‌కు వెళుతున్నారు. ఎండలు కూడా ముదరడంతో, మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉండడంతో నిర్ధిష్ట టెంపరేచర్‌లో రక్తం నమూనాలు ప్రధాన ల్యాబ్‌కు చేరుకునేలా చూడాలి. ఈ విషయంలో ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సిబ్బందిని పెంచడంతో పాటు ప్రధాన ల్యాబ్‌కు తీసుకువెల్లడంలో జాప్యం జరగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## నెర్రపల్లిలో రాకెట్ ప్రయోగం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** డిఎస్ఆర్ఎస్‌కెఎల్‌పి హైపవర్ రాకెట్‌ను విద్యార్థులు ప్రయోగాత్మకంగా ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లి గ్రామంలో ఎతైన ప్రదేశంలో సైన్సుమై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతరిక్షా ఇండియా సహ సమర్పణలో 1కి.మి ఎత్తు ఆకాశంలోకి విజయవంతంగా ప్రయోగించారు. అనంతరం సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ ఖగోళ శాస్త్రం, రాకెట్ టెక్నాలజీలో వెయ్యి మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. శిక్షణలో భాగంగా ప్రయోగాత్మకంగా విద్యార్థులు ఈ రాకెట్‌ను ఎతైన మైదాన ప్రాంతంలో వినియోగించినట్లు తెలిపారు. ఈ రాకెట్ విజయవంతం అయితే రాబోయే అక్టోబర్‌లో 5 కిలో మీటర్ ఎత్తు లక్ష్యంగా ఫెజ్2 ప్రయోగాన్ని నిర్వహించి ఆ తరువాత చెనైలో 10కి.మి.ఎత్తులో ప్రయోగం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హెమలత శ్రీహరి, ఉపసర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు పద్మా జంగయ్య, అరణ్‌కుమార్, సాయికిరన్, నర్సింహ్మా, రేణుక, కార్యదర్శి రాజ్‌కుమార్, సంస్థ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## జర్మనీలో భారతీయుడికి గౌరవం

విదేశీయుల సలహా మండలి బోర్డ్ సభ్యుడిగా వెంకటేష్ వీరోజు ఘన విజయం



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** జర్మనీ గీసెన్ జిల్లాలో భారతీయుడికి అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నాడు వెంకటేష్ వీరోజు. నాగర్ కర్నూలు జిల్లా నుంచి వచ్చి ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ న్యూ సుభాష్ నగర్ కాలనీలో స్థిరపడ్డ సూర్యనారాయణ విరోజు, శ్రీదేవి దంపతుల కుమారుడు వెంకటేష్ విరోజు కొద్ది రోజుల క్రితం జర్మని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డ విదేశీయుల సలహామండలి ఎన్నికల్లో బోర్డ్ సభ్యుడిగా విజయం సాధించారు. బోర్డ్ సభ్యుడి స్థానం కీలకమైనది. మండలి పనితీరును నడిపించడం, నిర్ణయాలు తీసుకోవడం, విదేశీయుల వాణిగా నిలవడం వంటి ముఖ్య బాధ్యతలు ఈ పదవికి చెందినవి. సమాజంలో మార్పు తీసుకురావడంలో ఈ స్థానం ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ప్రజలకు సహాయం చేయాలనే తపనతో ఎప్పుడూ ముందుండే వెంకటేష్ వీరోజు ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. వెంకటేష్ వీరోజు వృత్తిపరంగా లీడ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడు సాధించిన ఈ ప్రతిష్టాత్మక విజయంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## చర్చి వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** బియన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాయిరాం కాలనీలో మహానైమ్ ఫుల్ గోస్పెల్ చర్చ్ 45వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం చర్చ్ పాస్టర్ జాన్‌బాబు, జాన్‌బోయాని ఆహ్వానం మేరకు ఎంపి ఈటల రాజేందర్ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, కోటేశ్వరరావు, హరికృష్ణ, నూతి శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధీర్, చిన్న యాదవ్, కౌశిక్, శబరినాథ్, దిలీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఎండకాలంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్ర ఏర్పాటు చేస్తున్నామని శ్రీరామ సేన నవీన్ వల్లోజు, జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాహెబ్ నగర్‌లోని వేంకటేశ్వర కాలనీ ముఖద్వారం వద్ద చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, బాటదారులకు ఎండకాలంలో వారి దాహార్తిని తీర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పాటి రాంబాబు గౌడ్, డాక్టర్ విజయ్ కుమార్, గోపాల్‌దాస్, రాధావిష్ణు, మోహన్, వెంకటేష్ గౌడ్, శివ శంకర్, శ్రీరాములు గౌడ్, శరత్, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### వైదేహినగర్‌లో చలివేంద్రం ప్రారంభించిన సిఐ రవిబాబు

ఎల్‌బి నగర్ కాంగ్రెస్ యువ నాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్ ఆధ్వర్యంలో వైదేహినగర్, కరెంట్ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వనస్థలిపురం సిఐ రవిబాబు ప్రారంభించారు. స్థానికులకు, పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి నాయక్, నాయకులు శాండి, సోను, ధీరజ్, నవీన్ తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి: సిపిఐ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో గుట్టు చప్పడు కాకుండా భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న అధికారులు తనిఖీ చేయటంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఆసుపత్రులకు అత్యవసరంగా చికిత్సల కోసం పేద, మధ్యతరగతి రోగులు వెళ్లితే వైద్యఖర్చులు, ల్యాబ్ పరీక్షల పేరుతో అధిక ఫీజులు వసూళ్ళ చేసి నిరుపేదలను మోసం చేస్తున్న పట్టించుకునే నాథులే కరువయ్యారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి అనుమతి లేని ఆసుపత్రులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పినీలమ్మ, బండి నర్సిహ్మా, బాలయ్య పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి



**ప్రజాపక్షం/కడ్తాల్ :** తలకొండపల్లి మండలం వెలిజాల గ్రామపంచాయతీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ శతాబ్దంలో మొఘల్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ పోరాటాలు అణగారినవర్గాల ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని నింపాయన్నారు. ఆయన ధైర్యసాహసాలు, ప్రజా పోరాటాలు తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందాయన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ కసిరెడ్డి కడ్తాల్ మండలం సాలార్పూర్ గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించారు.

## ఆరు నెలల్లోగా డిజిటల్ హెల్త్‌కార్డుల అందజేత

పైలెట్ ప్రాజెక్టు కింద సంగారెడ్డి జిల్లా ఎంపిక

స్కిన్, హెయిర్ చికిత్స లేజర్ యంత్రాల ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర రాజనరసింహ



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనుదారులకు డిజిటల్ హెల్త్‌కార్డులను ఆరు నెలల్లోగా అందజేయడం పూర్తి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు. ఇందుకు, సంగారెడ్డి జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదురహిత వైద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరలో అన్ని జిల్లాల్లో హెల్త్‌కార్డుల పంపిణీని పూర్తి చేస్తామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బర్కత్‌పురలోని డాక్టర్ ఆనంద్ ఇంటర్నేషనల్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ స్కిన్ అండ్ కాస్మోటాలజి సెంటర్‌లో ఆధునాతన స్కిన్, హెయిర్ చికిత్స లేజర్ యంత్రాలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఆధునాతన టెక్నాలజీ వైద్య చికిత్సలు రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ హెల్త్‌హబ్‌గా మారి దేశానికే ఆదర్శంగా నిలువనున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికతో రూపొందించిన లేజర్ పరికరాలు చర్మ వైద్యరంగంలో కొత్త శకానికి నాంది పలుకుతాయన్నారు. ఆసుపత్రి ఎండి డాక్టర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సరికొత్త పరికరాలతో రోగులకు నాణ్యమైన వైద్యచికిత్సలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సమత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా బిల్లును ప్రతిపక్షాలు విస్మరించడం దుర్మార్గం

ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** మహిళా బిల్లుకు ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. 1996 నుంచి ఇప్పటి వరకు మహిళా బిల్లు ఏడుసార్లు తిరస్కరణకు గురికావడం తీవ్ర అన్యాయమన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బిసి విద్యార్థి విభాగం కన్వీనర్ మోదీ రాందేవ్, బిసి ఐక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య సంయుక్త అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సమాజంలో లింగ వివక్ష, కుల వివక్ష తొలగింపుపోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. మహిళా బిల్లు పూర్తికాగానే బిసి బిల్లు పెట్టేందుకు కేంద్రప్రభుత్వం అంగీకరించిందన్నారు. బిసి బిల్లు పెడితేనే మహిళా బిల్లులో బిసి సబ్‌కోటా వస్తుందన్నారు. కుల వివక్ష తొలగించాలంటే బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశాన్ని ఒక్కొక్క మెట్టు అగ్రదేశంగా తీర్చిదిద్దడానికి అడుగులు వేస్తున్న ప్రధాని మోదీని రాజకీయకోణంలో చూడవద్దని, ఆయనపై విమర్శలు చేయడం మానుకోవాలని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. 75కోట్లకుపైగా ఉన్న బిసి వర్గాల చిరకాల కులగణనకు మోదీ ప్రభుత్వం గౌరవించి, నిర్ణయం తీసుకొన్నదన్నారు. కులగణన తర్వాత బిసిలకు చట్టసభలలో 50శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పెంపు నిర్ణయాలు కూడా మోదీ తీసుకుంటారని కృష్ణయ్య ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో బిసి యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బిసి సంఘం అధ్యక్షులు రాజేందర్, నేతలు నిఖిల్ పటేల్, వెంకట్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాక్సివిజన్, సైట్‌సేవర్స్ ఆధ్వర్యంలో అర్బన్ ఐ హెల్త్ విజయవంతం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పట్టణంలోని అట్టడుగు వర్గాలకు నాణ్యమైన కంటి సంరక్షణ అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో సైట్‌సేవర్స్ ఇండియా, డా.రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ సంయుక్తంగా అర్బన్ ఐ హెల్త్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు హైదరాబాద్‌లోని కమ్యూనిటీ విజన్ సెంటర్ల వద్ద జరిగిన ఈ కార్యక్రమం నిరుపేదలకు కంటి వైద్య సేవలు అందజేశారు. హైదరాబాద్ ప్రైవేట్ విజన్ సెంటర్‌కు మద్దతుగా నిలిచిన ఈ భాగస్వామ్యం ద్వారా 4,514 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా,550 మందికి కళ్లజోళ్లు అందించారు. 360 మందిని కాటరాక్ట్ చికిత్సకు రిఫర్ చేశారు. నిర్వాహకులు ఆర్.ఎన్.మోహంతి మాట్లాడుతూ కమ్యూనిటీ స్థాయిలో కంటి సంరక్షణను బలోపేతం చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆప్టోమెట్రిస్టులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోరాటాల బలోపితమే ధ్యేయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసమానతలను తొలగించడానికి వర్గ, సామాజిక జమిలి పోరాటాలను బలోపితం చేయడమే 'మహమ్మద్'కు నివాళి అర్పించడమని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్ అన్నారు. ఎంసిపిఐ(యు) మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌గౌస్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, బాగ్ లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో 'మహమ్మద్ గౌస్' చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, తుడుం అనిల్ కుమార్, పల్లె మురళి, తాండ్ర కళావతి, ఎస్ లక్ష్మణ్, డప్పు రాజు, ఎం.నరసింహ,జి. దిలీప్ పాల్గొన్నారు.

## పరిష్కారానికి నోచని భవన నిర్మాణ కార్మికుల సమస్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (టియుసిఐ అనుబంధం ) రాష్ట్ర అధ్యక్షులు ఎం. హన్మేశ్, టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ ఆరోపించారు. తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (టియుసిఐ అనుబంధం ) ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ నిర్మాణ జనరల్ బాడీ సమావేశం ఆదివారం మార్క్స్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి గ్రేటర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు నల్లన్న, సభ్యులు వెంకటేష్, అంజనేయులు అధ్యక్ష వర్గంలో వ్యవహరించారు. సమావేశంలో టియుసిఐ నగర అధ్యక్షుడు రవి, కార్యదర్శివి.ప్రవీణ్, కెవిఎస్ ప్రదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.హన్మేశ్, ఎస్.ఎల్. పద్మ మాట్లాడుతూ ప్రమాద, సహజ మరణాల క్లెయిములను భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు బదులుగా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం అన్యాయమన్నారు. ఈ సమస్యలపైన రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని, కార్మిక కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని



హెచ్చరించారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లన్న, కార్యదర్శిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, కిరణ్, సహాయ కార్యదర్శులుగా నరేంద్ర, సుధాకర్, కోశాధికారిగా అంజన్న ఎన్నికయ్యారు. సమావేశానికి ముందు ఇటీవల మరణించిన సంఘం నాయకులు జయరాజు, వి.కిరణ్‌కు సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటిం వారికి జోహార్లు అర్పించారు.

## రోడ్డు నిర్మాణంలో... సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం ప్యూచర్ సిటికి రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. రోడ్డు పనులు జరుగుతున్నప్పుడు ప్రమాదాలు జరుగకుండా సూచిక బోర్డులు ఎర్పాటు చేయాల్సిఉండగా అందుకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. సాగర్ రహదారిపై నున్న తక్కళ్ళపల్లి గేటు నుండి తక్కళ్ళపల్లి, మేడిపల్లి, మిదుగా టిఎస్ఐఐసి అధికారులు ప్యూచర్ సిటికి రోడ్డును వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుపక్కనే గోయ్యిని తీసారు పనులు సకాలంలో జరుగక పోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో ఉందని రేడియం స్టిక్కర్ల తోబాటు సూచిక బోర్డులు ఎర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలన్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని అయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఈదురుగాలులకు నేలరాలిన మామిడి

రైతులకు అపార నష్టం...

ప్రభుత్వం అదుకోవాలని వేడుకోలు...

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో అదివారం బారి ఈదురు గాలులు రావడంతో మామిడికాయలన్ని నేలరాలాయి. దింతో మామిడి తోటను నమ్మిని బ్రతుకుతున్న రైతు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. గ్రామానికి చేందిన రైతు దొమ జివన్మయిరెడ్డి 10 ఎకరాల వ్యవసాయ పోలంలో దాదాపు 800 చేట్లు ఉన్నాయి. మామిడి కాయలు బాగా కాశాయని ఎంతగానో సంబర పడ్డాడు ఈదురు గాలులు రావడంతో మామిడికాయలన్ని నేల రాలడంతో లబోదిబోమంటు గుండేలు బాదుకుంటున్నాడు దాదాపు 5 లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని రైతు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి అదుకోవాలని రైతులు వేడుకుంటున్నాడు.



## కోర్టు స్టే ఉండగా భూములు ఎలా స్వాధీనం చేసుకుంటారు

ఫార్మా వ్యతిరేక ఉద్యమ నాయకురాలు కవుల సరస్వతి



**ప్రజాపక్షం/యాచారం :** ఫార్మా సిటీ భూములకు సంబంధించి హైకోర్టులో స్టే ఉండగా అధికారులు ఎలా భూములను స్వాధీనం చేసుకుంటారని ఫార్మా వ్యతిరేఖ ఉద్యమ నాయకురాలు కవుల సరస్వతి అగ్రహం వ్యక్తం చేశారు. అదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారులు కోర్టు దిక్కరణకు పాల్పడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫార్మాసిటీ గ్రామాలైన మేడిపల్లి నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని భూములపై హైకోర్టులో కేసులు ఉన్నాయి. పార్మాసిటికి కాన్సేంట్ ఇచ్చిన భూముల్లో పంటలు వేయవద్దని అర్డిఒ హెచ్చరించడం ఎంతవరకు సమంజసమన్నారు. నాలుగు గ్రామాల్లో కూలీల కేసుల్లో స్టేలు ఉ న్నాయన్నారు. కూలీలకు నష్టపరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలకు ఉపాధి చూపాలన్నారు. అసైన్‌మేంటు, పట్టా భూములు స్వాధీనం చేసుకోవద్దని హైకోర్టు తెల్పిన అర్డిఒ అనంతరెడ్డి, డిసిపి, ఎసిపి సహకారంతో భూములు బలవంతంగా తీసుకుంటున్నారని తెలిపారు. చట్టపరంగా రోడ్డు పనులు చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్, అర్డి ఒ , తహసీల్దారు, పోలీస్ అధికారులకు హైకోర్టు షోకాజ్ నోటిసులు కూడా ఇచ్చిన మళ్ళీ కోర్టు దిక్కరణకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ సిబ్బంది, అధికారులే చట్ట వ్యతిరేక పనులు చేస్తున్నారని అవేధన వ్యక్తం చేశారు. రైతులందరు పంటలు వేసుకోవచ్చని ఆమె తెలిపారు.

# లక్నోపై పంజాబ్ భారీ విజయం



ఐపిఎల్ 19లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఎదురైన ప్రత్యర్థినల్లా మట్టి కరిపిస్తున్న శ్రేయస్ అయ్యర్ సేన ఈసారి లక్నో సూపర్ జెయింట్స్‌కు తమ పంచ్‌ను రుచి చూపింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(93), కూపర్ కొన్నొల్లీ(87)ల విధ్వంసకాండతో 254 రన్స్ కొట్టిన పంజాబ్ ఆపై లక్నోను వణికించింది. ఆరంభం నుంచి తడబడిన లక్నో మర్క్రమ్(42) పోరాటంతో రన్స్‌కు పరిమితమైంది. పంజాబ్ ఖాతాలో ఐదో విజయం చేరగా.. పంత్ బృందానికి నాలుగో ఓటమి ఎదురైంది. ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్ పంజాకు లక్నో సూపర్ జెయింట్స్ విలవిలలాడింది. ఆదివారం డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో పంజాబ్ దెబ్బకు లక్నో బదులివ్వలేకపోయింది. బౌలర్ల వైఫల్యంతో భారీ స్కోర్ సమర్పించుకున్న లక్నో.. 255 పరుగుల ఛేదనలో ఏ కోశాన లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్గా వచ్చిన ఆయుశ్ బదొని(35) ఔట్ చేసి లక్నోను ఒత్తిడిలో పడేశాడు. విధ్వంసక హిట్టరైన మిచెల్ మార్ష్(40), రిషభ్ పంత్ (43)లు రాణించినా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. హిట్టర్ పూరన్(9) విఫలమవ్వగా.. ఎడెన్ మర్క్రమ్(42), ముకుల్ చౌదరీ(21 నాటౌట్)లు పోరాడారు. కానీ, రన్‌రేటు అంతకంతకూ పెరిగిపోవడంతో వీరేమీ చేయలేకపోయారు. లక్నో రెండొందలకే పరిమితవ్వగా పంజాబ్ 54 పరుగుల తేడా తో గెలుపొంది అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది.

**దంచికొట్టిన కుర్రాళ్లు...** ఐపిఎల్‌లో రికార్డుల మోతకు తెరదీసిన పంజాబ్ కింగ్స్. టోర్నీలో అజేయంగా దూసుకెళ్తున్న ఆ జట్టు ముల్లన్‌పూర్‌లో భారీ స్కోర్‌తో లక్నో సూపర్ జెయింట్స్ భయపెట్టింది. టాస్ ఓడినా పంజాబ్‌కు శుభారంభం దక్కకున్న.. కుర్రాళ్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ ప్రభ్సిమ్రన్ సింగ్(0)ను తొలి ఓవర్లోనే ఔటైనా.. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లకు ప్రియాన్ష్ ఆర్య(93) చుక్కలు చూపించాడు. కూపర్ కొన్నొల్లీ(87) తో కలిసి విధ్వంసకాండ రచించిన ఈ కుర్రాడు మెరుపు అర్ధ శతకంతో చెలరేగిపోయాడు. బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్స్‌కే అన్నట్టుగా.. గీత దాటించడమే లక్ష్యంగా వీరిద్దరూ చెలరేగారు. ఇద్దరూ పోటాపోటీగా బౌండరీలు బాదేయగా పంజాబ్ స్కోర్ రాకెట్ వేగంతో పరుగులు తీసింది. శతకాల దిశగా దూసుకెళ్లిన ఈ జోడీని ప్రిన్స్ యాదవ్(2–25) విడదీసి లక్నోకు ఊరటనిచ్చాడు. ఆ వెంటనే ప్రియాన్ష్ సిద్ధార్థ్(2–35) ఔట్ చేయగా.. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(5) నిరాశపరిచాడు. అనంతరం నేహల్ వధేరా(13), మార్కస్ స్టోయినిస్(29), శశాంక్ సింగ్(17)లు స్కోర్ బోర్డును ఉరికించారు. ఆఖరి ఓవర్లో చివరి బంతికి స్టోయినిస్ రనౌటవ్వగా పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది.

# ఈడెన్ గార్డెన్స్‌లో బోణీ కొట్టిన కోల్‌కతా!




పంతొమ్మిదో సీజన్‌లో ఎట్టకేలకు కోల్‌కతా నైట్ రైడర్స్ బోణీ కొట్టింది. ఐదు ఓటముల నుంచి తేరుకున్న కోల్‌కతా లోయర్ ఆర్డర్ మెరుపులతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. టాప్‌ఆర్డర్, మిడిలార్డర్ చేతులెత్తేయగా మరోసారి బాధగా మైదానం వీడాల్సి వస్తుందనుకున్న వేళ.. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(53 నాటౌట్), అనుకుల్ రాయ్(29 నాటౌట్) జోడీ పట్టుదలకు రాజస్థాన్ దాసోహమైంది. ఏడో వికెట్‌కు అర్ధ శతకం భాగస్వామ్యంతో కోల్‌కతాకు తొలి విజాయన్ని కట్టబెట్టారిద్దరు. బ్రిజేష్ వేసిన చివరి ఓవర్‌లో రింకూ రెండు ఫోర్లు, సిక్సర్‌తో కెకెఆర్ యాజమాన్యం, అభిమానులను సంబురాల్లో ముంచెత్తాడు. పంతొమ్మిదో సీజన్‌లో ఐదు మ్యాచుల్లో ఓడిపోయిన కోలకతా నైట్ రైడర్స్ విజయంతో మురిసింది. స్వల్ప ఛేదనలో ప్రధాన బ్యాటర్లు విఫలమైనా రింకూ సింగ్(53 నాటౌట్), అనుకుల్ రాయ్(29 నాటౌట్) సంచలన ఆటతో రాజస్థాన్ రాయల్స్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. 70 పరుగులకే ఐదు వికెట్లు పడిన వేళ మరో ఓటమి దిశగా సాగుతున్న కోల్‌కతాను వీరిద్దరూ అద్భుతంగా విజయం వైపు నడిపారు. డెత్ ఓవర్లలో రాజస్థాన్ పేసర్లను ధీటుగా ఎదుర్కొన్న రింకూ, అనుకుల్ ఈ సీజన్‌లో కోల్‌కతాకు తొలి విజయాన్ని కట్టబెట్టారు. తొలుత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(3–14), కార్తిక్ త్యాగి(3–22)ల ప్రదర్శనతో రాజస్థాన్ రాయల్స్‌ను 155కే కట్టడి చేసిన కోల్‌కతా బ్యాటింగ్‌లో తడబాటును కొనసాగించింది. ఆర్చర్ సంధించిన మొదటి బంతికే సీఫర్ట్(0) బౌల్డయ్యాడు. ఆ తర్వాతి ఓవర్‌లో అజింక్యా రహానే(0)ను బర్గర్ వెనక్కి పంపాడు. ఓపెనర్లు డకౌటైన వేళ ఇంప్యాక్ట్ సబ్ రఘు వంశీ(10 నాటౌట్) జతగా కామెరూన్ గ్రీన్(27) ధనాధన్ ఆడాడు. బౌండరీలతో స్కోర్ బోర్డును ఉరికిస్తున్న గ్రీన్‌ను బిష్ణోయ్ బోల్తా కొట్టించాడు. వైడ్ బాల్ ఆడబోయిన గ్రీన్‌ను.. జురెల్ రెప్పపాటులో స్టంపింగ్ చేశాడు. కుడివైపు డైవ్ చేస్తూ బంతిని అందుకున్న జురెల్ బంతిని గురి చూసి వికెట్ల మీదకు విసిరాడు. అంతే.. ఇదేంటి? ఇలా జరిగింది? అని గ్రీన్ నిరాశగా పెవిలియన్ వైపు నడిచాడు. యశ్‌రాజ్ పూనియా ఓవర్లో పావెల్ (23) 4, 6 బాదడంతో పవర్ ప్లేలో కోలకతా 3 వికెట్ల నష్టానికి 51 రన్స్ కొట్టింది. జోడీ అయినా నిలుస్తుందనుకుంటే జడ్డా వరస ఓవర్లలో రఘు వంశీ, పావెల్‌ను ఔట్ చేయడంతో మ్యాచ్ రాజస్థాన్ వైపు తిరిగింది.

**రింకూ గేర్ మార్చి..** టాప్‌ఆర్డర్, మిడిలార్డర్ వైఫల్యంతో 70కే ఐదు వికెట్లు పడిన వేళ వైస్ కెప్టెన్ రింకూ సింగ్(53 నాటౌట్)కు గెలుపు బాధ్యత తీసుకున్నాడు. పదిహేనో ఓవర్ తర్వాత రింకూ సింగ్ గేర్ మార్చాడు. పరాగ్ ఓవర్‌లో బౌండరీ.. ఆపై అర్చర్‌ను ఉతికేస్తూ రెండు ఫోర్లు బాదాడు . అనుకుల్ రాయ్(29 నాటౌట్) ఓ సిక్సర్ కొట్టగా కోల్‌కతారేసులోకి వచ్చింది. 18బంతుల్లో 28 పరుగులు అవసరమవ్వగా.. బ్రిజేష్ ఏడు రన్స్ ఇచ్చాడంతే. కానీ, ఆర్చర్‌కు షాకిస్తూ అనుకుల్ రాయ్ సూపర్‌సిక్సర్‌తో విజయాన్ని తేలిక చేశాడు. చివరి ఓవర్‌లో రింకూ 4,4,6తో అర్ధ శతకం పూర్తి చేసుకొని కోల్‌కతా నిరీక్షణకు తెరదించుతూ నాలుగు వికెట్ల విజయాన్ని అందించాడు.

# ఆరోగ్యం

## మధుమేహానికి శాశ్వత పరిష్కారం?

తరచు సోషల్ మీడియాలో ఇలాంటి వైద్య, ఆరోగ్య సంబంధమైన వార్తలు దర్శనమిస్తూ ఉంటాయి. వివిధ దేశాల్లోని ప్రఖ్యాతిగాంచిన పరిశోధనా కేంద్రాలు, పేరొందిన శాస్త్రవేత్తల పేర్లను ఉటంకిస్తూ, ఇలాంటి వార్తలు వస్తూ ఉంటాయి. నిజానికి ఈ వార్తలన్నీ ఒక చిన్న వాస్తవం చుట్టూ అల్లిన కథనాలు మాత్రమే. జర్మనీ శాస్త్రవేత్తలు మధుమేహానికి శాశ్వత పరిష్కారం కనుగొన్నారనే వార్త కూడా ఇలాంటిదే. నేటి వైద్య పరిశోధనలో స్టెమ్ సెల్ థెరపీ, పాంక్రియాటిక్ కణ పునరుత్థానం మీద కొన్ని క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయన్నది నిజం. అయితే, మధుమేహానికి శాశ్వత పరిష్కారం ఇప్పటికే సాధ్యమైనట్లు ఎవరూ ఇప్పటి వరకూ అధికారికంగా ప్రకటించలేదు. అంతే కాదు, ప్రస్తుతం జరిగే పరిశోధనలు ముఖ్యంగా




టైప్1 మధుమేహ రోగులపై ఇన్సులిన్ ఉత్పత్తి చేసే బీటా సెల్స్‌ను ని పునరుద్ధరించడానికి, రోగి స్వంత స్టెమ్ సెల్స్‌ను ఉపయోగించే దిశగా సాగుతున్నాయి. వాటిని పాంక్రియాస్‌లోకి ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో, కొద్దిపాటి సానుకూల ఫలితాలు కనిపించాయి. అయితే, పరిశోధన ప్రస్తుతానికి ప్రారంభ దశలోనే ఉంది. ఎంతటి మధుమేహ బాధితులైనా ఆరు నెలల్లో పూర్తిగా కోలుకుంటారంటూ వస్తున్న వార్తలను అతిశయోక్తులుగానే పరిగణించాల్సి ఉంటుంది. మధుమేహం అనేది సోకకుండా కూడా చేసే వైద్య విధానం అందుబాటులోకి వచ్చిందన్న వార్తలోనూ నిజం లేదు. నిజానికి, స్టెమ్ సెల్ పునరుద్ధరణ, టార్గెటెట్ ఇమ్యునో తెరపీ ఫలితాలు పరీక్ష జరిపిన వ్యక్తి ఆరోగ్యం, ప్రయోగ విధానం, రోగి స్థితి వంటి అంశాలపై ఆధారపడి ఉంటాయి. ఇవి ప్రతి రోగికీ సమానంగా వర్తిస్తుందని చెప్పడానికి వీల్లేదు. స్టెమ్ సెల్స్ థెరపీపై శాస్త్రవేత్తలు ఆశాజనకంగా ఉన్నారు. కానీ, ప్రయోగదశలో ఉన్న అంశాన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేశాయనే రీతిలో ప్రకటించడం ప్రజలను తప్పుదారి పట్టించడమే.

## షుగర్ నియంత్రణకు..



రక్తంలో షుగర్ నియంత్రణకు స్వీట్ పొటాటో (చిలకడదుంప/ మొరం గడ్డ), పాలు విరగ్గొట్టి తయారు చేసిన కోవా ఎంతో ఉపయోగమని అంటున్నారు. అంతర్జాతీయ కథనాలను అనుసరించి, ఈ రెంటినీ కలిపి ఉపయోగించడం వల్ల రక్తంలో చక్కెర మొతాదులు నియంత్రణలో ఉంటాయి. స్వీట్ పొటాటోలు, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్ల దాదాపు ఒకే రీతిలో ఉంటాయి. వాటి గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) తెల్ల పొటాటోల కంటే తక్కువ ఉంటుంది. అంటే, వీటిని తినగానే రక్తంలో గ్లూకోజ్ స్థాయి ఒక్కసారిగా ఎక్కువగా పెరగదు. ఇక దాల్చిన కోవాలో ఇన్సులిన్ వంటి ప్రభావం చూపే రసాయనాలు ఉంటాయి. ఇవి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి, భోజనాల తర్వాత రక్తంలో షుగర్ స్థాయిలలో అధిక ఉత్పత్తిని తగ్గిస్తాయి. కోవా రక్తంలో గ్లూకోజ్‌ను కణాల్లోకి చేర్పించడంలో ఇన్సులిన్ ప్రభావాన్ని బలోపేతం చేస్తుంది. కడుపు నుంచి ఆహారం శీఘ్రంగా విడుదల కాకుండా అడ్డుకుంటుంది. అందువల్ల రక్తంలో గ్లూకోజ్ చేరిక నెమ్మదిస్తుంది. స్వీట్ పొటాటోలు కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు కాబట్టి, తిన్న వెంటనే రక్తంలో షుగర్ స్థాయిలను ఒక్కసారిగా పెంచవు. కోవాలోని కాంపౌండ్లు, స్వీట్ పొటాటోల ఫైబర్ కలసి పనిచేయడం వల్ల, రక్తంలోని షుగర్ స్థాయిల నియంత్రణలో రెండు పదార్థాల కలయిక సమష్టిగా మరింత ఫలితప్రదంగా ఉంటుంది. వీటిని ఉడికించి తినడం మంది. కాల్చి లేదా ఫ్రై చేయడం కంటే, ఈ పద్ధతిలో తినడం వల్ల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. పెరుగు, గోధుమ, వివిధ రకాల గింజలు ఆరోగ్యకరమైన ఫ్యాట్/ప్రోటీన్‌తో కలపడం రక్తంలో షుగర్ స్థాయిలను మరింత స్థిరంగా ఉంచుతుంది. అందుకని రక్తంలో షుగర్ శాతాన్ని నియంత్రించడానికి ఆహారంలో స్వీట్ పొటాటో, కోవాతోపాటు వీటిని కూడా చేర్చడం మంచిది. ఒకవేళ చిలకడదుంప లభించని పక్షంలో, దాల్చిన చెక్కను కలిపి తీసుకోవడం మంచిదని అంటున్నారు.


## వారానికోసారి ప్రక్షాళన



భూమిపై ఉన్న జీవజాలంలో మనిషికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అత్యంత ఆశ్చర్యం కలిగించే అంశాలు ఎన్నో మనిషి శరీరంలో చోటు చేసుకుంటూ ఉంటాయి. అలాంటి ఓ అద్భుతమే పేగుల్లోనూ దాగి ఉంది. పేగు గోడలోని కణజాలం ప్రతి ఐదు నుంచి ఏడు రోజులకోసారి పూర్తిగా నవీకృతం కావడం ఆశ్చర్యకరం. ఇది శరీరంలోని అత్యంత శ్రమాత్మకంగా పనిచేసే భాగాలలో ఒకటి. చాలా సంవత్సరాలుగా శాస్త్రవేత్తలు ఈ పునరుద్ధరణ 'స్టెమ్ సెల్స్' అనే ప్రత్యేక మాస్టర్ సెల్స్ వల్లనే జరుగుతుందని నమ్ముతూ వచ్చారు. అవే కొత్త కణాలను సృష్టిస్తాయని భావించారు. కానీ ఇటీవల నిర్వహించిన పరిశోధనలు మరింత అద్భుతమైన నిజాన్ని వెల్లడించాయి. అవసరమయ్యే సమయాల్లో, ఇప్పటికే ఉన్న సాధారణ, పూర్తిగా పెరిగిన కణాలు తిరిగి స్టెమ్ సెల్లులుగా మారగలవని గుర్తించారు. ఇది ఒక ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు ఒక్కసారిగా ఆ ఫ్యాక్టరీని మళ్లీ రూపకల్పన చేసే ఆర్కిటెక్ట్‌గా మారడంగా చెప్పుకోవచ్చు. ఈ ప్రక్రియ సహజంగా శరీరంలో జరుగుతూ, ఒక జీవసంబంధ రీసెట్ బటన్‌లా పనిచేస్తుంది. అంతర్గతంగా, మన శరీరం లోపల నుండి నిరంతరం మరమ్మతులు చేసుకుంటూ, పునరుత్థానాన్ని సాధిస్తుంది. మనలోని ఈ అద్భుతమైన సంక్లిష్టత, పునరుత్థాన శక్తి మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఈ ప్రయోగ ఫలితం మన శరీరం ఎంత ప్రబలమైనదో, సహజంగా స్వీయ సవరణ శక్తితో నిండినదో గుర్తుచేస్తుంది.

## బ్రహ్మోత్సవాల్లో ప్రజానాట్యమండలి కళాకారులకు చోటివ్వాలి

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల వేదికపై స్థానిక తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులకు ప్రదర్శనలు ఇచ్చే అవకాశం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి కోరారు. ఆదివారం సిపిఐ ప్రతినిధి బృందం దేవస్థానం ఇఒ భవానిశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులు దశాబ్దాలుగా సామాజిక సమస్యలపై ప్రజలను చైతన్యపరుస్తున్నారని కొనియాడారు. బ్రహ్మోత్సవాల వంటి ప్రతిష్టాత్మక వేదికలపై వారికి అవకాశం కల్పిస్తే, సంప్రదాయ కళలకు పునర్వైభవం రావడమే కాకుండా కళాకారులకు సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. యాదగిరిగుట్ట కొండపై నెలకొన్న పలు స్థానిక సమస్యలను, చిరు వ్యాపారుల ఇబ్బందులను ఇఒ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఇఒ భవాని శంకర్ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బోలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, కల్లెం కృష్ణ, చెక్క వెంకటేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎండి ఇమ్రాన్, పేరబోయిన మహేందర్, కల్లేపల్లి మహేందర్, మండల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మునీశ్వర్



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అధ్యక్షతన గ్రామ పంచాయతీ సిబ్బంది ఎఐటియుసిలో చేరిక సందర్భంగా జరిగిన సమావేశంలో మునీశ్వర్ మాట్లాడారు. ఎఐటియుసిలో చేరిన 70మంది గ్రామ పంచాయతీ సిబ్బందికీ అండగా ఉంటామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ చీకటి ప్రకాష్, బట్టు సాంబయ్య, పరికి కోర్నేల్, పరికి రత్నం పాల్గొన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులుగా జన్ను సుదర్శన్, మామిడి పెల్లి సంపత్, అధ్యక్షుడిగా శనిగరం చిరంజీవి, ప్రధానకార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా అంబి రాజు, పాశం యశోద, ముత్యాల రమా, కార్యదర్శులుగా కనకం రాజు, జాటోతు మోహన్ సింగ్, దండెం రాజ్‌కుమార్, కొత్తపల్లి సదానందం, సహాయ కార్యదర్శులుగా డి.పరన్‌సింగ్, గజ్జి స్వప్న, కోశాధికారిగా మామిడి పెల్లి రవి, సభ్యులుగా మాట్ల సునిత కారం శ్రీకాంత్ బూసార అప్పయ్య కనకం కోర్నేలు, చింతక కరుణతో మండల కమిటీని ఎన్నుకున్నారు.

## ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలు



### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టుపార్టీలేనని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్, పడమటి తండా, దారేడు సిపిఐ శాఖ మహాసభలను నిర్వహించారు. తొలుత అరుణ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బాగం మాట్లాడుతూ ఇతర రాజకీయ పార్టీలకు ప్రజా సమస్యలపై పోరాడేతత్వం లేదని విమర్శించారు. పేదల కష్టాలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం గళమెత్తే ఏకైక శక్తి ఎర్రజెండానేనని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల సాధన, సంక్షేమం కోసం సిపిఐ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని బాగం హేమంత్‌రావు సూచించారు. అనంతరం ఆయా శాఖల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కామంచికల్ సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా షేక్‌పాషా, సహాయకార్యదర్శిగా వెంకటకృష్ణ, పడమటితండా సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శిగా శంకర్, సహాయకార్యదర్శిగా నరేష్, దారేడు సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా మీరా, సహాయకార్యదర్శిగా సుమన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, అజ్మీరా రామ్మూర్తి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ సిపిఐ కార్యక్రమానికి స్పందన

### సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** ఇంటింటికీ సిపిఐ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్‌లో ఆదివారం ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంతో సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి పోరాటం చేసేందుకు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకాలను పూర్తిస్థాయిలో అమలు కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతులు ఆదాయం రెట్టింపు చేస్తామని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని చెప్పి పూర్తిగా ప్రజల సంక్షేమాన్ని మరిచారన్నారు. ఉపాధి, విద్య, వైద్యం, కూడు నీడ అందక ప్రజల గందరగోళానికి గురవుతున్నా ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ రంగానికి కొమ్ము కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు పార్టీశ్రేణులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మోతే లింగారెడ్డి, మద్దెల ఎల్లేష్, నేదునూరి రాజమౌళి, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్‌సుందర్ రెడ్డి, మంగ ప్రవీణ్, గోపు బుచ్చిరెడ్డి, సాంబయ్య, రామచందర్, బాబు, కుమారస్వామి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.




# ఆర్‌టిసి రక్షణకే నిరవధిక సమ్మె

### ఎఐటియుసి ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను కాపాడుకోవడంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 22 నుంచి చేపట్టే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి అసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆసిఫాబాద్ డిపోలో జెఎసి ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు అశోక్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 22వ తేదీ మొదటి డ్యూటీ నుంచే కార్మికులందరూ స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను రెండేళ్లు గడిచినా అమలు చేయకపోవడంతోనే ఈ పోరాటం చేయాల్సి వస్తుందని, ఇది జీతాల కోసం కాకుండా 45 వేల కార్మిక కుటుంబాల బతుకుదెరువు కోసమని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవకపోతే ఒక్క బస్సు కూడా డిపో నుండి బయటకు రాదని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆర్‌టిసి ఉద్యోగులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు 2025 వేతన సవరణను అమలు చేయాలని



డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి సంస్థకు ఇవ్వాలని, ఆర్‌టిసి ఆస్తుల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు దివాకర్, లక్ష్మణ్, సాంబశివరావు, మధుకర్, తులసిరామ్, శంకర్, కృష్ణ, నారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

### సమ్మె విజయవంతం చేయండి

**మంచిర్యాల :** ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22 నుండి చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల ఆర్‌టిసి డిపో గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, 2025 వేతన సవరణ బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించి సమ్మె నివారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు కలిందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌలు, ముస్కె సమ్మయ్య, బాజీ సైదా, లింగయ్య, కిషన్‌రావు, పోషయ్య, లక్ష్మయ్య, శ్రీనివాస్, రాజేశం, తిరుపతి, జ్యోతి, అనుష, ప్రభావతి పాల్గొన్నారు.



## చిరు వ్యాపారులకు అండగా మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : చిరు వ్యాపారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అండగా నిలిచారని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను కోల్పోయిన 46, 47 డివిజన్లకు సంబంధించిన చిరు వ్యాపారులకు షాపుల అధికారిక పత్రాలను మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో షాపులు కోల్పోయిన వారికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సొసైటీ మాజీ అధ్యక్షులు తుపాకుల యలగొండస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేరు ఎస్‌హెచ్‌ఒగా వెంకటేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాపక్షం/పెబ్బేరుః పెబ్బేరు మండల స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా వెంకటేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, బైకు, కారు వాహనదారులు హెల్మెట్ , సీటు బెల్ట్ ధరించాలని, ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా బాధితులు నేరుగా తనని కలవవచ్చని మధ్యవర్తులను ఆశ్రయించొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మేడే స్ఫూర్తితో ఎనిమిది గంటల పని విధానానికి పోరాడాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మేడే స్ఫూర్తితో కార్మికులు హక్కుగా పొందిన ఎనిమిది గంటల పని విధానానికి పోరాడాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో 141వ మేడే గోడ ప్రతులను ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లైమెంట్‌తో కలిసి శింగు నర్సింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శింగు నర్సింహారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల హననం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా కార్మిక హక్కులు కనుమరుగవుతున్నాయన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిన తర్వాత కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కార్మికులకు హక్కులుగా ఏ చట్టాన్ని కూడా ఏ ప్రభుత్వం దయతో, ఇష్టంతో చేయలేదని ఆ చట్టాలన్ని తమ రక్తాన్ని చిందించి కార్మికులు పోరాడి సాధించుకున్నారన్నారు. అటువంటి చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు రావాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. నిజంగా మోడీకి కార్మికులపై ప్రేమ ఉంటే వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉన్న కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కానీ కార్మికుల హక్కులను కాలరాస్తూ యాజమాన్యానికి అనుగుణంగా ఉండే లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చారన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో కార్మికుల కోసం ఖర్చు చేసింది ఏమి లేదని కానీ కార్పొరేటర్ శక్తులకు లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారన్నారు. ఎంపి జీతాలు పెంచిన నరేంద్ర మోడీ కార్మికుల కనీస వేతనం రోజుకు రూ. 70లకు కుదించడం దారుణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికుల ఉపాధి కొరకు ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కూడా మోడీ సీత కన్ను వేశారని దానిని నిర్వీర్యం చేసేందుకు ప్రతియేటా నిధులు తగ్గిస్తూ పని దినాలను తగ్గించారన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజీల్, గ్యాస్ ధరల పెరుగుదల కారణంగా రవాణా రంగంలోని కార్మికులు తీవ్ర నష్టానికి గురవుతున్నారని నెల వారి కిస్తీలు కట్టలేక, వేరే పని చేసుకోలేక రవాణా రంగంలోని కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు.నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసంఘటిత రంగమే కాకుండా సంఘటిత రంగంలోని కార్మికులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులు సాధించుకున్న హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, మహిళా సమాఖ్య నాయకురాలు పోటు కళావతి, ఉపాధ్యక్షులు ఎండి జాకీరుద్దీన్, కోశాధికారి షేక్ ఇబ్రహీం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యలో అశాస్త్రీయమైన కోర్సులు తొలగించాలి

జెవివి విద్యా సదస్సులో వక్తలు డిమాండ్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఉన్నత విద్యలో అశాస్త్రీయమైన కోర్సులు ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా తొలగించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఖమ్మం డిపిఆర్‌సి భవన్‌లో జెవివి రాష్ట్ర అధ్యక్షులు చెలిమల రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన విద్యా సదస్సులో ఎన్‌ఈపి 2020 ఉన్నత విద్య తీరు తెన్నుల అంశంపై ప్రముఖ విశ్లేషకులు డా॥ అందె సత్యం, ఎన్‌సిఎఫ్ 2023 పాఠ్యాంశాల్లో మార్పులు అంశంపై విశ్రాంత ఆచార్యులు కోయ కోటేశ్వరరావు , తెలంగాణ పాఠశాల విద్య సవాళ్లు అనే అంశంపై సొసైటీ ఫర్ ఛైంజింగ్ ఎడ్యుకేషణ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎడమ శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశ్వ విద్యాలయాలే స్వయంగా నిధులు సమకూర్చుని నడపడం వల్ల వాటిలో కేవలం ధనిక విద్యార్థులు మాత్రమే అభ్యసించగలుగుతారని ఇది సరైన విధానం కాదన్నారు. గ్రేడింగ్ సిస్టం ద్వారా డిగ్రీని నాలుగేళ్లు చదవాల్సిన అవసరం ఉండదని దీని వల్ల డిగ్రీ చదివే వారి సంఖ్య తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతం, పిరియాడిక్ , జెనటిక్స్ వంటి బేసిక్స్ సైన్స్ పాఠాలు తీసివేయడం, చరిత్రలో మధ్య యుగాల నాటి ముస్లిం చరిత్రను పూర్తిగా తొలగించడం, అశాస్త్రీయమైన అంశాలను, రుజువు కాని అంశాలను చేర్చడం వంటి మార్పులు తీసుకు వచ్చారన్నారు. దేశంలో ఇప్పటికీ 34 కోట్ల మంది నిరక్షరాస్యులుగా ఉన్నారని వీరిని అక్షరాస్యులుగా చేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం లేదన్నారు. ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ పిల్లల మనో వికాసాన్ని పెంచేలా ఉండేలా తప్ప చదువు అనే అంశాన్ని ఆ స్థాయిలో ఉంచవద్దన్నారు. ఇంటర్ స్థాయిలో పోటీతత్వం వల్ల స్పర్థలు పెరిగి ఒకరిపై ఒకరికి ద్వేషభావం పెరిగే అవకాశం ఉందన్నారు. విద్యా సదస్సులో పలు ప్రతిపాదనలు చేశారు. బాల్య దశ నుంచి ఉన్నత విద్య వరకు అందరికి ఉచిత విద్య, నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించాలని, విద్యలో ప్రైవేటీకరణ, వ్యాపారీకరణను నిలిపివేయాలని, జిడిపిలో కనీసం ఆరు శాతం నిధులు కేటాయించాలని, ఎన్‌ఈపి 2020 రద్దు చేసి రాష్ట్ర హక్కులను పరిరక్షించాలని, ఉపాధ్యాయులపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించి ఉపాధ్యాయుల నియామకాలు పెంచాలన్నారు. సమాజ ఆధారిత అక్షరాస్యత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు శివన్నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్‌వి రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణశ్రీ, జెవి వి గౌరవాధ్యక్షులు మల్లెంపాటి వీరభద్రరావు, వంజాకు లక్ష్మి నారాయణ, జిల్లా అధ్యక్షులు వి. మోహన్, ప్రధాన కార్యదర్శి కె. రామారావు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు
ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తాం
రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/పానుగల్ః తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నెరవేర్చడం జరుగుతుందని, ప్రజా రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం పానుగల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు కావడంతో భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ప్రజా శ్రేయస్సు కోసం ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులందరికి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కల్యాణలక్ష్మి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని, ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేయాలన్నారు. పిల్లలను చెడు వ్యసనాలకు అలవాటు కానివ్వొద్దని, కష్టపడి చదివించాలని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో గోవిందరావు, డిఈ అబ్దుల్ హుస్సేన్, ఏఈ కవి రెడ్డి, గ్రామ సర్పంచు నాగలక్ష్మి , మాజీ ఎంపీపీ వెంకటేశ్ నాయుడు, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, రాము యాదవ్, బ్రహ్మం, జయరాములు, సాగర్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భారీగా రేషన్ బియ్యం పట్టివేత

నారాయణపేట సిఐ శివశంకర్



ప్రజాపక్షం/నారాయణపేట : నారాయణపేట జిల్లా దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలోని విఠలాపూర్ గ్రామ శివారులో పాడుబడిన ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు వచ్చిన పక్కా సమాచారంతో నారాయణపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో దామరగిద్ద ఎస్‌ఐ రాజు, డిటి ఆనంద్, సిబ్బంది శనివారం రాత్రి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 510 బస్తాలు (238 క్వింటాళ్లు) రేషన్ బియ్యం, ఒక డిసిఎం వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఈ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడిఎస్) బియ్యం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తికి సంబంధించిందిగా గుర్తించారు. అతను గత కొన్ని రోజులుగా దౌల్తాబాద్ మండల పరిధిలోని గ్రామాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి ఇక్కడ దాచి కర్ణాటక రాష్ట్రంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యం , వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించి, డిటి పంచనామా పూర్తి చేసిన అనంతరం వెంకటేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు దామరగిద్ద ఎస్సై రాజు వెల్లడించారు.

## నేడు రైతు భరోసా రెండో విడత అవగాహన సదస్సులు

ప్రజాపక్షం/గద్వాల రూరల్ః జిల్లాలోని రైతులందరికీ ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నేరుగా అందించడమే లక్ష్యంగా నేడు మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి రెండో విడత రైతు భరోసా నిధులను బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమాన్ని రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుందన్నారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, సాయిల్ హెల్త్ వాలంటీర్ల ద్వారా రైతులకు అందే సేవలపై ప్రత్యక్ష అవగాహన సదస్సులు నిర్వహించబడుతుందన్నారు. రైతుల సమగ్ర సమాచారం, డిజిటల్ గుర్తింపు , ప్రభుత్వ పథకాలు సులభంగా పొందేందుకు ఉపయోగపడే అగ్రి స్టాక్ ఫార్మర్స్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియపై రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్నదాతలందరూ తమ సమీపంలోని రైతు వేదికల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిందిగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజ్ఞప్తి చేశారు.

# మిడ్జిల్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

మొక్కజొన్నలకు న్యాయమైన ధరలు అందేలా చర్యలు
కొనుగోలు కేంద్రం మంజూరు చేసిన
మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కి ధన్యవాదాలు
ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



ప్రజాపక్షం/ జడ్చర్ల : జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండల కేంద్రంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. ఆదివారం నాడు మధ్యాహ్నం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన మొక్కజొన్నలను సరైన ధర అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల ఇబ్బందులు లేకుండా రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు మద్దతుగా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగిస్తామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అడిగిన వెంటనే కొనుగోలు కేంద్రం మంజూరు చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పిఎస్‌ఎస్ సభ్యులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు విశిష్ట గుర్తింపు కార్డుల నమోదు తప్పనిసరి



ప్రజాపక్షం/వీపనగండ్ల : వీపనగండ్ల మండలంలో రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు మరింత పారదర్శకంగా, వేగంగా అందించేందుకు విశిష్ట రైతు గుర్తింపు కార్డు (యూనిక్ ఐడి) విధానాన్ని అమలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు రైతులు తప్పనిసరిగా 11 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి డాకేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఈ గుర్తింపు కార్డు ద్వారా రైతుల పంట సాగు వివరాలు, భూ సమాచారం, పంటల రికార్డులు అన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా అకాల వర్షాలు ప్రకృతి విపత్తుల సమయంలో నష్టాలను అంచనా వేయడం సులభమవుతుందని అన్నారు. ఇకపై కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్, పంటల బీమా వంటి పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే ఈ విశిష్ట గుర్తింపు కార్డు నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. రైతులు తమ ఆధార్‌కార్డు మరియు ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో సమీప వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని మొత్తం 13,387 మంది రైతుల్లో ఇప్పటివరకు 10,110 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని వెల్లడించారు. ఇంకా 3277 మంది రైతులు నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో నమోదు చేయని రైతులు వెంటనే ముందుకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## అమ్మాయిపల్లిలో చలివేంద్రం ఏర్పాటు



ప్రజాపక్షం/చిన్నంబావిః అమ్మాయి పల్లి గ్రామ బస్ స్టేషన్ ప్రయాణ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్ వేసవి కాలన్ని దృష్టిలో ఉంచుకొని రహదారి గుండా వెళ్లే ప్రయాణికులకు, గ్రామ బస్టాండ్ లో సేదదీరే ప్రజలకు దాహం తీర్చుకొనుటకు గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్ తన సొంత ఖర్చులతో త్రాగునీరు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ కవి ఆచార్య డాగోజీ రావు కన్నుమూత



ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ : ప్రముఖ కవి విశ్రాంత ఆచార్యులు కమలేకర్ డాగోజీరావు ఆదివారం ఉదయం పరమపదించారు. డాగోజీ రావు రచించిన ఆధ్యాత్మిక రచనలతో బాల సాహిత్య రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. కళాశాల స్థాయి నుండి రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన డాగోజీ రావు ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అంచలంచెలుగా డిగ్రీ కళాశాల అధ్యాపకునిగా పనిచేశారు. హిందీ ఆచార్యునిగా పనిచేసినప్పటికీ తెలుగు సాహిత్యంపై పట్టు సాధించి అనేక రచనలు చేసి గుర్తింపు పొందారు. దాశరథి రంగాచార్యులు గడియారం రామకృష్ణ , శర్మసి, నారాయణ రెడ్డి, ఎల్లూరు శివారెడ్డి, కసిరెడ్డి, వెంకటరెడ్డి, నందిని సిద్దారెడ్డి, డాక్టర్ మసన చెన్నప్ప, వంటి ప్రముఖ కవులు పాల్గొన్న సాహిత్య సభల్లో పాల్గొని సన్మానాలు అందుకున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత హిందీ కళాశాల ఆచార్యునిగా ప్రిన్సిపాల్ గా పనిచేస్తూ ఎంతోమంది భాషోపాధ్యాయులుగా రాణించేందుకు ప్రేరణ కలిగించారు. వీరి శిష్యులు ఎంతమంది ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ భాషా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరి మృతి పట్ల ఉమ్మడి జిల్లా సాహిత్య సంస్థలు సంతాపం ప్రకటిచాయి. జిల్లా ఒక మహాకవిని కోల్పోయిందని పేర్కొన్నాయి.

# ప్రజలు చెయిన్ సిస్టమ్ వ్యాపారాల జోలికి వెళ్లొద్దు

మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
జిల్లా ఎస్‌పి డా.వినీత్



ప్రజాపక్షం/నారాయణపేట : ప్రజల సొమ్ము దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజు, రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు. మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి డా.వినీత్ ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు. గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టీ లెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి. మీ కింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి. అనే వాటిని నమ్మవద్దు అని ఎస్‌పి అ న్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆ ర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే, రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు. సైబర్ మోసగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ నేరగాళ్లు మల్టీ లెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీలెవెల్ మార్కెటింగ్‌ను చాలా మంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలుతో పాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారని ఎ లాంటి మాయమాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలిపారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదం టే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు. అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి. ఆ తర్వాత చేరిన వా రంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్‌వర్క్‌లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్లవద్దు. సో షల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉం డాలి. అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్‌లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై , ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండని ఎస్పీ తెలిపారు.

# మహిళా బిల్లు పేరుతో బిజెపి రాజకీయం

బిల్లులో ఓబిసి కోటా అమలు చేయాలి
డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్



ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ : మహిళా బిల్లు పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయం చేస్తున్నదని డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని బిజెపి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహిళా సాధికారిత కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేసినట్టు తెలిపారు. మాజ.ఈ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ పంచాయితీ రాజ్ చట్టం తీసుకొచ్చి మహిళలకు భాగస్వామ్యం కల్పించినట్లు తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. డీలిమిటేషన్ బిల్లును మహిళా బిల్లుతో ముడిపెట్టడం సరికాదన్నారు. ఇప్పుడున్న 543 పార్లమెంట్ స్థానాలకు అనుగుణంగా మహిళా రిజర్వేషన్ బిల్లు పెడితే కాంగ్రెస్ పార్టీ మద్దత ఇస్తుందన్నారు. మహిళా బిల్లులో ఓబీసీ కోటా ఉండాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. టీపీసికి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ మాట్లాడుతూ మహిళా బిల్లు పేరుతో ప్రతిపక్ష ఇండియా బిజెపి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. తమిళనాడు, బెంగాల్ ఎన్నికల్లో లబ్ధిపొందడానికి బీజేపీ ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని విమర్శించారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ డీలిమిటేషన్ వల్ల దక్షిణాది, ఈషాన్య రాష్ట్రాలకు నష్టం జరుగుతున్న విషయాన్ని ఎఐసిసి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి పలు సార్లు చెప్పడం జరిగిందన్నారు. మహిళలను మోసం చేసే విధంగా బిజెపి ప్రభుత్వం బిల్లు పై రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటు పై బిజెపి ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని అన్నారు. సమావేశంలో నాయకులు చంద్రకుమార్ గౌడ్. సీజే బెనహర్, రాము యాదవ్, ఫయాజ్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలో బంజారా సేవా సంఘం అభినందన సభ



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ః వనపర్తి జిల్లా కేంద్రంలో బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ప్రజాప్రతినిధులు అభినందన సభ అత్యంత వైభవంగా జరిగింది.ఆదివారం స్థానిక ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న పి.ఎ.ఆర్ బ్యాంకెట్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు కౌన్సిలర్లు నిర్వహించిన ఈ కార్యక్రమం గిరిజనుల ఐక్యతను చాటి చెప్పింది.బంజారా సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కిషన్ బంజారా అధ్యక్షతన జరిగిన ఈ సభకు డిసిఆర్‌బి అడిషనల్ ఎస్‌పి బాలాజీ నాయక్ , ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం,శక్రు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ గిరిజన జాతి అభివృద్ధి చెందాలంటే అందరూ రాజకీయాలకు అతీతంగా ఒకటే మాట ఒకటే బాట అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గిరిజన హక్కుల పరిరక్షణకు సామాజిక ఐక్యతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా నూతనంగా గెలుపొందిన గిరిజన సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లను సంఘం ప్రతినిధులు పూలమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని గ్రామాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ నాయక్, మాజీ జడ్పీటీసీ, ధర్మ నాయక్, గిరిజన సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మూడవత్ చంద్రు నాయక్, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శంకర్ నాయక్, గిరిజన విద్యార్థి విభాగం జాతీయ ఇంచార్జ్ రాజ్ కుమార్ బంజారా, రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్, సీనియర్ నాయకులు, చంద్రశేఖర్ నాయక్, జాతర నాయక్, రవి నాయక్, అడ్వకేట్ చందు నాయక్, అర్జున్ నాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఘన సన్మానం

ప్రజాపక్షం/మక్తల్ : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మక్తల్ పట్టణంలోని రాయచూర్ రోడ్డులో గల వాసవి దేవాలయం నందు ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సరంలో ప్రతిభా కనపరిచి అత్యధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వల ప్రసన్న కిషోర్, ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల నందిని, కోశాధికారి తాళం పల్లి రవలి, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షులు కొత్త మీరాబాయి మహిళా సంఘం అధ్యక్షులు బౌరీశెట్టి పద్మ మనసాని సరళ, క్లబ్ సభ్యులు ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు స్వర్ణభారతి ట్రస్టు సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/కోదాడ:** నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా స్వర్ణభారతి ట్రస్టు చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. హైదరాబాద్ శ్రీకర ఆసుపత్రి నిపుణులు ఆర్థోపెడిక్ సేవలు అందించగా, సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు ఇరువురు కలిసి 485 మంది రోగులకు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఖరీదైన వైద్యాన్ని పేదలకు అందించడం గొప్ప విషయమని అందుకుగానూ ఎంతో సేవ చేస్తున్న ట్రస్టు సభ్యులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడిమర్రినర్సింహారావు, నీలా సత్యనారాయణ, చారుగండ్ల ప్రవీణ రాజశేఖర్, ఓరుగంటి కిట్టు, చీదెళ్ల హనుమంతరావు, దేవరశెట్టి శంకర్‌రావు, నాగుబండి పురుషోత్తం, విద్యాసాగర్, వెంపటి వెంకట రమణ, వంగవీటి రంగారావు పాల్గొన్నారు.


## డీలిమిటేషన్ బిల్లు మీద ఉన్న ప్రేమ బిసి రిజర్వేషన్లపై ఏది?



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** డి లిమిటేషన్ బిల్లు మీద ఉన్న ప్రేమ బీసీ రిజర్వేషన్ల బిల్లు పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదికి లేకపోవడం బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆదివారం అన్నారు. ప్రధాని మోడి డి లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోగానే జాతినుద్దేశించి మహిళల కలలను చిదిమేశారని పేర్కొనడం బాధాకరమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటివరకు జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు రాజకీయంగా అణిచివేతకు గురవుతుంటే కనిపించట్లేదా అని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలని ఉద్యమిస్తుంటే అవేమీ పట్టించుకోకుండా డి లిమిటేషన్ బిల్లు తెస్తున్నారని, దాని మీద ఉన్న ప్రేమ బీసీలకు లేదన్నారు. బీసీలు రాజకీయంగా అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని, మళ్లీ ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు తెచ్చి ఎవరికి లాభం చేకూరుస్తారని అన్నారు. 1000 పార్లమెంట్ సీట్లు పెంచి మహిళా రిజర్వేషన్లు ఇవ్వండి కాని అందులో మా బీసీల వాటా తేల్చండన్నారు.

## మహిళా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు

డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ గాని, ఇండియా కూటమి గాని వ్యతిరేకం కాదని డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలను దెబ్బతీసే డిలిమిటేషన్ బిల్లుకు మాత్రమే కేవలం కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి వ్యతిరేకమన్నారు. కాంగ్రెస్, మిత్రపక్షాలపై బురద జల్లేందుకే బిజెపి డిలిమిటేషన్‌తోపాటు మహిళా బిల్లును ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. మహిళా బిల్లు వీగిపోవడానికి బిజెపి కుట్రపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి మహిళలకు పూర్తి వ్యతిరేకమన్నారు. 2023లోనే ఈ బిల్లు పాస్ అయిందన్నారు. అయినప్పటికీ 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి మహిళా రిజర్వేషన్లను అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, కానీ బిసి మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారని అందుకు బిజెపి ఒప్పుకోలేదని వివరించారు. ఈ సమావేశంలో నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్‌అలీ, షఫీఉల్లా, కమ్మరికుంట్ల వేణుగోపాల్, కక్కిరేణి శ్రీనివాస్, వీరన్న నాయక్, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు దోహదం

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బాలెంల గ్రామంలో మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ బొజ్జ సంధ్య రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల కోసం ఉచిత టైలరింగ్ 45 రోజుల శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడానికి టైలరింగ్ వంటి ఉపాధి ఆధారిత శిక్షణలు అవసరమన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందడమే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితులను కూడా మెరుగుపరుస్తాయని తెలిపారు. ఈ శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంస్థ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## వడదెబ్బతో ఒకరి మృతి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ కాలనీకి చెందిన గడ్డం గురవయ్య (80) ఆదివారం వడదెబ్బతో మృతి చెందారు. గత ఐదు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగి విపరీతమైన ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురవయ్య ఎండ వేడిమికి తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# సూర్యాపేట కాంగ్రెస్‌లో 'త్రి'మూర్తులు

## నియోజకవర్గంలో ఎవరికి వారే యమునా తీరే



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కలహాల కాంగ్రెస్‌గా ముద్ర ఉన్న సూర్యాపేట కాంగ్రెస్‌లో రెండుగా ఉన్న గ్రూపులు కాస్తా మూడుగా అయ్యాయి. గతంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి బ్రతికి ఉన్నంత కాలం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మధ్య విభేదాలు ఉండడంతో నియోజక వర్గంలో పార్టీ రెండుగా చీలింది. మున్సిపల్ ఎన్నికల ముందు పార్టీ అధిష్టానం సూచనతో దామోదర్ రెడ్డి తనయుడు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పటేల్ రమేష్ రెడ్డిలు ఐక్యరాగం అందుకున్నా కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకుంటూ ముందుకు సాగుతున్న పరిస్థితి. ఇదిలాఉంటే తాజాగా మరో గ్రూపు పుట్టుకొచ్చింది. మొదటి నుండి ఒక్కటిగా ఉన్న సర్వోత్తమ్ రెడ్డికి, పార్టీ సీనియర్ నాయకులు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వేణారెడ్డి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇది కాస్త రోజురోజుకు ఎక్కువై రాజకీయ ఆదిపత్యానికి దారి తీసి మూడో గ్రూపు తయారైంది. సూర్యాపేట నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి కంచుకోటగా ఉంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కొంత మార్పు వచ్చినా నాయకుల మధ్య ఉన్న వర్గ విభేదాలతో 2014 ఎన్నికల నుండి మొదలకొని నేటి వరకు జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసిన దామోదర్ రెడ్డి ఓటమి చవిచూశారు. ఎన్నికలు రాగానే గెలుపు ఓటములపై విశ్లేషించే రాజకీయ విజ్ఞులు సైతం కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన వారిని ఎవరూ ఓడించాల్సిన అవసరంలేదు. వారికి వారే ఓడించుకుంటారు అని బహిరంగంగానే బల్లా గుద్ది చెబుతూ వస్తున్నారు. ఫలితాల వెల్లడి తర్వాత వీరి విశ్లేషణ 100కు వెయ్యి శాతం కరెక్టని సామాన్య ఓటర్ కూడా చెబుతున్న పరిస్థితి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సూర్యాపేట నియోజక వర్గ పార్టీ ఇంచార్జిగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వ్యవహరించారు. ఆయన మరణానంతరం పార్టీ ఇంచార్జి ఎవరన్నది అధిష్టానం ప్రకటించకుండా తాత్సారం చేయడంతో పార్టీకి పెద్దదిక్కు లేకుండా అయ్యింది. దీనితో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఇంచార్జి పదవి కోసం పోటీపడుతున్నారు. ఖాళీగా ఉన్న ఈ పదవిని ఆరు నెలలు అవుతున్నా నేటికి భర్తీ చేయకపోవడంతో ఎవరికి వారు అధిష్టానం దృష్టిని ఆకర్షించేలా పార్టీ కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. అలాగే ఇటీవల కాలంలో వరుసగా వచ్చిన గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల్లో ఎవరికి వారు పార్టీ నుండి పోటీ చేసిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసి తమ ప్రతిభను చాటుకున్నారు.

**మున్సిపల్ ఎన్నికల ముందు నుండే మూడో గ్రూపు...**

సూర్యాపేట నియోజక వర్గంలో రెండు గ్రూపులుగా ఉన్న కాంగ్రెస్‌లో మున్సిపల్ ఎన్నికల ముందు నుండే మూడో గ్రూపు ఏర్పడింది. సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు కూడా అలాగే జరిగిందన్నది అక్షర సత్యం. దామోదర్ రెడ్డికి కుడిభుజంగా 40 సంవత్సరాలుగా కొనసాగిన కొప్పుల వేణారెడ్డికి తనకు అనుచరగనం ఎక్కువగానే ఉంది. ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సర్వేలు నిర్వహించినా అవి పక్కకు పెట్టి తమ అనుచరులకు టిక్కెట్లు వచ్చేలా పంపకాలు చేసుకున్న పరిస్థితి. ఈ మూడు గ్రూపులు ఒక్కటై మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేసినా...వీరి మధ్య ఉన్న విభేదాల వాసన పోకపోవడం గమనార్హం. పటేల్ రమేష్‌రెడ్డితో ఉన్న విభేదాలు కాస్త సర్దుమనిగినా సర్వోత్తమ్ రెడ్డి, వేణారెడ్డిల మధ్య మాత్రం రోజు రోజుకు ఎక్కువై వీరి మధ్య దూరం పెరుగుతుంది. నియోజకవర్గంలో ఎవరి కార్యక్రమాలు వారు చేసుకుంటూ పోతున్నారు.

**వేణారెడ్డి పుట్టిన రోజు వేడుకలకు ఆయన అభిమానులు సన్నద్ధం**

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి జన్మదినం ఈనెల 22న ఉండడంతో ఆయన అభిమానాలు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 5వ తేదీన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. దీనికి ధీటుగా వేణారెడ్డి అభిమానాలు పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని పట్టుదలతో ఉన్నట్లు సమాచారం.

**తలలు పట్టుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు!**

మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మరణానంతరం జరిగిన గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తా చాటడంతో ఉత్సాహంగా ఉన్న పార్టీ శ్రేణులు గ్రూపు రాజకీయాలతో నిరుత్సాహానికి లోనయ్యారు. తమ అభిమాన నాయకుల కోసం ఫ్లెక్సీల ఏర్పాటు, కార్యక్రమాలలో పాల్గొనడం లాంటివి చేయడం రాజకీయాల్లో ఆనవాయితి. కాగా నేతలు విడిపోయి ఎవరికి వారు కార్యక్రమాలు చేసుకుంటూ పోవడంతో ఎవరి వద్దకు వెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కరవమంటే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపంలా పార్టీశ్రేణుల పరిస్థితి ఉంది. ఆయా పనుల కోసం వెళ్లేవారు కూడా ఎటు పోవాలో తెలియక సతమతమవుతున్నారు. ప్రభుత్వ అధికారులు సైతం పనుల కోసం నేతలు ఫోన్ చేస్తే ఎవరిది చేయాలో ఎవరిది చేయవద్దో అంతుచిక్కక అడకత్తెరలో పోక పెట్టి ఒత్తినప్పుడు అది ఎలా నలిగిపోతుందో వీరి పరిస్థితి అలానే ఉంది. ఇప్పటికైన పార్టీ అధిష్టానం సూర్యాపేట నియోజక వర్గానికి ఇంచార్జి ఎవరన్నది ప్రకటిస్తే ఈ గ్రూపు రాజకీయాలకు పులిస్టాప్ పడుతుందని రాజకీయ విజ్ఞులు వ్యాఖ్యానిస్తున్నారు.

# మహిళా బిల్లు ముసుగులో బిజెపి కుట్ర


ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మహిళా రిజర్వేషన్ బిల్లు పేరిట దేశ సమాఖ్య స్వరూపాన్ని ఛిన్నాభిన్నం చేయాలని చూస్తున్న కేంద్రంలోని మోదీ, అమిత్ షా ద్వయం కుట్రలను కాంగ్రెస్ పార్టీ సమర్థవంతంగా తిప్పికొట్టిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ధ్వజమెత్తారు. యాదగిరిగుట్టలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ ద్వంద్వ నీతిని ఎండగట్టారు. పార్లమెంట్లో బిల్లు నెగ్గితే తమ గొప్పగా చాటుకోవాలని, విఫలమైతే ప్రతిపక్షాలపై బురద చల్లాలని చూసిన బీజేపీ ఎత్తుగడలను రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పటాపంచలు చేసిందని ఆరోపించారు. గతంలో నల్ల చట్టాలతో రైతులపై కక్షగట్టిన బీజేపీకి పట్టిన గతే ఈ బిల్లు విషయంలోనూ పునరావృతమైందని, దక్షిణాది రాష్ట్రాల హక్కుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పోరాటం అభినందనీయమని కొనియాడారు. రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేసి బలహీన వర్గాల నడ్డి విరవాలన్నది బీజేపీ అసలు ఉద్దేశమని, కానీ రాహుల్ గాంధీ అండగా ఉన్నంత వరకు ఆ ఆటలు సాగవని హెచ్చరించారు. నిజంగా మహిళలపై ప్రేమ ఉంటే ప్రస్తుతం ఉన్న 543 సీట్లతోనే రిజర్వేషన్లు అమలు చేయాలని, డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూడటం మహిళా లోకాన్ని వంచించడమేనని అయిలయ్య విమర్శించారు. రాజకీయ ఎత్తుగడల కోసం మహిళలను పావులుగా వాడుకుంటున్నందుకు బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిల్లు ఆమోదం పొందకపోయినా తమకు నష్టం లేదని ప్రధాని మోదీ అనడం వారి చిత్తశుద్ధి లేమికి నిదర్శనమని, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించే ఏ ప్రయత్నాన్నైనా ప్రజలు తిప్పికొడతారని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, చిన్న రాష్ట్రాల హక్కులను కాపాడటంలో 'ఇండియా' కూటమి ఒక రక్షణ కవచంలా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వాణి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి హేమెంధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ భూదాత స్ఫూర్తితో ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా చిత్తశుద్ధితో కృషి

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రథమ భూదాత వెదిరే రామచంద్రా రెడ్డి స్ఫూర్తితో ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎలుగెత్తి చెప్పారు. పోచంపల్లిలో భూదాన వజ్రోత్సవంలో భాగంగా శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన వెదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు హాజరయ్యారు. విగ్రహ ఆవిష్కరణ చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.వెదిరే రామచంద్రారెడ్డి సేవాసమితి, సర్వోదయ మండలి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మండలి చైర్మన్, టిపిసిసి చైర్మన్ తో కలిసి వినోబా మందిరంలో శాంతి యజ్ఞం నిర్వహించి టూరిజం పార్కులో గల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భూదానోద్యమ స్ఫూర్తిని కొనసాగించవలసిన అవసరం అందరికీ ఉందని బాధ్యతగా ఆ మహనీయుల ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. కేంద్రంలో బిజెపి పార్టీ ప్రవేశపెట్టిన రెండు బిల్లులను వ్యతిరేకించి విజయం సాధించిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన కృషి ఫలించిందని అభినందనలు తెలిపారు. భూదానోద్యమం పోచంపల్లి నుండి శ్రీకారం చుట్టడం ఆ తర్వాత మహోద్యమంగా మారి భూదాన గంగోత్రిగా అవతరించి 44లక్షల ఎకరాలు సేకరించిందని 75 సంవత్సరాల వజ్రోత్సవంలో అందరూ పాలుపంచుకోవడం గొప్పగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.ప్రప్రథమంగా 100 ఎకరాలు భూమి దానం చేసి దేశ రాజకీయ చరిత్రను మార్చిన ఉద్యమం భూదానోద్యమమని అఖిలభారత సర్వోదయ మండలి అధ్యక్షులు వెదిరే అరవింద్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు తలుపునూరి కృష్ణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, జిల్లా కలెక్టర్ భాస్కరరావు, కౌన్సిలర్స్ కొండమడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య, దేవరాయ కుమార్ సూరేపల్లి, రాధిక రమేష్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## యుద్ధప్రతిపాదికన ఇరిగేషన్ పనులు

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నియోజకవర్గ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేసి,రైతులకు సకాలంలో నీరందించడంపై దృష్టి సారించాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా బ్రహ్మణవెల్లంల ప్రాజెక్టు, అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకున్నారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పనుల్లో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. పనులను వేగంగా పూర్తి చేయడమే కాకుండా, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాగు కాలంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈసమావేశంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న,పన్నాల శ్రీనివాస్ రెడ్డి,ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరుపాల్గొన్నారు.





## మహిళల పక్షపాతి కాంగ్రెస్

డిసిసి అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళా సాధికారత ఆర్థిక రాజకీయ సమానత్వానికి పాటుపడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని నల్లగొండ డిసిసి అధ్యక్షులు పున్నా కైలాష్ నేత అన్నారు.ఆదివారం పట్టణంలోని యాదవ సంఘం భవన్లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ తొలి ప్రధాని ఇందిరా గాంధీ అని ఆమె నాయకత్వంలో భారతదేశం ప్రగతి పథంలో వచ్చిందన్నారు. సోనియా గాంధీ యూపీఏ చైర్‌పర్సన్ గా దేశంలో ఉండబడే బిసి,ఎస్‌సి,ఎస్‌టి మైనార్టీల అభివృద్ధికై అనేక సంస్కరణలు చేపట్టిన ధీశాలి అని కొనియాడారు. 40 సంవత్సరాల నుంచి ఉన్న బిజెపిలో ఒక్కరైనా అధ్యక్షులు మహిళలను చేశారా..? జాతీయ పార్లమెంటు కమిటీలో మహిళలు ఉన్నారా నేడు 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపిలో ఎంతమంది మహిళలు ఉన్నారని ప్రశ్నించారు. నేడు పార్లమెంటులో కుట్రపూరితంగా మోడీ ప్రవేశపెట్టిన బిల్లు విగిపోవడానికి బిజెపి ఫాసిస్టు విధానాలు కారణమన్నారు డీలిమిటేషన్ లో మహిళల బిల్లులను తీసుకురావడం పెద్ద కుట్రగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఓబిసిసెల్ చైర్మన్ జిల్లపల్లి పరమేష్ ,రవీందర్ రెడ్డి, తోటకూరి పరుశురాములు, ముంతాజ్ అలీ,చర్లపల్లి గౌతం పగిళ్ల రాజు,రవితేజ, సాగర్ రెడ్డి, వేముల గోపీనాథ్,అశోక్, ఇంధనూరి శీను,పరశురాం, చకిలం ఫణి కుమార్ ,శ్రీను నాగార్జున గౌడ్ పాల్గొన్నారు.



## రేవంత్ పోవాలి..కెసిఆర్ రావాలి

రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలలో ఒకటే మాట

మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రజాపక్షం/నల్లగొండ(గుర్రంపోడ్) :** రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఒక్కటే మాట చెబుతున్నారని, రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలి అనే నినాదం బలంగా వినిపిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గుర్రంపోడ్ మండల కేంద్రంలో నిర్వహించిన బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. పది రోజులైనా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు కొనుగోలు చేసే పరిస్థితి లేదని, రైతులు ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఢిల్లీకి కప్పం కట్టే పనిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని, రైతుల బాధలు మాత్రం పట్టడం లేదని విమర్శించారు. ఎస్ఎల్‌బిసి ప్రమాదం జరిగినా మృతదేహాలను కూడా వెలికి తీయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇదేనన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని, రైతు రుణమాఫీ పూర్తిగా జరగలేదని ఆరోపించారు. జిల్లాలో మిల్లర్ల వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు ముడుపులు తీసుకుంటూ రైతుల పొట్ట కొడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భగత్ యాదవ్, కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మల్లయ్య యాదవ్, మాజీ జడ్పి చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లాలో జరగనున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) పరీక్షలు జరగనున్న నేపథ్యంలో, పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు 163 బిఎన్ఎస్ఎస్ 2023 సెక్షన్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. ఈ ఆంక్షలు సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల్లో పరీక్షలు జరగనున్న పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు. తేది. 20.04.2026 నుండి 27.04.2026 వరకు పరీక్ష జరిగే ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులు కలిగి ఉండడం నేరమన్నారు. ఎగ్జామినేషన్ మెటీరియల్‌కు సంబంధించిన నిషేధిత కాగితాలను తీసుకెళ్లడం పూర్తిగా నిషేధమన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసేలా అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు తగిన బందోబస్తు, రక్షణ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

## అవకతవకలు జరిగితే సహించం: సిపిఐ



**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల):** మండలంలోని ఐకేపీ, సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా రైతుల నుంచి సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు.ఆదివారం రైతులతో కలిసి స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరారు.దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుంచి నేరుగా ధాన్యం సేకరించాలని, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌ను 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.గన్నీ బ్యాగుల కొరత లేకుండా వెంటనే సరఫరా చేయాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. రైతుల వద్ద కాంటా వేస్తున్న మే)లు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఇది నిజమైతే రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మం డల సహాయ కార్యదర్శి ధనావత్ శాంత,సీనియర్ నాయకులు ధీరావత్ లింగా నాయక్,జమ్ముల కోటయ్య,భాగం శేషయ్య పాల్గొన్నారు.

‘ టాలీవుడ్‌లో మొట్టమొదటి వాలీబాల్ నేపథ్యంలోని స్పోర్ట్స్ డ్రామా ‘వాలీ’ తన టైటిల్‌ను ఆసక్తికరమైన మోషన్ పోస్టర్ ద్వారా అధికారికంగా విడుదల చేసింది. ఈ మోషన్ పోస్టర్‌ను దర్శకుడు క్రిష్ జగర్లమూడి తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా విడుదల చేశారు. ’






## వాలీబాల్ క్రీడా నేపథ్యంలో ‘వాలీ’

టాలీవుడ్‌లో మొట్టమొదటి వాలీబాల్ నేపథ్యంలోని స్పోర్ట్స్ డ్రామా ‘వాలీ’ తన టైటిల్‌ను ఆసక్తికరమైన మోషన్ పోస్టర్ ద్వారా అధికారికంగా విడుదల చేసింది. ఈ మోషన్ పోస్టర్‌ను దర్శకుడు క్రిష్ జగర్లమూడి తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా విడుదల చేశారు. జి విక్రమ్ రెడ్డి సమర్పణలో ఫైర్‌వాటర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి దిలీప్ కె. మనుకొండ దర్శకత్వం వహిస్తున్నారు. తీర ప్రాంత గ్రామీణ నేపథ్యంలో సాగనున్న ఈ సినిమా, ఇద్దరు అన్నదమ్ముల జీవితాలను కేంద్రీకరించి, వాలీబాల్ క్రీడలోని తీవ్ర పోటీ, భావోద్వేగాలు, మానవ సంబంధాల్ని ప్రతిబింబిస్తుంది.ఈ చిత్రంతో రోనిత్ జిఆర్‌జి హీరోగా పరిచయం అవుతున్నాడు. ఇదే చిత్రంతో పరిచయం కాబోతున్న నిపుణ్ సత్య ఈ చిత్రంలో ముఖ్య పాత్రను చేస్తున్నాడు. ఈ చిత్రంలో అభిగ్న్య వుత్తలూరు హీరోయిన్‌గా నటిస్తోంది. రవి వర్మ, కల్పలత, వడ్లమాని శ్రీనివాస్, లక్ష్మణ్ మీసాల, కిరణ్ వరణాసి, రమణ భార్గవ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తూ బలమైన నటీనటుల సమూహాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని జి.రోహన్ రెడ్డి నిర్మిస్తుండగా, శ్రీనివాస్ కారంకి సహ నిర్మాతగా, స్నేహ దాసరి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను దిలీప్ కె. మనుకొండ మరియు పవన్ కె. విప్పర్తి సంయుక్తంగా రచించారు. అరుణ్ వి జెకె సినిమాటోగ్రఫీ అందించగా, ఔరానోవా స్టూడియోస్ సంగీతాన్ని సమకూర్చింది. ఎడిటింగ్‌ను రవితేజ గిరిజాల ని ర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉ ప్పాడ పరిసర ప్రాంతాల్లో అందమైన లొకేషన్‌లలో చిత్రీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ ప నుల్లో బిజీగా ఉంది. అన్ని పనులు పూర్తి చేసి త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ‘రెటీనా’ షూటింగ్ షురూ



అల్లం రాజు దర్శకత్వంలో మనీష్, సోనియా నాయుడు, ప్రీతీ హెస్సోనా హీరో హీరోయిన్‌లుగా పార్వతి సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.1 చిత్రం ఆదివారం రామానాయుడు స్టూడియోలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమా ప్రారంభోత్సవంలో ప్రముఖ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ మూహూర్తం షాట్‌పై క్లాప్ నివ్వగా, ‘రజాకార్’ దర్శకుడు యాట సత్య నారాయణ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి షాట్ కు ‘కమిటీ కుర్రోళ్ళు’ఫేమ్ యశ్వంత్ పెండ్యాల దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి పార్వతి నిర్మాత. అనంతరం జరిగిన ప్రెస్ మీట్‌లో దర్శకుడు అల్లం రాజు మాట్లాడుతూ పార్వతి సినిమాస్ ప్రొడక్షన్ నెం.1గా ప్రేక్షకుల ముందుకొచ్చే ఈ నూతన చిత్రం ‘రెటీనా’ అందరూ మెచ్చేలానే ఉంటుంది. ప్రతీ ఒక్కరికీ సంతృప్తిని కలిగించేలా ఈ సినిమాను తెరకెక్కిస్తాం. ‘రెటీనా’ అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యం. ప్రేక్షకులకు రియల్ అనుభూతి ఇవ్వాలని సినిమాని అందం గా రూపొందిస్తాం. టెక్నికల్ బ్రిలియన్స్‌తో పాటు భావోద్వేగాలు, సహజమైన పరిస్థితులు అన్నీ ఈ సినిమాలో మిళితమై ఉంటాయి. ప్రేక్షకులకు గొప్ప అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో సినిమాను రూపొందిస్తాం’’ అని అన్నారు. యోగికత్రి, సతీష్, పూజిత, విజయలక్ష్మి, కె.వి.ఎల్. నరసింహారావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : పి. కె. రవి కుమార్, డైరక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ : రవి.కె.రెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్: రాకేష్, ప్రొడక్షన్ డిజైనర్ : ఎ.వాసు.

## ‘జింగాలా’ సాంగ్ రిలీజ్



డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి ‘గాయపడ్డ సింహం’తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్కర్స్, పిఎవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్‌లపై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం ట్రైలర్, ప్రమోషనల్ సాంగ్, ‘బ్రైడ్ సాంగ్’ అంచనాలు పెంచాయి. తాజాగా మేకర్స్ జింగాలా సాంగ్ రిలీజ్ చేశారు. గాయపడ్డ సింహం(తరుణ్ భాస్కర్ ) మనసులో దాగి ఉన్న బాధను, ఆవేశాన్ని, తిరిగి లేచే శక్తిని అద్భుతంగా ఆవిష్కరించే పాట ‘జింగాలా’. స్వీకర్ అగస్తి సంగీతం ఈ పాటకు ఎలక్ట్రిఫైయింగ్ ఎనర్జీని అందించగా, నకాష్ అజీజ్ వోకల్స్ మరింత ఎనర్జీ ఇచ్చింది. కశ్యప్ శ్రీనివాస్, సునీల్ కరంకంటి, శ్రీని జోస్యుల లిరిక్స్ తరుణ్ మనసులోని గాయాలు, కోపం, ప్రతీకారం అన్నీ ఫన్ నోట్‌లో ప్రజెంట్ చేశాయి. బాధను బీట్‌గా మార్చుకుని కంపోజ్ చేసిన పాటలో తరుణ్ భాస్కర్ పెర్ఫామెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సాంగ్ సోషల్ మీడియాలో ఇంస్టెంట్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి విద్యా సాగర్ చింతా సినిమాటోగ్రఫీ, విప్లవ్ నైషదం ఎడిటింగ్‌న, చంద్రిక గొర్రెపాటి ప్రొడక్షన్ డిజైన్, సూర్య ప్రకాష్ జోస్యుల కథను అందిస్తున్నారు. గాయపడ్డ సింహం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. తరుణ్ భాస్కర్, ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి, విష్ణు ఓయి, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్, తదితరులు నటిస్తున్నారు.


## ‘రేలంగి అవార్డు’ జీవితంలో మర్చిపోలేనిది

### హాస్య నటుడు బాబు మోహన్



తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టి 41 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నటుడు, మాజీ మంత్రి, విశ్వ నట సామ్రాట్ డాక్టర్ బాబు మోహన్‌ను తెలుగు ఫిలిం టెలివిజన్ వెల్ఫేర్ ఫార్మ్ అండ్ భారత్ కల్చరల్ అకాడమీ ప్రఖ్యాత రేలంగి అవార్డుతో సత్కరించారు. సుమారు 2000 చిత్రాలలో నటించిన బాబు మోహన్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్న కుమార్, నాగ బాల సురేష్, హీరో రాంకీ, నటుడు 30 ఇయర్స్ పృథ్వి పాల్గొన్నారు. ఫిలిం ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బాబు మోహన్ మాట్లాడుతూ లేబర్ యాజమాన్య మంత్రిగా చాలా అరుదుగా చేశారు. అటువంటి మంత్రిగా చేయడం నాకు చాలా గర్వంగా ఉంది. నేను మొత్తం ఆ వ్యవస్థ అంతా కాపాడుకోవాలి, చాలా కఠినంగా పని చేసే వాడిని. అప్పటికే రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పని చేయడం వల్ల నాకు సులభం అయిపోయేది. నాకు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు కూడా కొన్ని సినిమాలలో నటిస్తున్నాను. ఆ చిత్రాలలో నా పాత్రలు ఎంతో అద్భుతంగా ఉండబోతున్నాయి. నా తొలి చిత్రాలలో నా నటన చూసి అందరూ నన్ను మరింత ప్రోత్సహించారు. రాజకీయాలకు దూరం అయిన తర్వాత ఒక ట్రస్ట్ పెట్టి, సేవా కార్యక్రమాలు చేయడం మొదలు పెట్టాను. ఇలా చేస్తున్నందుకు, మీ అందరితో కలిసి ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. నాకు రేలంగి అవార్డు వచ్చిన సందర్భంగా రేలంగి గారి ఇంటి వద్ద బాణసంచారాలు పేలాయి అనే విషయం తెలిసిన సంతోషంగా ఉందని అన్నారు. 2000 చిత్రాలకు పైగా నటించిన వ్యక్తికి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని దర్శకుడు నాగబాబు సురేష్ డిమాండ్ చేశారు.

## ప్రశాంత్ నీల్ సమర్పణలో ‘హర్రర్ చిత్రం 418’



మైత్రీ మూవీ మేకర్స్, కీజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కొలాబరేషన్ లో కలసి సరికొత్త హర్రర్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్నారు. సూర్య రాజ్ వీరబత్తిని, హను రెడ్డి, ప్రీతి పగడాల ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. గ్రామంలోని మెడికల్ కాలేజ్‌లో నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతోంది. సైన్స్–మిస్టరీ, సైన్స్, మూఢనమ్మకానికీ అర్థం కాని ఒక సీక్రెట్‌తో ఇప్పటివరకూ చూడని సరికొత్త కథతో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో శ్రీ వైష్ణవ, శశాంక్ పాటిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దినేష్ దివాకరన్ డిఒపి, వెంకీ జి.జి మ్యూజిక్ అందిస్తున్నారు. మోహన్ బి.ఎస్ డైలాగ్స్ రాస్తున్నారు.

## అమ్మ పాత్రలు సంతృప్తినిస్తాయ్

### సీనియర్ నటి రాజశ్రీ



అమ్మ పాత్రలు చెయ్యడం చాలా ఈజీ కదా అనిపిస్తుంది. కానీ అమ్మ పాత్రలో మెప్పించడం అంత సులభమేమి కాదు. ఎన్ని రకాల పాత్రలు చేసినా అమ్మ పాత్ర అనే సరికి ఆ పాత్రకు సరిగ్గా సరిపోవాలి. హీరోకు లేదా హీరోయిన్‌కు నిజంగానే అమ్మలాగా చూసే ప్రేక్షకులకు అనిపించాలి అప్పుడే అమ్మపాత్రకు పరిపూర్ణమైన న్యాయం జరుగుతుంది అంటోంది సీనియర్ నటి రాజశ్రీ. సినిమాల్లో, డైలీ సీరియల్స్‌లోనూ ఎక్కువగా అమ్మ పాత్రలు చేసి మెప్పించి, నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రాజశ్రీ నటనా జీవితంలో తన ముప్పై ఏళ్ళ అనుభవాన్ని చిట్ చాట్‌లో పంచుకున్నారు. మాది గుంటూరు .. ఆ తరువాత రాయలసీమకు షిఫ్ట్ అయ్యాము. నా చిన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చేశాం. నాకు స్కూల్ డేస్ నుంచే రైటింగ్ పై మక్కువ ఉండేది. కవితలు , కథలు రాసేదాన్ని. నేను రాసిన కథలు, కవితలు అప్పట్లో పలు పత్రికల్లో ప్రింట్ అయ్యాయి కూడా. ఇప్పటికీ కవితలు కథలు రాస్తూనే ఉంటాను. కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్య మంత్రి ఉన్న సమయంలో మద్యపాన నిషేధం మీద ’కొత్త మలుపు’’ అనే కథ రాసి దాన్ని నేనే నిర్మించాను. భర్త తాగుడుకు బానిసైతే ఆ కుటుంబం ఎలా నాశనం అవుతుంది అనే కాన్సెప్ట్‌తో నిర్మించిన ఆ టెలీఫిల్మ్‌కు అప్పట్లో నంది అవార్డు వచ్చింది. పరిశ్రమలో అప్పటికి మొట్ట మొదటి మహిళా నిర్మాతను నేనే. అలా యాక్టింగ్ వైపు కూడా దృష్టి పెట్టాను. ఒకసారి తల్లి పాత్ర చేస్తే వరుసగా అలాంటి తల్లి పాత్రల కోసమే అడుగుతారు. ఆర్టిస్ట్‌గా ప్రతి వైవిధ్యమైన పాత్ర చెయ్యాలని ఉంటుంది. కానీ అవి మన దగ్గరికి రావాలి. అలా వచ్చిన ప్రతి పాత్రను సద్వినియోగపరచుకుంటాను. ఆ పాత్రకు న్యాయం చేస్తాను.

# సబ్బండ వర్గాలను మోసగించిన కాంగ్రెస్

-ముగ్గురు మంత్రుల మధ్య సఖ్యత కరువు

-మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ రైతులు, కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, మహిళలు సహా సబ్బండ వర్గాలను మోసం చేసిందని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ నాయకులు తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేకపోతున్నారని ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రుల మధ్య సక్యత లేదని వారు ఏనాడు జిల్లా అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడలేదని ఆయన తెలిపారు. ఆదివారం స్థానిక మమత మెడికల్ కళాశాల మైదానంలో బిఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన సందర్భంగా ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఖమ్మం నగర బిఆర్‌ఎస్ అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో హరీష్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ లేదని రెండు లక్షల ఉద్యోగాలంటూ కేవలం 16వేల ఉద్యోగాలు మాత్రమే కల్పించారని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని, రిటైర్ ఉద్యోగులు నిరహార దీక్షలు చేస్తున్నారని, రైతులు, మహిళలు, దళితులను, గిరిజనులను మోసం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా మక్కలు పండించే ఖమ్మంజిల్లాలో మక్కలు కొనుగోలు చేయక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. వడ్లు కొనే నాధుడు కనిపించడం లేదని చాలా ప్రాంతాల్లో మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని హరీష్‌రావు తెలిపారు. శాసన సభలో తుమ్మల నాగేశ్వరరావు రుణమాఫీ పూర్తి అయిందని ప్రకటించారని సిద్దిపేటలో కానీ రఘునాథపాలెంలో కానీ తాను రైతుల సమక్షంలో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నానని పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగితే రాజీనామా చేయడానికి నేను సిద్ధమని తుమ్మల సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. జిల్లాకు చెందిన మరో మంత్రి భూబకాసురుని అవతారం ఎత్తారని ఆయన క్రషర్లు, మైన్స్ కబ్జా చేసే పనిలో ఉన్నారని హరీష్‌రావు ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న ఖమ్మం జిల్లాకు ఉపయోగం లేదని భట్టి విక్రమార్క సొంత నియోజక వర్గంలోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం మొత్తం ఇప్పుడు ఒక నినాదం మారుమ్రోగుతుందని అదే రేవంత్ పోవాలి కేసిఆర్ రావాలి అనే నినాదమని హరీష్ రావు తెలిపారు. ఖమ్మం జిల్లాకు మెడికల్ కళాశాలతో పాటు అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఘనత బిఆర్‌ఎస్‌కు కేసిఆర్‌కు దక్కుతుందని రేవంత్‌ను ఇంటికి పంపించేందుకు కార్యకర్తలు పని చేయాలన్నారు. చరిత్రను తిరగరాస్తూ పదికి పది స్థానాల్లో గెలిచేవిధంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ మంత్రి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాను సంక్షేమం, అభివృద్ధి విషయంలో కేసిఆర్, కేటిఆర్, హరీష్‌రావు సహకారంతో ఒక బంగారు తునకగా తయారు చేశామన్నారు. కాంగ్రెస్ పతనానికి ఖమ్మం నుంచే అంకురార్పణ జరగాలన్నారు. బిఆర్‌ఎస్‌తో అనుబంధం దశాబ్ద కాలం పూర్తయిందని భవిష్యత్తులో కేసిఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు కృషి చేస్తానని అదే తన లక్ష్యమని అజయ్‌కుమార్ ప్రకటించారు. ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని రానున్న కార్పొరేషన్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.ఈ సభలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య తదితరులు ప్రసంగించగా మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, గట్టు రాంచంద్రరావు, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## జీవరాశుల గొంతుకగా ‘తెలంగాణ అస్తిత్వ వేదిక’ : ప్రొఫెసర్ చక్రపాణి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నోరులేని 84 లక్షల జీవరాశులకు ‘తెలంగాణ అస్తిత్వ వేదిక’ గొంతుకగా మారుతుందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విసి, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ హాల్‌లో ఆదివారం ‘తెలంగాణ అస్తిత్వ వేదిక’ ఆవిర్భావ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి చైర్మన్‌గా వి. ప్రకాష్, కన్వీనర్‌గా పిట్టల రవీందర్, కోఆర్డినేటర్‌గా శ్రీధర్ దేశ్ పాండే నియామకమైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ అస్తిత్వం (వ్యాసాల సంకలనం), మరో శ్రీకృష్ణ కమిటీ నివేదిక( ఘోష్ కమీషన్ నివేదికపై విశ్లేషణ) పుస్తకాలను ఆవిష్కరించారు. తెలంగాణ అస్తిత్వ వేదిక ఆవిర్భావం సందర్భంగా ప్రథమ జీవన సాఫల్య సాధన పురస్కారాన్ని సీనియర్ జర్నలిస్టు ఎస్. వెంకట్ నారాయణకు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఘంట చక్రపాణి(అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్), దేవులపల్లి అమర్(ఐజెయు మాజీ అధ్యక్షులు), అల్లం నారాయణ(సీనియర్ జర్నలిస్టు), కె. శ్రీనివాస్ రెడ్డి(తెలంగాణ టుడే ఎడిటర్) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ అస్తిత్వం అంటే మన గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును ఆవిష్కరించే ఆత్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సబ్బండ వర్గాలు ఏకమై ఒక తాటిపైకి వచ్చినట్లు, తెలంగాణ అస్తిత్వం కోసం మరోసారి రావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అస్తిత్వ వేదిక తెలంగాణ పాలకులకు మార్గదర్శిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా మీడియాలో ఎలాంటి మార్పు రాలేదని, ఇప్పటికీ మీడియా మొత్తం ఆంధ్రా వాళ్ల చేతుల్లోనే నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ అస్తిత్వ వేదిక తప్పనిసరిగా అవసరముందని పేర్కొన్నారు. అల్లం నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి ప్రధాని మోదీ, ఎపి సిఎం చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతాలతో పనిచేస్తున్నారన్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రస్తుతం వివక్షకు గురవుతున్నట్లు అనిపిస్తుందని, ఈ సమయంలో తెలంగాణ అస్తిత్వ వేదిక రావడం అనేది చారిత్రక అవశ్యకతగా భావిస్తున్నానన్నారు. వి.ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వ వేదిక ప్రారంభానికి ఇది సరైన సమయమనీ కొందరు చెబితే, 12 ఏళ్ల కిందటే ప్రారంభమైతే బాగుండేదని మరికొందరు చెబుతున్నారని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక సహజ వనరులు(ప్రకృతి, పర్యావరణం, నదులు, ఇసుక) దోపిడీకి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిట్టల రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చామని, ప్రత్యేక రాష్ట్రం సాధించి 12 ఏళ్లు గడుస్తున్నా 90 శాతం వరకు అమలు కాకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటశాల అశోక్, బిఎస్.రాములు, రాఘవరెడ్డి, సీతారామరావు తదితరులు పాల్గొన్నారు.

## నటులు, రాజకీయ నాయకులకు స్వరమే ప్రధానం

### సినీ నటుడు మురళీమోహన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నటులు, రాజకీయ నాయకులకు సమాజంలో గుర్తింపు రావడానికి స్వరమే ప్రధాన కారణమని, ఆ స్వరమే సక్రమంగా లేకపోతే ఆత్మవిశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని ప్రముఖ సినీ నటుడు, మాజీ ఎంపి మాగంటి మురళీమోహన్ అన్నారు. తమ స్వరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. ‘ప్రపంచ స్వర దినోత్సవ’ సందర్భంగా ‘అసోసియేషన్ ఆఫ్ వాయిస్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఫౌండర్ డాక్టర్ వి. ఫణీంద్ర కుమార్’ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విరించి హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఆదివారం ‘ప్రొఫెషనల్ వాయిస్ కేర్ సొసైటీ ఆఫ్ ఇండియా’ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. ప్రముఖ గాయని ఎస్.పి. శైలజ మాట్లాడుతూ గాయకులకు స్వరం ప్రాణం వంటిదని, ఆ స్వరం బాగుంటేనే భావాలను వ్యక్తం చేయవచ్చన్నారు. ఫౌండర్ అసోసియేషన్ ఆఫ్ వాయిస్ సర్జన్స్ ఆఫ్ ఇండియా , మెలోడీ వాయిస్ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ వి. ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ మానవులలో మాత్రమే ఉండే ’వోకల్ లిగమెంట్’ అనే కండరం వల్ల మనకు ఈ అద్భుతమైన స్వర శక్తి లభించిందని వివరించారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం ద్వారా స్వర నాడులను రక్షించుకోవచ్చని సూచించారు. రోజుకు 8 నుంచి 10 గ్లాసుల నీరు తాగుతూ హైడ్రేటెడ్ గా ఉండటం వాయిస్‌కు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విరించి హాస్పిటల్స్ ప్రతినిధి వేదుల సత్యనారాయణ, సిఒఒ శ్యామ్ దావల, డా. వి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ నోటీస్!

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నారు. అయితే, ఈ నోటీసును ఏ సభలో ప్రవేశపెట్టాలి, లేదా గతసారి చేసినట్లుగా ఉభయ సభలలో ప్రవేశపెట్టాలా అనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆ వర్గాలు తెలిపాయి. శుక్రవారం లోక్‌సభలో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఓటమి పాలవడంతో ఉత్సాహంగా ఉన్న ప్రతిపక్ష నాయకులు, ఈ నోటీసుపై మరింత మంది ఎంపిల సంతకాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, కనీసం 200 సంతకాలను సమీకరించాలని చూస్తున్నారని ఆ వర్గాలు తెలిపాయి. ‘మేము మా సత్తా చాటాలనుకుంటున్నాము. గతసారి అంచనా వేసిన సంఖ్య తక్కువని మేము ముందుగా నిరూపించాలి’ అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. సిఇసి కుమార్ స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగ విశ్వసనీయతను కాపాడటంలో విఫలమయ్యారని, కార్యనిర్వాహక వర్గం అదుపులో పనిచేస్తున్నారని తమ మునుపటి నోటీసులలో ప్రతిపక్షం ఆరోపించింది. కార్యనిర్వాహక వర్గం ప్రభావంతో కూడిన రాజీ నియామకం, ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకున్న ‘గ్రేడెడ్ రెస్పాన్స్’ సిద్ధాంతం వంటి పక్షపాతపూరిత పనితీరు, ఎన్నికల మోసాల దర్యాప్తుకు ఆటంకం కలిగించడం, డేటా, సామాగ్రిని పంచుకోవడానికి నిరాకరించడం ద్వారా పారదర్శకతను దెబ్బతీయడం వంటి కారణాలతో సిఇసిపై నిరూపితమైన దుష్ప్రవర్తన ఆరోపణలతో విస్తృతమైన అభియోగాలు మోపాయి. అంతేకాకుండా, బిహార్, ఇతర ప్రాంతాలలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియల ద్వారా పెద్ద ఎత్తున ఓటు హక్కును రద్దు చేయడానికి ఆయన దోహదపడ్డారని, సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించారని లేదా పాటించడంలో జాప్యం చేశారని, రాజకీయ కార్యనిర్వాహక వర్గంతో కలిసి పనిచేస్తూ, తద్వారా ఎన్నికల సంఘం స్వాతంత్ర్యాన్ని దెబ్బతీశారని కూడా ఆరోపించారు. అయితే, దాదాపు ఇలాంటి ప్రతిస్పందనలలోనే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మన్ సి పి రాధాకృష్ణన్ ఆ నోటీసులను తిరస్కరించారు. ఒకవేళ ఆ ఆరోపణలు నిజమని భావించినప్పటికీ, తొలగింపునకు అవసరమైన దుష్ప్రవర్తన అనే ఉన్నత రాజ్యాంగ ప్రమాణాన్ని అవి అందుకోలేదని వారు పేర్కొన్నారు.

## రేపు ఇరాన్‌తో చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ధ్వంసం చేస్తాం, నేనింక అస్సలు మంచివాణ్ణి కాదు, వారి వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు చాలా వేగంగా సులభంగా ధ్వంసమైపోతాయి, ఇక ఇరాన్ హత్యాయంత్రాంగానికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైనట్టే’’ అని ప్రకటించారు. మధ్యవర్తి దేశం పాకిస్థాన్ వదలకుండా ఇరుపక్షాలతో ముమ్మరంగా చర్చలు కొనసాగిస్తుండగా, శత్రుదేశాలు రెండూ తమ తమ వైఖరులు మార్చుకోకుండా వాటికే కట్టుబడి ఉన్నాయి. తమ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం తొలగిపోయేవరకూ హోర్ముజ్ పూర్తిగా మూతపడే ఉంటుందని, ఒక్క నౌకను కూడా జలసంధిని దాటి వెళ్ళనీయబోమని ఇరాన్ తన వైఖరిని ఆదివారం మరోసారి పునరుద్ఘాటించింది. ఒప్పందం కుదుర్చుకోకపోతే మళ్ళీ ఇరాన్‌పై బాంబు దాడులు ప్రారంభమవుతాయని ట్రంప్ కూడా ఇప్పటికే స్పష్టం చేశారు.

**ఒప్పందంకోసం ట్రంప్ వస్తున్నారంటూ పాకిస్థాన్‌లో భారీ భద్రత**

అమెరికాతో సోమవారం రెండో విడత చర్చలకు ఇరాన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించినప్పటికీ మంగళవారం చర్చలు జరుగుతాయని ట్రంప్ చెప్పడంతో విదేశీ అతిథుల భద్రత నిమిత్తం ఇస్లామాబాద్‌లో సెక్యూరిటీ ప్రోటోకాల్‌ను కట్టుదిట్టం చేశారు. పాకిస్థాన్ ప్రభుత్వ అధికారులు అత్యంత కఠినమైన ఏర్పాట్లు చేశారు. ఇస్లామాబాద్ సమీప నగరం రావల్పిండిలో 10,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. 600 చెక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. విమానాలు,డ్రోన్లను నిషేధించారు. ఒప్పందంపై సంతకాలు చేసేందుకు ట్రంప్ పాకిస్థాన్‌లో పర్యటిస్తారని సర్వత్రా వార్తలు ప్రచారంలో పెట్టారు. దీంతో సైనిక కేంద్రాలు కూడా అప్రమత్తంగా ఉన్నాయి. ఏప్రిల్ 11,12 తేదీలలో అమెరికా–ఇరాన్ ప్రతినిధులు 21 గంటలసేపు ఇస్లామాబాద్‌లో జరిపిన చర్చలు ఎలాంటి ఏకాభిప్రాయం, ఒప్పందం లేకుండా విఫలమైనప్పటికీ దీనిని అతిపెద్ద ముందు అడుగుగా ప్రపంచదేశాలు భావించాయి. పశ్చిమాసియా సమస్య పరిష్కారమయ్యేవరకూ తమదేశం శాంతి ప్రయత్నాలు కొనసాగిస్తుందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సహా ఈ విషయంలో ముఖ్యపాత్ర వహిస్తున్న మంత్రుల ప్రకటించారు. మరోవైపు అమెరికా కూడా, ఈ చర్చలకు పాకిస్థాన్ దేశం ఒక్కటే మధ్యవర్తిగా ఉందని ప్రకటించింది. షెహబాజ్ షరీఫ్ సౌదీఅరేబియా,ఖతార్, టర్కీ దేశాలలో పర్యటించారు. పాకిస్థాన్ సర్వసైన్యాధినేత ఆసిమ్ మునీర్ ఇరాన్ వెళ్ళి ముగ్గురు ముఖ్యనాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఇరాన్ సానుకూల దృష్టితో ఉన్నప్పటికీ తన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com